www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సుపరిపాలనలో తొలి అడుగు 4.1

గురువారం | 12-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 57 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: పాడ్యమి మ.2.28 తదుపరి విదియ, నక్షత్రం: మూల రా.9.57 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: రా.8.13-9.57, దుర్ముహూర్తం: ఉ.10.04-10.56, మ.3.17-4.09, అమృతఘడియలు: మ.3.04-4.47, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.46 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 12 జూన్ 2025

కాంబ్లీని అప్పుడే హెచ్చరించా.. ఇప్పుడదే జరిగింది..!



యోగ్‌రాజ్ కాంబ్లీ

న్యూఢిల్లీ: కెరీర్‌పై దృష్టి సారించాలని అంతర్జాతీయ క్రికెట్‌లోకి ప్రవేశించిన తొలినాళ్లలోనే వినోద్ కాంబ్లీకి సలహా ఇచ్చానని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ వెల్లడించాడు. 'అర్ధరాత్రి వరకు జరిగే పార్టీల్లో గడపడం, సిగరెట్లు తాగడం, యువతుల వద్దకు వెళ్లే అలవాట్లను మానుకోవాలని ఒకసారి కాంబ్లీకి చెప్పా. లేదంటే నీ కెరీర్ నాశనం అవుతుందని కూడా హెచ్చరించా. ఇప్పుడు చూడండి. అదే జరిగింది. కానీ కాంబ్లీ నాతో మాట్లాడుతూ..'సార్ ఇవి మీ రోజులు కావు' అని చెప్పాడన్నాడు. అప్పట్లో తానే రాజునని కాంబ్లీ భావించేవాడు' అని ఓ ఇంటర్వ్యూలో యోగ్‌రాజ్ చెప్పుకొచ్చాడు.

బంగ్లా చెస్ ప్లేయర్‌ను తిప్పిపంపిన అధికారులు

న్యూఢిల్లీ: గతంలో వీసా నిబంధనలు ఉల్లంఘించిన బంగ్లాదేశ్ చెస్ క్రీడాకారిణికి భారత ఇమ్మిగ్రేషన్ అధికారులు అనుమతి నిరాకరించారు. విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకొని తర్వాతి రోజు తిప్పిపంపారు. ఢిల్లీ అంతర్జాతీయ ఓపెన్ గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో పాల్గొనేందుకు బంగ్లా వెటరన్ ఐఎం రాణీ హమీద్ అలియాస్ సయిదా జసిమున్నీసా ఖాతూన్ (80) వచ్చింది. ఆమె తనకు తోడుగా మరో క్రీడాకారిణి ఆషియా సుల్తానా (37)ను భారత్‌కు తీసుకొచ్చింది. అయితే, సుల్తానా గతంలో మెడికల్ వీసాపై వచ్చి కోల్‌కతాలో ఓ టోర్నీలో పాల్గొంది. దీంతో ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఆమెను బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో దిగగానే సుల్తానాను అదుపులోకి తీసుకొన్న అధికారులు.. మరో విమానంలో బంగ్లాకు తిప్పిపంపారు. ఈ ఘటనపై హమీద్ మాట్లాడుతూ ప్రయాణంలో వృద్ధురాలైన తనకు సుల్తానా ఎంతో సాయంగా ఉండేదని చెప్పింది.



గిల్ జడేజా

ముమ్మర సాధన

లండన్: యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం భారత్ కఠోరంగా శ్రమిస్తోంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల రిటైర్మెంట్‌తో ప్రస్తుతం జట్టులో అనుభవలేమి బాగా కనిపిస్తోంది. కానీ, కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలు, సూచనలతో టీమిండియా సంచలనాలు నమోదు చేయాలనుకొంటోంది. కెప్టెన్‌గా గిల్‌కు కూడా ఇది తొలి సిరీస్ కావడంతో అతడిపై ఒత్తిడి నెలకొనే అవకాశం ఉంది. ప్రస్తుతం బెకెన్‌హామ్‌ను బేస్‌గా చేసుకొన్న టీమిండియా ఈ నెల 20 నుంచి జరిగే సిరీస్ కోసం ముమ్మరంగా సాధన చేస్తోంది. భారత్-ఎ తరఫున చాలా మంది ఆటగాళ్లు ఈపాటికే ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికార టెస్టులు ఆడేశారు. శుక్రవారం భారత జట్ల మధ్యే మూడో ప్రాక్టీస్ మ్యాచ్ జరగనుంది. అయితే, గంభీర్ మాత్రం ప్రతి విషయాన్ని



సీరియస్‌గా తీసుకొంటున్నట్టు తెలుస్తోంది. జట్టుకు బ్యాటింగ్ సాధనలా కాకుండా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ప్రాక్టీస్ వికెట్లను రూపొందించాలని క్యూరేటర్లకు సూచించాడట. సహజంగా ఇంగ్లిష్ పిచ్‌లు స్వింగ్‌కు ఎక్కువగా సహకరిస్తాయి. ఈ నేపథ్యంలో భారత కోచింగ్ సిబ్బంది మ్యాచ్ ప్రాక్టీస్ కోసం చక్కని వికెట్ కావాలని కోరినట్టు క్యూరేటర్ జోష్ మార్డెన్ తెలిపాడు. అందుకు అనుగుణంగా వికెట్‌ను రూపొందించినట్టు చెప్పాడు.

క్యాచింగ్.. త్రోయింగ్

టెస్ట్ సిరీస్ కోసం టీమిండియా తీవ్రంగా సాధన చేస్తోంది. గిల్ అండ్ కో ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను బీసీసీఐ నెట్‌లో షేర్ చేసింది. ఫీల్డింగ్ కోచ్ దిలీప్.. ఆటగాళ్లతో క్యాచింగ్, త్రోయింగ్ ప్రాక్టీస్ చేయించాడు. కాగా, సుదర్శన్ అద్భుత క్యాచ్‌ను గిల్ ప్రశంసించాడు.

శ్రేయా‌స్‌కు గంగూలీ మద్దతు

ఫామ్ ఆధారంగా శ్రేయాస్ అయ్యర్‌కు జట్టులో చోటు కల్పించి ఉండాల్సిందని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. మిడిలార్డర్‌లో శ్రేయాస్ ఎంతో ఉపయుక్తమైన ఆటగాడని చెప్పాడు. ఏడాదిగా పరుగుల వరద పారిస్తున్నా సెలెక్టర్లు అతడిని పట్టించుకోలేదని గంగూలీ అన్నాడు. ఈ సిరీస్‌కు శ్రేయా‌స్‌ను ఎంపిక చేసి ఉంటే.. అతడు జట్టు కోసం ఏం చేసేవాడో తెలిసేదని దాదా చెప్పాడు.

టాప్-3లో తిలక్

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్: టీమిండియా యువ ఆటగాడు తిలక్ వర్మ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్-3లోకి దూసుకొచ్చాడు. బుధవారం ఐసీసీ విడుదలజేసిన ర్యాంకింగ్స్ బ్యాటింగ్ విభాగంలో తిలక్ ఓ స్థానం ఎగబాకి మూడో ర్యాంక్‌లో నిలిచాడు. తిలక్ 804 రేటింగ్ పాయింట్లతో ఉన్నాడు. భారత్‌కే చెందిన అభిషేక్ శర్మ 829 పాయింట్లతో రెండో ర్యాంకులో ఉన్నాడు. ట్రావిస్ హెడ్ (856) టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బౌలర్ల విభాగంలో భారత్ నుంచి వరుణ్ చక్రవర్తి 3, రవి బిష్ణోయ్ 7, అర్షదీప్ 10వ ర్యాంక్‌లతో టాప్‌టెన్‌లో కొనసాగుతున్నారు.

హాంప్‌షైర్ క్లబ్ తరఫున..

హైదరాబాద్: టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ ఇంగ్లిష్ కౌంటీల్లో ఆడనున్నాడు. ఈ ఎడమచేతివాటం బ్యాటర్ హాంప్‌షైర్ క్లబ్ తరఫున కౌంటీ చాంపియన్‌షిప్‌లో పోటీపడనున్నాడని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) బుధవారం ప్రకటించింది. యూకే కౌంటీ చాంపియన్‌షిప్‌లో తమ తరఫున ఆడాలంటూ హాంప్‌షైర్ క్లబ్ తిలక్‌ను సంప్రదించిందనీ, అందుకు అతను కూడా అంగీకరించాడని తెలిపింది. 22 ఏళ్ల తిలక్ భారత్ తరఫున 25 టీ20లు, 4 వన్డేలకు ప్రాతినిధ్యం వహించాడు. టీ20ల్లో 749, వన్డేల్లో 68 పరుగులు సాధించాడు.

బెంగళూరు కాదు.. రాజ్‌కోట్

'చిన్నస్వామి' మ్యాచ్‌ల తరలింపు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీబీ విజయోత్సవాల తొక్కిసలాట నేపథ్యంలో కర్ణాటక క్రికెట్ సంఘానికి బీసీసీఐ షాక్ ఇచ్చింది. నవంబరు 13-19 మధ్య బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఇండియా-దక్షిణాఫ్రికా-ఎ జట్ల మధ్య జరగాల్సిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను రాజ్‌కోట్‌కు మార్చారు. అలాగే సెప్టెంబరు-నవంబరులో బెంగళూరులో నిర్వహించాల్సిన ఐసీసీ మహిళా వరల్డ్‌కప్ మ్యాచ్‌లను కూడా మరో చోటికి తరలించే అవకాశం కనిపిస్తోంది.

ఐపీఎల్ సమయంలోనే పీఎస్ఎల్?

లాహోర్: వచ్చే ఏడాది కూడా ఐపీఎల్ సమయంలోనే పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్ (పీఎస్ఎల్)ను నిర్వహించేందుకు పాక్ బోర్డు యత్నిస్తోంది. సహజంగా పీఎస్ఎల్ కోసం ఫిబ్రవరి-మార్చి విండో ఉంది. అయితే, 2026 టీ20 వరల్డ్‌కప్‌ను కూడా ఫిబ్రవరి-మార్చిలో షెడ్యూల్ చేశారు. దీంతో ఏప్రిల్-మేలో ఐపీఎల్ జరిగే సమయంలోనే పీఎస్ఎల్‌ను జరపాలనుకొంటున్నారు. ఈ ఏడాది చాంపియన్స్ లీగ్ నేపథ్యంలో ఐపీఎల్ విండోలోనే పీఎస్ఎల్ కూడా నిర్వహించారు. ఇలా చేయడం వల్ల తమకు ఎటువంటి నష్టమూ కలగలేదని పీఎస్ఎల్ తెలిపింది.



రబాడ (5/51)

డబ్ల్యూటీసీ ఫైనల్

తొలిరోజే 14 వికెట్లు

● విజృంభించిన పేసర్లు ● ఆస్ట్రేలియా 212 ఆలౌట్
● స్మిత్, వెబ్‌స్టర్ అర్ధ శతకాలు ● దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 43/4

లండన్: పేసర్ల ఆధిపత్యం సాగిన వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో తొలి రోజే 14 వికెట్లు నేలకూలాయి. వెబ్‌స్టర్ (72), స్మిత్ (66) అర్ధ శతకాలతోపాటు బౌలర్లు రాణిస్తుండడంతో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా దీటుగా బదులిస్తోంది. రబాడ (5/51) నిప్పులు చెరగడంతో.. బుధవారం ఆరంభమైన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకు ఆలౌటైంది. జాన్సెన్ 3 వికెట్లు పడగొట్టాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ ఆరంభంలోనే తడబడింది. ఓపెనర్ ఖవాజా (0)ను డకౌట్ చేసిన రబాడ.. వన్‌డౌన్ బ్యాటర్ కామెరూన్ గ్రీన్ (4)ను కూడా స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన లబుషేన్ (17)ను జాన్సెన్ బోల్తా కొట్టించడంతో ఆసీస్ 46/3తో నిలిచింది. హెడ్ (11) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలబడలేక పోయాడు. ఈ దశలో జతకలసిన స్మిత్, వెబ్‌స్టర్ ఐదో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న స్మిత్‌ను మార్‌క్రమ్ అవుట్ చేయడంతో టీ విరామానికి ఆస్ట్రేలియా 190/5తో నిలిచింది. ఆఖరి సెషన్‌లో క్యారీ (23)ను కేశవ్, హాఫ్ సెంచరీ సాధించిన వెబ్‌స్టర్‌ను రబాడ వెనక్కిపంపారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 43/4తో కష్టాల్లో పడింది. మొదటి రోజు ఆట ఆఖరుకు బవుమా (3 బ్యాటింగ్), డేవిడ్ బెడింగమ్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు మార్‌క్రమ్ (0), రికెల్టన్ (16)ను స్టార్క్ వెనక్కిపంపాడు. ముల్డర్ (6)ను కమిన్స్ పెవిలియన్ చేర్చగా.. స్టబ్స్ (2)ను హాజెల్‌వుడ్ బౌల్డ్ చేశాడు. మొత్తంగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సౌతాఫ్రికా ఇంకా 169 పరుగుల దూరంలో ఉంది.



వెబ్‌స్టర్ (72)

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212 ఆలౌట్ (వెబ్‌స్టర్ 72, స్మిత్ 66; రబాడ 5/51, జాన్సెన్ 3/49).
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 43/4 (రికెల్టన్ 16; స్టార్క్ 2/10, కమిన్స్ 1/14).



ఎంఐ న్యూయార్క్ కెప్టెన్ పూరన్

న్యూయార్క్: అంతర్జాతీయ క్రికెట్‌కు అనూహ్యంగా వీడ్కోలు ప్రకటించిన వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) జట్టు ఎంఐ న్యూయార్క్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. 29 ఏళ్ల పూరన్ మంగళవారం రిటైర్మెంట్ ప్రకటించిన విషయం విదితమే. 'బౌలర్ల గుండెల్లో గుబులు రేపే ఈ ఎడమచేతివాటం బ్యాటర్ సారథ్యంలో ఎంఐ న్యూయార్క్ మరింత ఎత్తుకు ఎదుగుతుందని భావిస్తున్నాం' అని ఆ ఫ్రాంచైజీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అమెరికాలో 2023లో ప్రారంభమైన టీ20 టోర్నీ ఎంఎల్‌సీ తొలి సీజన్‌లో ఎంఐ న్యూయార్క్ విజేతగా నిలిచింది. ఐపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ యాజమాన్యానికి చెందినదే ఈ న్యూయార్క్ ఎంఐ.

'బాస్' క్వార్టర్స్‌లో బోపన్న జోడీ

స్టట్‌గార్ట్ (జర్మనీ): ఏటీపీ 250 బాస్ ఓపెన్ టోర్నమెంట్‌లో భారత టెన్నిస్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లగా.. శ్రీరామ్ బాలాజీ, యుకీ భాంబ్రీ టోర్నీ నుంచి నిష్క్రమించారు. బోపన్న/శాండర్ గిల్లె (బెల్జియం) ద్వయం 6-3, 5-7, 11-9తో స్థానిక జంట జాకబ్/మార్క్‌పై గెలిచింది. మిగతా మ్యాచుల్లో యుకీ/రాబర్ట్ జంట 6-7(5), 6-7(5)తో గొంజాలెజ్/ఆస్టిన్ జోడీ చేతిలో, బాలాజీ/మిగెల్ (మెక్సికో) ద్వయం 7-6(5), 3-6, 5-10తో ఫ్రాన్స్ జంట సాడియో డౌంబియా/ఫాబియెన్ రెబోల్ చేతిలో పరాజయం పాలయ్యారు.

విండీస్‌ను ఊడ్చేశారు



ఇంగ్లండ్‌దే ఆఖరి టీ20

సౌతాంప్టన్ (ఇంగ్లండ్): వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆతిథ్య ఇంగ్లండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి మ్యాచ్‌లో 37 పరుగుల తేడాతో కరీబియన్లను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. ఓపెనర్లు బెన్ డకెట్ (84), జేమీ స్మిత్ (60) అర్ధ శతకాలతో మెరవడంతో 20 ఓవర్లలో 248/3 స్కోరు చేసింది. బెతెల్ (36 నాటౌట్), బ్రూక్ (35 నాటౌట్) రాణించారు. ఛేదనలో ల్యూక్ వుడ్ (3/31), రషీద్ (2/30) ధాటికి విండీస్ 211/8 స్కోరుకే పరిమితమై ఓటమి పాలైంది. పావెల్ (79 నాటౌట్), హోప్ (45) సత్తా చాటినా ఫలితం లేకపోయింది. ఇప్పటికే మూడు వన్డేల సిరీస్‌ను కూడా 0-3తో కోల్పోయిన విండీస్.. ఇంగ్లండ్ టూర్‌ను ఒక్క గెలుపూ లేకుండానే ముగించింది.

రూ.1.45 లక్షల కోట్ల ఐపీఓలు

బిజినెస్

ప్రైమరీ మార్కెట్లో మళ్లీ సందడి

ముంబై: ట్రంప్ సుంకాలతోపాటు భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ప్రభావం నుంచి ఈక్విటీ మార్కెట్ క్రమంగా కోలుకుంటోంది. 52 వారాల కనిష్ఠ స్థాయి నుంచి నిఫ్టీ 15 శాతం మేర ఎగబాకింది. ఐపీఓల సందడి కూడా క్రమంగా పెరుగుతోంది. ప్రైమ్ డేటాబేస్ ప్రకారం.. ప్రస్తుతం 75కు పైగా కంపెనీలు సెబీ నుంచి ఐపీఓకు అనుమతి పొంది, పబ్లిక్ ఆఫర్‌ను ప్రారంభించేందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నాయి. ఈ కంపెనీలు మార్కెట్ నుంచి మొత్తం రూ.1.45 లక్షల కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. మరో రూ.90,000 కోట్లకు పైగా విలువైన 65 కంపెనీల ఐపీఓలు సెబీ గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ కంపెనీలన్నీ కలిసి మార్కెట్ నుంచి రూ.2.35 లక్షల కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

గత నెల నుంచి మళ్లీ గాడిలోకి..

ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో దాదాపుగా స్తంభించిపోయిన ఐపీఓ మార్కెట్‌లో గత నెల నుంచి మళ్లీ కదలిక మొదలైంది. 10కి పైగా కంపెనీలు పబ్లిక్ ఆఫరింగ్‌ల ద్వారా రూ.20,000 కోట్ల వరకు సమీకరించాయి. మున్ముందు ఇష్యూల జోరు మరింత పెరగవచ్చని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 105 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.2.11 లక్షల కోట్లకు పైగా నిధులు సేకరించాయి.



సెబీ అనుమతి పొందిన కొన్ని బడా ఐపీఓలు

కంపెనీ	(రూ.కోట్లు)
హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్	12,500
ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా	15,000(అంచనా)
హీరో ఫిన్‌కార్ప్	3,668
ఎన్ఎస్‌డీఎల్	3,420 (అంచనా)
విక్రమ్ సోలార్	1,500
కరంతార ఇంజనీరింగ్	1,750

రియల్టీ రంగంలోనూ జోష్

స్థిరాస్తి రంగంలోని పలు కంపెనీలు ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నాయి. నోయిడాకు చెందిన బీపీటీపీ లిమిటెడ్, ఎంఐఎం గ్రూప్‌నకు చెందిన స్మార్ట్‌వరల్డ్ డెవలపర్స్, గౌర్‌సన్స్ ఇండియా, వాధ్వా గ్రూప్ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ సంస్థలు ఐపీఓల ద్వారా రూ.15,000 కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉంది.

పెరగనున్న దరఖాస్తులు

ఐపీఓకు వచ్చేందుకు సెబీకి కంపెనీల దరఖాస్తులు కూడా భారీగా పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐటీ, ఫిన్‌టెక్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి నవతరం కంపెనీలు ఐపీఓకు వచ్చేందుకు అధిక ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఎంటీఆర్, ఈస్టర్న్ మసాలా బ్రాండ్ల యాజమాన్య సంస్థ ఓర్క్లా ఇండియా కూడా ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. మర్చంట్ పేమెంట్స్ సేవల సంస్థ పైన్ ల్యాబ్స్ కూడా సెబీకి దరఖాస్తు సమర్పించనున్నట్లు తెలిపింది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.5,000-6,000 కోట్ల వరకు సమీకరించవచ్చని సమాచారం. ఈ-కామర్స్ కంపెనీ మీషో కూడా ఐపీఓకు సిద్ధమైంది. 8,500 కోట్ల వరకు సమీకరించేందుకు ఈనెలలోనే డీఆర్‌హెచ్‌పీ ఫైల్ చేయవచ్చని తెలిసింది.

ఏపీలో కైటెక్స్ యూనిట్ !

రూ.4,000 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులకు మరో కంపెనీ సిద్ధమవుతోంది. కేరళ కేంద్రంగా పనిచేసే కైటెక్స్ సంస్థ రాష్ట్రంలో రూ.4,000 కోట్ల పెట్టుబడితో ఎగుమతుల కోసం దుస్తుల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం. ఈ కంపెనీ ఇప్పటికే తెలంగాణలో రూ.3,600 కోట్లతో వరంగల్, హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్ వద్ద చిన్న పిల్లల దుస్తుల తయారీ కోసం రెండు యూనిట్లు ఏర్పాటు చేసింది. ఇపుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ రూ4,000 కోట్ల భారీ పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం.

కేరళలో చుక్కెదురు: కేరళకు చెందిన ఈ కంపెనీ యాజమాన్యానికి, అక్కడి సీపీఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వానికి పడడం లేదు. గత నెల రోజుల్లోనే కేరళ అధికారులు ఆ రాష్ట్రంలోని కైటెక్స్ యూనిట్లలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే పేరుతో అనేక సార్లు తనిఖీ చేశారు. అయినా ఏమీ తేల్చలేకపోయారు. ఈ తనిఖీలపై కైటెక్స్ సీఎండీ సాబు జాకబ్ బహిరంగంగానే విమర్శించారు. వామపక్ష ఫ్రంట్ పాలనతో రాష్ట్రంలో పరిశ్రమలు సక్రమంగా పనిచేసే పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. దీంతో తమ కొత్త యూనిట్లను పత్తి సమృద్ధిగా పండే ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించాలని కంపెనీ నిర్ణయించినట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు అమలైతే రాష్ట్రంలో కొన్ని వేల మందికి ఉపాధి లభిస్తుందని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఏఎస్‌బీఎల్ కొత్త వెంచర్ 'బ్రాడ్‌వే'

ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో జీ+50 ఫ్లోర్లతో నిర్మాణం

ఒక్కో ఫ్లాట్ కనీస ధర రూ.2.5 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక రియల్ ఎస్టేట్ సంస్థ ఏఎస్‌బీఎల్ నగరంలో మరో ప్రీమియం రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టు చేపట్టింది. 'బ్రాడ్‌వే' పేరుతో ఈ నెల 14న ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తోంది. రూ.900 కోట్ల పెట్టుబడితో తలపెట్టిన ఈ ప్రీమియం రెసిడెన్షియల్ వెంచర్ కోసం ఏఎస్‌బీఎల్ ఇప్పటికే రూ.400 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.275 కోట్లు మోతీలాల్ ఓస్వాల్ గ్రూప్ నుంచి సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో జీ+50 ఫ్లోర్లలో 885 లగ్జరీ ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మిస్తారు. ఇందులో ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం 2,035 నుంచి 2,650 చదరపు అడుగుల వరకు ఉంటుంది. అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఈ వెంచర్‌లో ఒక్కో ఫ్లాటు కనీస ధర రూ.2.5 కోట్ల వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ ప్రాజెక్టు 2029 డిసెంబరుకల్లా పూర్తవుతుందని ఏఎస్‌బీఎల్ తెలిపింది.

ఎస్‌బీఐలో 18,000 కొత్త నియామకాలు

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 18,000 కొలువుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసింది. ఇందులో 13,500 క్లరికల్ పోస్టులు, 3,000 పైగా ప్రొబేషనరీ ఆఫీసర్లు, ఇతర ఆఫీసర్ల పోస్టులని బ్యాంకు చైర్మన్ సీ.శ్రీనివాసులు శెట్టి చెప్పారు. అవసరాలకు అనుగుణంగా వీరికి అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు.

కెనరా బ్యాంక్, యూబీఐ, ఐఓబీ రుణ రేట్లు తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ).. రుణాలపై వడ్డీరేట్లను 0.50 శాతం తగ్గించాయి. రుణాలకు ప్రామాణికమైన ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటుతో (ఈబీఎల్ఆర్) పాటు రెపో అనుసంధానిత రుణ రేటును (ఆర్ఎల్ఎల్ఆర్) అర శాతం తగ్గించినట్లు బుధవారం నాటి ప్రకటనలో యూబీఐ తెలిపింది. అలాగే ఆర్ఎల్ఎల్ఆర్‌ను 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ఐఓబీ వెల్లడించింది. దాంతో బ్యాంక్ రుణ రేటు 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గనుంది. గురువారం నుంచి ఈ రేటు అమలులోకి రానుంది.

కెనరా బ్యాంక్: కెనరా బ్యాంక్ కూడా ఆర్ఎల్ఎల్ఆర్‌ను 0.50 శాతం తగ్గించినట్టు ప్రకటించింది. దాంతో బ్యాంక్ రుణరేటు 8.75 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గనుంది. గురువారం నుంచి ఈ రేటు అమలులోకి రానుంది. ఆర్‌బీఐ రెపోరేటును గత శుక్రవారం 0.50 శాతం తగ్గించడంతో పలు బ్యాంకులు ఆ ప్రయోజనాన్ని కస్టమర్లకు పంచుతున్నాయి.

నిఫ్టీ ఆరో రోజూ ముందుకే..

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం స్వల్పంగా లాభపడ్డాయి. గ్లోబల్ మార్కెట్ల ర్యాలీతోపాటు అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశావహ వైఖరి, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు సూచీలను ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ 123.42 పాయింట్ల లాభంతో 82,515.14 వద్ద స్థిరపడింది. ఐటీ, ఇంధన రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. నిఫ్టీ 37.15 పాయింట్ల వృద్ధితో 25,141.40 వద్ద క్లోజైంది. సూచీ లాభపడటం వరుసగా ఇది ఆరో రోజు. గడిచిన 6 సెషన్లలో నిఫ్టీ 598 పాయింట్లు (2.42 శాతం) పుంజుకుంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్ షేరు 3.22 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

డ్రై కార్గో నిర్వహణలో అదానీ పోర్టు రికార్డు

ముత్తుకూరు: నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ 5.74 మిలియన్ మెట్రిక్ టన్నుల డ్రై కార్గోని (పొడి సరుకు) రవాణా చేసి, కొత్త రికార్డును నెలకొల్పింది. ఈ సందర్భంగా బుధవారం పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఇది ఓడరేవు చరిత్రలో అత్యధిక నెలవారీ డ్రై కార్గో రవాణా అని తెలిపారు. ఏకేపీఎల్ బుధవారం ఒక్క రోజు 55,958 మెట్రిక్ టన్నుల కార్గో రోడ్డు రవాణా చేపట్టి రికార్డు సాధించిందని వారు తెలిపారు.

ఇన్వెస్టర్ల రక్షణ కోసం 'సెబీ చెక్'.. అక్టోబరు నుంచి అమలు

ముంబై: తన వద్ద నమోదైన సంస్థలకు మదుపరులు చేసే యూపీఐ చెల్లింపులను సెబీ మరింత సురక్షితం చేస్తోంది. ఇక నుంచి ఈ చెల్లింపుల కోసం 'సెబీ చెక్' అనే ప్రత్యేక టూల్‌ను తీసుకు రానుంది. దీంతో మదుపరులు తాము చెల్లింపులు చేసే సంస్థ యూపీఐ ఐడీని స్కానింగ్, క్యూఆర్ కోడ్ లేదా ఆ సంస్థ యూపీఐ ఐడీని ఎంటర్ చేయడం ద్వారా అది నిజంగా సెబీ వద్ద నమోదైన సంస్థా లేక బోగస్ సంస్థా అనే విషయం నిర్ధారించుకుని మరీ చెల్లింపులు చేయవచ్చు. ఈ ఏడాది అక్టోబరు 1 నుంచే ఈ చెల్లింపుల విధానం అమలు చేస్తామని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే చెప్పారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	109
వరంగల్	100	గుంటూరు	112
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	96	అనంతపురం	108
గోదావరి	109		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,400 ▲	90,200 ▲	1,19,000 ▲
విజయవాడ	99,500 ▲	93,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	99,700 ▲	90,200 ▲	1,19,000 ▲
రాజమండ్రి	98,400 ▲	90,200 ▲	1,09,500 ▼
ప్రొద్దుటూరు	96,650 ▲	88,920 ▲	1,04,000 ▲
ముంబై	96,240 ▼	88,150 ▼	1,05,000 ▼

జీఆర్‌టీ నుంచి గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆభరణాల రిటైలింగ్ దిగ్గజం జీఆర్‌టీ జువెలర్స్ తమ కస్టమర్ల కోసం గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది 11 నెలల పాటు బంగారంపై పెట్టుబడి పెట్టే ఆకర్షణీయమైన ప్లాన్. కనీస పెట్టుబడి రూ.1000. ఆ పైన ఎంత మొత్తంలో అయినా ఇన్వెస్ట్ చేయవచ్చు. వారు 11 నెలల అనంతరం తమకు ఇష్టమైన ఆభరణాలు కొనుగోలు చేయవచ్చునని జీఆర్‌టీ జువెలర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో రెండు ఆప్షన్లుంటాయి. ఒకటి బరువు ఆధారిత ప్లాన్ కాగా రెండోది విలువ ఆధారిత ప్లాన్. ఈ రెండింటిలో ఏదో ఒకటి కస్టమర్ ఎంచుకోవచ్చు. 18 శాతం వరకు ఎలాంటి తరుగు వసూలు చేయకపోవడం ఈ ప్లాన్ ప్రత్యేకత. బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి ఆభరణాలన్నింటికీ ఈ ప్లాన్ వర్తిస్తుంది. బంగారం ధరలు భారీ ఆటుపోట్లకు గురవుతున్న ప్రస్తుత వాతావరణంలో ఇది కస్టమర్ల సొమ్ముకు విలువ చేకూర్చే చక్కని ప్లాన్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్ అన్నారు. నెలవారీ వాయిదా ఎంపిక నుంచి ఎప్పటికప్పుడు చెల్లింపులకు సంబంధించిన అలర్ట్‌లు జారీ చేయడం వరకు అన్నింటిలోనూ తమ నిపుణులు కస్టమర్లకు మార్గదర్శకం చేస్తారని చెప్పారు. జన్మదినాలు, ఇతరత్రా వేడుకల సమయంలో కుటుంబ సభ్యులకు ఆకర్షణీయమైన బహుమతులు ప్లాన్ చేసేందుకు ఇది చక్కని అవకాశమని మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ అన్నారు.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 12-6-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్‌కు నిరసన సెగ



అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలంటూ పొదిలిలో నిరసన తెలుపుతున్న మహిళలు

మహిళలపై రాళ్లు, చెప్పులు

జగన్ పర్యటనలో వైసీపీ మూక అరాచకం

బూతులు, దుర్భాషలతో వీరంగం

అమరావతి మహిళలకు జగన్ క్షమాపణలు చెప్పాలనడమే నేరం

ప్లకార్డులు, నల్ల బెలూన్లతో నిరసన తెలపడమే అతివల పాపం 12

పొదిలిలో రెచ్చిపోయి మరీ దాడులు

ఓ కానిస్టేబుల్‌తోపాటు మహిళలకు గాయాలు.. డీఎస్పీని తాకిన చెప్పులు

స్పృహ తప్పి పడిపోయిన సీఐ

ఇవేవీ పట్టించుకోని జగన్.. సర్కారుపై చిందులు




మహిళలపై చెప్పులు, రాళ్లు విసురుతున్న వైసీపీ కార్యకర్తలు



రాళ్ల దాడిలో గాయపడిన కానిస్టేబుల్ జీవీ రత్నం

పరామర్శకని వెళ్లి.. అరాచకమేంటి?.. సీఎం ఫైర్.. చర్యలకు డీజీపీకి ఆదేశం



కృష్ణంరాజు అరెస్టు!

అమరావతిపై అసభ్య వ్యాఖ్యల కేసులో అదుపులోకి

కేసు నమోదుతో అజ్ఞాతవాసం.. శ్రీకాకుళం నుంచి వస్తుండగా పట్టుకున్న విశాఖ పోలీసులు

రోడ్డు మార్గంలో తుళ్లూరుకు తరలింపు.. నేడు మంగళగిరి కోర్టులో హాజరు 10



శివలింగంపై తేలులా రాజకీయం ముసుగులో ఉండటంతో జగన్‌ను ఎదుర్కోవడంలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినా వదిలిపెట్టను. ఇలాంటి వారిని కంట్రోల్ చేయకుంటే రాష్ట్రానికి నష్టం. రౌడీలెవరూ రాష్ట్రంలో ఉండకూడదు. రాష్ట్రం నుంచి బాయ్‌కాట్ చేయాలి. జగన్‌లాంటి భూతాన్ని రాజకీయంగా భూస్థాపితం చేస్తాను. లేకుంటే రాష్ట్రాన్ని జగన్ అధోగతి పాల్జేస్తారు. - ముఖ్యమంత్రి చంద్రబాబు

వదిలే ప్రసక్తే లేదు

జగన్.. రాజకీయ భూతం!

భూస్థాపితం చేయకుంటే రాష్ట్రానికి అధోగతే

జనాన్ని మభ్యపెట్టేందుకే పత్రిక, చానల్ నడుపుతున్నారు

రాజకీయ ముసుగులో ఉన్నా వదిలిపెట్టను: సీఎం

సుపరిపాలన దిశగా 'ఏడాది' తొలి అడుగు

ఇబ్బందులెన్ని ఉన్నా.. హామీల అమలు

నేడే 'తల్లికి వందనం' నిధులు జమ

ఈనెల 20నే 'అన్నదాత సుఖీభవ' సొమ్ము

ఆగస్టు 15 నుంచి మహిళలకు 'ఉచిత బస్సు'

నిరుద్యోగ భృతిపై వర్కౌట్ చేస్తున్నాం

పీ4, ప్రభుత్వ ధనంతో మహిళలకు రూ.1500

సుస్థిర ప్రభుత్వంతోనే సత్ఫలితాలు

రాష్ట్రాభివృద్ధిని 'వైకుంఠపాళి'లోకి నెట్టొద్దు

2019 ఎన్నికల్లో ఓటమికి 2 ప్రధాన కారణాలు

వైసీపీ దుష్ప్రచారాన్ని అడ్డుకోలేకపోవడం..

కార్యకర్తలను సమాయత్తం చేయకపోవడం

పార్టీ నియమావళి, కార్యకర్తల మనోభావాల మేరకే లోకేశ్‌కు పదవి

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో సీఎం చంద్రబాబు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"ఈ ఏడాది పాలన సుపరిపాలన దిశగా వేసిన తొలి అడుగు మాత్రమే. మున్ముందు మరింత మెరుగైన పాలనతో ప్రజలకు సేవ చేస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. సుస్థిర పాలనకు కులమతాలకు అతీతంగా ఆలోచించి.. సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్ వివేకా హత్య, అమరావతిపై విద్వేషపూరిత వ్యాఖ్యలు, తాజాగా పొదిలిలో మహిళలపై రాళ్ల దాడి వంటి ఘటనలను ప్రస్తావిస్తూ... విపక్ష నేత జగన్ అరాచక శక్తి అని మండిపడ్డారు. ఇలాంటి నేరమనస్తత్వం ఉన్న వ్యక్తితో రాజకీయం చేయాల్సి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదన్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సుడిగుండంలోకి నెట్టారని మండిపడ్డారు. "తాను ఏంచేసినా

మిగతా 10వ పేజీలో...

ఏడాది సంబరం!

కూటమి కొలువుదీరి నేటికి సంవత్సరం

గాడిన పడుతున్న రాష్ట్ర ప్రగతి

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

పల్లె సీమల్లో పనుల పండగ 11

రాష్ట్రాన్ని నిలబెడుతున్న కేంద్రం చేయూత

నేడే తల్లికి వందనం

67.27 లక్షల విద్యార్థులకు 8,745 కోట్లు

తల్లుల ఖాతాల్లో 13 వేల చొప్పున జమ

1వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో చేరేవారికీ

నేటి నుంచే బడులు

తొలిరోజే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

233 రోజులు బడి.. 83 సెలవులు 7

2025 అకడమిక్ క్యాలెండర్ విడుదల

విశాఖలో సివిల్ ఏవియేషన్ వర్సిటీ

పౌర విమానయాన శాఖకు సీఎం చంద్రబాబు ప్రతిపాదన

విమానాశ్రయ నిర్మాణాల్లో ఏపీ సంస్కృతి ఉట్టిపడాలి

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి: సీఎం 11

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆరని అగ్ని

మణిపూర్‌లో శాంతినెలకొనాలని కేంద్రహోంమంత్రి అమిత్‌షా గట్టిగా కోరుకుంటున్నారని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పతిష్ఠించేందుకు ఆయన సానుకూలంగా ఉన్నారని మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ బుధవారం వ్యాఖ్యానించారు. ఢిల్లీనుంచి వచ్చి ఇంఫాల్‌లో ఇలా వాలగానే చుట్టూచేరిన మీడియాతో ఆయన తన పర్యటన విశేషాలు పంచుకున్నారు. అమిత్‌షాతో గంటలతరబడి చర్చోపచర్చలు చేశానని, పరిస్థితిని చక్కదిద్దడం కోసం ఆయన తనకు కొన్ని బాధ్యతలు అప్పగించారని, వాటిని బహిర్గత పరచకూడదు కానీ, రాష్ట్రం గాడినపడేందుకు వార్డు సభ్యుడినుంచి ఎమ్మెల్యేవరకూ అంతా ఏకతాటిమీద నడవాలన్నారు బీరేన్. అలా అంతా కలసిమెలసి ఉండకుండా, తెగలమధ్య వైషమ్యాలు పెంచి, మణిపూర్ ఇంకా మండుతూనే ఉండటానికి ప్రధాన కారకుడు బీరేన్. అటువంటి వ్యక్తికి హోంమంత్రి ఏ రహస్య కర్తవ్యాన్ని బోధించారో మరి.

ఆదివారం రాజుకున్న అగ్ని క్రమంగా చల్లారుతోంది. కర్ఫ్యూ ఉన్నప్పుడు కూడా మీతీలు భారీగా నిరసన ప్రదర్శనలు నిర్వహించిన దశను కూడా చూశాం కనుక, ఇప్పుడు సదరు నిరసనలు, ప్రదర్శనలు తగ్గుముఖం పట్టినందుకు సంతోషించాల్సిందే. మీతీ రాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' నాయకుడు కనాన్ సింగ్‌ను సీబీఐ అరెస్టుచేయడంతో ఈ అగ్గిరాజుకుంది. తమ నాయకుడిని పట్టుకుపోయినందుకు ఆ సంస్థ సభ్యులు, తమ రక్షకుడిని జైల్లోకి నెట్టినందుకు మీతీలు కలిసి ఈ విధ్వంసకాండ సృష్టించారు. పోలీసు హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన ఈ కనాన్‌సింగ్ 2020లో ఈ సంస్థను ఆరంభించడం వెనుక పొలిటికల్ పెద్దల ఆశీస్సులున్నాయని అంటారు. మీతీలకు ఎస్టీహోదా కట్టబెట్టే ఒక ప్రయత్నం కుకీల గుండెలు రగల్చడంతో, 2023 మే3నుంచి రాష్ట్రం తగలబడుతున్న దశలో, ఈ సంస్థ అనూహ్యమైన వేగంతో ఎదిగింది. పేరుకు మీతీల ఘనమైన గతాన్ని కీర్తించే ఒక సాంస్కృతిక సంస్థ కావచ్చును గానీ, ప్రత్యేక సాయుధ శిక్షణతో ఆయుధాల వినియోగంలోనూ, ప్రయోగంలోనూ దీనికి తిరుగేలేదని అంటారు. చేతిలో ఆయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, వాకీటాకీలతో ఈ సంస్థ సభ్యులు బహిరంగంగా తిరుగుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో తరచూ కనిపిస్తూ ఉంటాయి. గత ఏడాది జనవరిలో ఈ సంస్థ ఆదేశించిన మేరకు అన్ని పార్టీలకు చెందిన మీతీ ఎమ్మెల్యేలు, ఎంపీలు సమావేశానికి హాజరై డిమాండ్ల పత్రం మీద సంతకం చేసిన విషయం తెలిసిందే. ఇంతటి శక్తిమంతమైన ఈ సంస్థ నాయకుడి అరెస్టుతో మణిపూర్ లోయ మళ్ళీ భగ్గుమన్నది.

బీరేన్ అధికారంలో ఉండివుంటే, కుకీ–జో తెగలను ఊచకోతకోసే ఇటువంటి మీతీ మిలిటెంట్ సంస్థలమీద ఈగవాలనిచ్చేవారు కాదు. పైగా వాటిని ఆయుధాలతో బలోపేతం చేసిందీ, పోలీసు బలగాలను వాటివైపు పోకుండా ఇంతకాలమూ నిరోధించిందీ ఆయనే. 'వాళ్ళను ఆయుధాలు దోచుకోనివ్వండి' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలే ఆడియోటేపుల రూపంలో లీకై, అమిత్ షా పంపిన ప్రత్యేక కమిషన్లు కూడా బేఖాతరుచేసిన నేపథ్యంలో, వ్యవహారం సుప్రీంకోర్టు వరకూ పోయి, ఆ గొంతు బీరేన్‌దేనని నిజనిర్ధారణ జరగడంతో బీరేన్‌తో పాటు బీజేపీ పెద్దలు కూడా పరువుపోగొట్టుకున్న విషయం తెలిసిందే. అప్పటికే బీరేన్‌మీద పార్టీలో వ్యతిరేకత తీవ్రమై, స్పీకర్ కేంద్రంగా కొత్త రాజకీయం ఆరంభంకావడం, దానిని రాజకీయంగా వాడుకోవడానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ అవిశ్వాసతీర్మానానికి సిద్ధపడటం తెలిసిందే. సమావేశాలు జరగకుండా చేసి రాష్ట్రం చేజారిపోకుండా బీజేపీ చూసుకోగలిగింది కానీ, రాష్ట్రపతిపాలన విధించి కూడా పరిస్థితిలో పూర్తిమార్పు సాధించలేకపోయింది.

బీరేన్ నిష్క్రమణ తరువాత మీతీల జోరు తగ్గి, కుకీ–జోలకు కాస్తంత నమ్మకం హెచ్చి గతంతో పోల్చితే హింస స్థాయి కాస్తంత తగ్గినమాట నిజం. కానీ, బీరేన్ నాటిన విషాలు, వైషమ్యాల ప్రభావం నుంచి రాష్ట్రం ఇంకా బయటపడని నేపథ్యంలో ఆయన మళ్ళీ తెరమీద చురుకుగా కనిపించడం ఏమాత్రం మంచిదికాదు. రెండేళ్ళుగా మోదీ మణిపూర్‌మీద నోరు విప్పలేదు. అంతా సవ్యంగా ఉందని అమిత్‌షా భరోసా ఇస్తూంటారు కానీ, స్వల్ప విరామం తరువాత ఏదో ఒక చిన్నకారణంతో మణిపూర్ మళ్ళీ రాజుకుంటోంది. ప్రధాని స్వయంగా ఆ రాష్ట్రంలో పర్యటించి ప్రజలకు భరోసా ఇవ్వడంతోపాటు, సాధ్యమైనంత వేగంగా రాష్ట్రపతిపాలన ఎత్తివేసి, అన్ని జాతులు, తెగల సముచిత ప్రాతినిధ్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగలిగితే మార్పు కనిపించవచ్చు.

బాలకార్మికతకు అంతమెప్పుడు?

ఈ రోజు అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేకదినం. అంటే బానిస సంకెళ్ళను తెంచుకొని, మూసిన కనురెప్పలు విప్పుకొని, రెక్కలు కట్టుకొని స్వేచ్ఛా విహంగాలై చిన్నారులు ఎగిరిపోవాల్సిన రోజు ఇది. ఈ ప్రపంచంలో అత్యంత దయనీయమైన విషయం ఏదైనా ఉందీ అంటే అది బాలకార్మిక వ్యవస్థ. రేపటి తరం అని మురుస్తున్న ఆ భవిష్యత్ తరం వేరే దిక్కులేక అన్నమో రామచంద్రా అంటూ రోడ్డున పడడం ప్రపంచంలో అన్నింటినీ మించిన విషాదం.

పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం ఏదీ తెలియని బాలలు మోయలేని భారాన్ని మోస్తున్నారు. పలకా బలపం పట్టాల్సిన చేతులు పత్తి చేలల్లో మగ్గిపోతున్నాయి. చెంగు చెంగున గంతులు వేయాల్సిన బాల్యం ఇటుక బట్టీల్లో మసిబారిపోతోంది. కాఫీ హోటళ్లలో, కార్ఖానాల్లో, ఇంకా కాదంటే ఖరీదైన ఇళ్ళల్లో పసిబతుకులు వసివాడిపోతున్నాయి. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా 160 మిలియన్ల మంది బాలలు బాలకార్మిక వ్యవస్థ విషవలయంలో చిక్కుకున్నారని యూనిసెఫ్ లెక్కలు తెలియజేస్తున్నాయి. దీనర్థం ప్రపంచంలోని ప్రతి పదిమందిలో ఒక పసిప్రాణం బాలకార్మిక వ్యవస్థకు బలైపోతోంది. ఇది స్వయంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన గణాంకాలు.

బాలలను శారీరకంగా, మానసికంగా, సామాజికంగా అణచివేసి, శ్రమదోపిడీకి పాల్పడుతున్న ధనిక, పెట్టుబడీదారీ వర్గం బాలకార్మిక వ్యవస్థను పెంచి పోషిస్తోంది. బట్టీల్లోనూ, గనుల్లోనూ, కార్ఖానాల్లోనూ, కార్యాలయాల్లోనే కాదు... చివరకు అక్రమ రవాణా ద్వారా చిన్నారులపై లైంగిక దోపిడీ కూడా సర్వసాధారణంగా మారిపోయింది. దీన్ని అడ్డుకునేందుకు అరాకొరా చర్యలే తప్ప, పూర్తిస్థాయిలో, చిత్తశుద్ధితో జరుగుతున్న పనులు చాలా తక్కువ.



బాలకార్మిక వ్యవస్థకు ప్రధానమైన కారణం పేదరికం. రెక్కలు ముక్కలు చేసుకున్నా కడుపు నిండని జీవితాలు చిట్టి చేతుల చిన్నారులను పనుల్లోకి దింపుతున్నాయి. దీనికి తోడు నిరక్షరాస్యత చిన్నారులను బడులవైపు కాకుండా పనుల వైపు మళ్ళిస్తోంది. యావత్ ప్రపంచాన్ని కుదిపేస్తోన్న చైల్డ్ లేబర్ సమస్యని ప్రపంచ దేశాలు దశాబ్దాల క్రితమే గుర్తించినప్పటికీ నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న చందంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన గణాంకాలకే పరిమితమైంది.

ఈ నేలపైన పుట్టిన ప్రతి బిడ్డకీ జీవించే హక్కు ఉంటుంది. బాలలకు విద్య, ఆరోగ్యం... రాజ్యాంగం కల్పించిన హక్కులు. బాలకార్మిక వ్యవస్థ చిన్నారుల ప్రతి హక్కునీ హరించివేస్తోంది. కానీ పేదరికంలో జన్మించిన ప్రతి చిన్నారికీ ఇవేవీ వర్తించడం లేదు. బాలకార్మిక నిషేధ చట్టం పనితీరు, చట్టానికి వ్యతిరేకంగా పనిచేయించుకుంటున్న వారికి వేస్తున్న శిక్షలను బట్టి అంచనా వేయవచ్చు. ఇక స్వంత కుటుంబాల్లోనే బాలకార్మికులుగా మిగిలిపోతున్నవారు మన దేశంలో కోకొల్లలు. తల్లిదండ్రులు కూలికిపోతే, బడిమానేసి, బిడ్డల సంరక్షణ చేస్తున్న చిన్నారుల సంఖ్య మనదేశ పాలకుల లెక్కలకు అందనిది. బడ్జెట్ కేటాయింపుల్లో దేశంలో సంగతి సరే, ప్రపంచవ్యాప్తంగా చూసినా సామాజిక రక్షణ నగదు ప్రయోజనాలు (సోషల్ ప్రొటెక్షన్ క్యాష్ బెనిఫిట్స్) పొందుతున్న బాలలు 26.4 శాతం మాత్రమే. ఇక పేదల ఇళ్ళు గడవని స్థితిలో ప్రభుత్వ పథకాల కోసం ఎదురుచూస్తున్న స్థితి. పేదలు బతుకు గడవని స్థితిలో తమ బిడ్డలనే బానిసలుగా మారుస్తున్నారు. దీన్ని అడ్డుకోవడానికి వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడం తప్ప మరో మార్గమే లేదు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టం చేసి చేతులు దులుపుకునే పరిస్థితి నుంచి దేశం బయటపడాలంటే బడ్జెట్ కేటాయింపులపై దృష్టి సారించాలి. అలాగే వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ, నైపుణ్యం లేమితో బాధపడుతున్న మన దేశంలో భవిష్యత్ తరాల చదువుకి ప్రాధాన్యత అత్యంత అవశ్యకం. చిన్నారులను విజ్ఞానవంతులుగా తయారుచేయడంలో తొలి అడుగు అక్షరాస్యతను పెంపొందించడం. బడుల నుంచి దూరమవుతోన్న బాలలను గుర్తించి పాఠశాలల్లోకి వారు అడుగిడే ప్రయత్నం చేయడం. నాణ్యమైన చదువుని పిల్లలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న విషయం గుర్తించే వరకూ సమైక్యంగా పోరాడటం. ఇందుకు సుదీర్ఘ కార్యాచరణని రూపొందించుకొని ముందుకు సాగాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

– మద్దులూరి ఆంజనేయులు
అక్షరం, వ్యవస్థాపక కార్యదర్శి

ప్రభవిస్తున్న భారత్‌పై అగ్రరాజ్యాల అసూయ

ప్రభవిస్తున్న ఒక కొత్త శక్తిని ఎవరూ అభిమానించరు. నేను ప్రస్తావిస్తున్న కొత్త శక్తి భారత్. అవును, మన భారత్ ఉత్థానాన్ని అమెరికా అంగీకరించదు. చైనా సహించదు. ఐరోపా ఇష్టపడదు. ప్రభవించే కొత్త శక్తి యథాతథ పరిస్థితిని మార్చివేసి, ప్రాబల్య సమతుల్యతను తలకిందులు చేస్తుంది కనుకనే ఆ విముఖత. చైనా అగ్రరాజ్య ప్రతిపత్తిని సమకూర్చుకుంటున్నప్పుడు తాము ప్రాధాన్యం కోల్పోతామని పాశ్చాత్య అగ్ర రాజ్యాలు భయపడ్డాయి. చైనాను ప్రపంచ అగ్రగామి ఆర్థిక శక్తిగా, అధునాతన సాంకేతికతల కాణాచిగా అంగీకరించేందుకు వాటికి దశాబ్దాలు పట్టింది.

భారత్ ప్రగతి విజయాల పట్ల అమెరికా నేతృత్వంలోని పాశ్చాత్య ప్రపంచ ప్రతిస్పందన మరింత సంక్లిష్టంగా ఉన్నది. తమ ప్రపంచాధిపత్యానికి ఒక ప్రత్యక్ష ముప్పుగా చైనాను భావించిన ఆ సంప్రదాయ అగ్రరాజ్యాలు భారత్ సర్వోన్నతిని అలా భావించడం లేదు. అయితే భారత్ రాబోయే ఇరవై సంవత్సరాలలో పాశ్చాత్య అగ్రరాజ్యాలకు ఒక శక్తిమంతమైన ఆర్థిక, సైనిక, సాంకేతికతా ప్రత్యర్థిగా ప్రభవించనున్నదని వాషింగ్టన్‌లోని ముందుచూపుగల ఆలోచనాపరులు గ్రహించారు.

ప్రపంచ శక్తులుగా ప్రభవిస్తున్న దేశాల పట్ల పాశ్చాత్య అగ్రరాజ్యాలు ఎలా వ్యవహరిస్తాయో తెలుసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. సోవియట్ యూనియన్ 1960వ దశకం వరకు అమెరికాకు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్నది. దాని స్థాయిని తగ్గించేందుకు అమెరికా ఒక జంట వ్యూహాన్ని అనుసరించింది. తొలుత చైనాతో స్నేహం చేసింది. 1972లో అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, తన విదేశాంగ కార్యదర్శి హెన్రీ కిస్సింజర్‌తో కలిసి బీజింగ్‌ను సందర్శించారు. ప్రపంచ అగ్రగామి కమ్యూనిస్టు దిగ్గజ రాజ్యాలు సోవియట్ యూనియన్, చైనాల మధ్య విభేదాలు సృష్టించడమే అమెరికా లక్ష్యం.

తమతో మైత్రికి రావడంలో అమెరికా లక్ష్యమేమిటో చైనా సర్వోన్నత నాయకుడు మావో జెడాంగ్‌కు బాగా తెలుసు. అయినప్పటికీ గుంభనగా అమెరికాతో స్నేహం నెరిపారు. 1979లో అమెరికా, చైనాల మధ్య పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు నెలకొన్నాయి. ఇందుకు ప్రత్యుపకారంగా చైనీస్ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులకు అమెరికా టెక్నాలజీని నిర్నిబంధంగా అందుబాటులో ఉంచేందుకు వాషింగ్టన్ పాలకులు అంగీకరించారు. దరిమిలా మూడు దశాబ్దాల పాటు చైనా ఆ సౌలభ్యాన్ని ఎంత గరిష్ఠంగా ఉపయోగించుకోవాలో అంత గరిష్ఠంగా ఉపయోగించుకుంది. అమెరికా సృష్టించిన అధునాతన సాంకేతికతల గుట్టు మట్టులు తెలుసుకుంది. వాటి ఆలంబనతో సొంతంగా సాంకేతికతలను అభివృద్ధిపరచుకున్నది. 'మీ శక్తి సామర్థ్యాలను గుప్తంగా ఉంచండి, సమయం కోసం వేచి ఉండండి' అని కమ్యూనిస్టు చైనా మహా సంస్కర్త డెంగ్ జియావో పింగ్ తన ప్రజలకు ఉపదేశించారు.



పాశ్చాత్య అగ్రరాజ్యాల ఆధిపత్యానికి భారత్ నుంచి తక్షణ సవాళ్లు ఏమీ లేవు. అయితే రాబోయే ఇరవై ఏళ్లలో తమ ఆధిక్యతను భారత్ సమర్థంగా సవాల్ చేయగలదని అమెరికా నాయకులకు అవగతమయింది. ఈ కారణంగానే, ఇటీవల పాకిస్థాన్ భారత్ సాయుధ సంఘర్షణల సందర్భంగా రెండుదేశాలను సమస్కంధులుగా పరిగణించేందుకు వాషింగ్టన్ పాలకులు ప్రయత్నించారు! చైనా ప్రాబల్యాన్ని ఎదుర్కొనేందుకు భారత్ ఎలా ఉపయోగ కరమో , భారత్ ఉత్థానాన్ని అదుపు చేసేందుకు పాకిస్థాన్ కూడా అదే విధంగా ఉయోగపడగలదని వాషింగ్టన్ భావిస్తోంది.

ఆ సమయం 2010లో వచ్చింది. అమెరికా దిమ్మ తిరిగిపోయేలా చైనా జీడీపీ 20 రెట్లు పెరిగింది (1980లో 0.30 ట్రిలియన్ డాలర్ల నుంచి 2010లో 6.10 ట్రిలియన్ డాలర్లకు చేరింది). ఇదే కాలంలో అమెరికా జీడీపీ కేవలం ఐదు రెట్లు మాత్రమే అధికమయింది (1980లో 2.86 ట్రిలియన్ డాలర్ల నుంచి 2010లో 15.05 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది).

ఇదిలావుండగా అమెరికా తన వ్యూహంలోని రెండో అంశాన్నీ అమలుపరచసాగింది. 1991లో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత రష్యా ముప్పును తటస్థీకరించడమే ఈ రెండో ఎత్తుగడ. సైనిక కూటమి నాటోను విస్తరించి రష్యా ముంగిటకు తీసుకువెళ్లింది. 1991లో 16 సభ్య దేశాలు ఉన్న నాటో 2025లో 32 సభ్య దేశాల కూటమిగా మహాబలోపేతమయింది. ఈ సభ్య దేశాలు రష్యాను ప్రభావశీలంగా చుట్టుముట్టాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే రష్యా ఇప్పుడు నాటో చక్ర బంధంలో ఉన్నది. ఇదే సమయంలో పాశ్చాత్య అగ్ర రాజ్యాల ఆధిపత్యానికి అంతకంతకు పెరుగుతోన్న ఒక మహా ముప్పుగా చైనా మరింత తీవ్ర స్థాయిలో పరిణమిస్తోంది. బీజింగ్‌కు వ్యతిరేకంగా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనీస్ సరుకులపై దిగుమతి సుంకాలను 145 శాతం నుంచి 30శాతానికి అనివార్యంగా తగ్గించుకున్నారు.

పాశ్చాత్య అగ్రరాజ్యాల ఆధిపత్యానికి భారత్ నుంచి తక్షణ సవాళ్లు ఏమీ లేవు. అయితే రాబోయే ఇరవై ఏళ్లలో తమ ఆధిక్యతను భారత్ సమర్థంగా సవాల్ చేయగలదని ఆలోచనాపరులు అయిన అమెరికా నాయకులకు అవగతమయింది. ఈ కారణంగానే, ఇటీవల పాకిస్థాన్ భారత్ సాయుధ సంఘర్షణల సందర్భంగా భారత్‌ను, ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న పాకిస్థాన్‌ను సమస్కంధులుగా పరిగణించేందుకు వాషింగ్టన్ పాలకులు ప్రయత్నించారు! పెరుగుతోన్న చైనా ప్రాబల్యాన్ని ఎదుర్కొనేందుకు భారత్ ఎలా ఉపయోగకరమో , భారత్ ఉత్థానాన్ని అదుపు చేసేందుకు పాకిస్థాన్ కూడా అదే విధంగా ఉయోగపడుతుందని వాషింగ్టన్ భావిస్తోంది.

జపాన్‌ను అధిగమించి భారత్ ప్రపంచ నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. భారత్ జీడీపీ 4.187 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,61,000 కోట్లు) కాగా జపాన్ జీడీపీ 4.186 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,53,000 కోట్లు). 2027లో జర్మనీని అధిగమించి ప్రపంచ అతి పెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ప్రభవించనున్నది. అద్భుత పురోగమనం, సందేహం లేదు. అయినా ఈ ప్రగతిపథంలో మన దేశం చైనా, అమెరికాలకు చాలా దూరంలో వెనక పట్టునే ఉండిపోయింది. ఒక వాస్తవమేమిటంటే చైనా, అమెరికాలు మన కంటే చాలా ముందున్నప్పటికీ వాటి వార్షిక వృద్ధిరేటు మన వార్షిక వృద్ధిరేటులో సగంగా మాత్రమే ఉన్నది.

ఈ బహు దూరాలు అధిగమించలేనివా? కానే కావు. గత రెండు దశాబ్దాలలో చైనా త్వరితగతిన పురోగమించి అమెరికా తరువాతి స్థానానికి చేరలేదూ? మరి భారత్ కూడా రాబోయే ఇరవై ఏళ్లలో అటువంటి అద్భుత పురోగతి సాధించగలుగుతుందా? దీర్ఘకాలానికి వర్తించే అంచనాలు వేయడం అంత సులభం కాదు. అసాధ్యం అని కూడా ఒప్పుకుందాం. అయితే ఆర్థికాభివృద్ధిలో అమెరికా, చైనాలతో ఉన్న అంతరాన్ని భారత్ తప్పకుండా గణనీయంగా అధిగమించి తీరుతుంది. ఇది తథ్యం.

శక్తిమంతమైన చైనీస్, టర్కిష్ ఆయుధ వ్యవస్థలను తుత్తినియలు చేసి పాకిస్థాన్‌పై భారత్ నిర్ణయాత్మక సైనిక విజయాన్ని సాధించడాన్ని ప్రపంచ వ్యాప్తంగా రక్షణ వ్యవహారాల నిపుణులు గుర్తించారు. ప్రత్యర్థి రష్యా బలిమిని తగ్గించడంలో సఫలమైన అమెరికా ఇప్పుడు చైనా, భారత్‌లతో ఆసియా ప్రపంచ మహా శక్తిగా పునరుజ్జీవమవనున్నదని అమితంగా కలవరపడుతోంది. 2035 సంవత్సరం నాటికి చైనా, భారత్‌ల మొత్తం జీడీపీ అమెరికా జీడీపీని పూర్తిగా అధిగమించనున్నదని ప్రపంచ ఆర్థికవేత్తలు ఘంటాపథంగా చెప్పుతున్నారు. ఆధునిక ప్రపంచ చరిత్రలో ప్రప్రథమంగా సంభవించనున్న పరిణామమిది.

అగ్రరాజ్యమంటే ఏమిటి? తన జాతీయ ప్రయోజనాలకు ప్రమాదమేర్పడినప్పుడు స్వీయ సైనిక శక్తిని నిర్ణయాత్మకంగా ఉపయోగించగల సామర్థ్యం, సంకల్పం కలిగి ఉండడమే ఒక అగ్రరాజ్యాన్ని నిర్వచించే విశిష్ట లక్షణం. పాశ్చాత్య అగ్రరాజ్యాలు తమ జాతీయ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లినప్పుడు తమ సైనిక బలాన్ని నిస్సంకోచంగా, అంతర్జాతీయ సమాజం ఆమోదం పొందనవసరంలేకుండా ఉపయోగించాయి. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ఈ శతాబ్దంలో మొట్టమొదటసారి అదే విధంగా వ్యవహరించింది. పాకిస్థాన్‌పై భారత్ నిర్ణయాత్మక సైనిక చర్య పాశ్చాత్య అగ్రరాజ్యాలలో అసూయ రేకెత్తించింది. వాస్తవిక దృష్టినీ కల్పించింది. ప్రపంచ అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ప్రభవిస్తున్న భారత్ తన సైనిక పాటవాన్ని నిర్ణయాత్మకంగా ఉపయోగించగల సామర్థ్యాన్ని, సంకల్పాన్ని నిరూపించుకుంది. అందుకే అసూయ. ఆపరేషన్ సిందూర్ ప్రపంచ అధికార సమతౌల్యతను పునర్ నిర్దేశించింది. దీనితో భారత్ శక్తి సామర్థ్యాలు పాశ్చాత్య అగ్రరాజ్యాలకు అవగతమయ్యాయి.

▪ మిన్హాజ్ మర్చెంట్

('ఓపెన్' సౌజన్యం)

ఆరోగ్య, ఐశ్వర్య, ఆనందప్రదేశ్ దిశగా...

ప్రజా జీవితంలో చంద్రబాబు నాయుడు, జగన్ మోహన్‌రెడ్డిలు భిన్న ధ్రువాలని రాష్ట్ర ప్రజలకు విదితమే. ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే సాధనం ప్రజాస్వామ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బలంగా విశ్వసిస్తారు. దీనికి భిన్నంగా ప్రజాస్వామ్య ముసుగులో అధికారాన్ని స్వార్థ ప్రయోజనాలకు దుర్వినియోగం చేసే విద్యలో జగన్‌రెడ్డి నిష్ణాతుడు. పలు కల్లబొల్లి మాటలు, విన్యాసాలతో 2019లో 153 అసెంబ్లీ స్థానాలతో అధికారం చేపట్టి, ఐదేళ్ల తర్వాత భారీ ప్రజా తిరస్కారానికి గురై కేవలం 11 స్థానాలకు పతనమయ్యారు. తాను ఊహించని ఈ పరిణామానికి ఆయన మైండ్ బ్లాకయ్యింది. ఓడినప్పట్నించీ ప్రజలపై ఉక్రోషాన్ని పెంచుకుని ప్రజాస్వామ్యం ప్రసాదించిన ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లను నిస్సిగ్గుగా వెన్నుపోటుదారులుగా అభివర్ణించే దుస్సాహసం చేశారు. గతంలో ప్రధానులుగా పనిచేసిన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి; ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎన్టీ రామారావు, నారా చంద్రబాబు నాయుడు వంటివారు ఓటమి పాలయినప్పుడు ప్రజాతీర్పునకు శిరసు వంచారు కానీ ప్రజల్ని వెన్నుపోటుదారులని దూషించలేదు.



గత సంవత్సర కాలంగా ప్రతి రోజూ ప్రజా శ్రేయస్సు కోసం, యువత ఉజ్వల భవిష్యత్తు కోసం తపిస్తూ పలు ఆలోచనలు, ప్రయత్నాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు. దీనికి భిన్నంగా తనను ఓడించారంటూ ప్రజలపై ఆగ్రహంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజాస్వామ్య వ్యతిరేక జపం చేస్తున్నారు. ఈ మానసిక వైకల్యంతో, ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల సమయమున్నా మళ్లీ అధికారం చేపట్టి తమ రాజకీయ ప్రత్యర్థులు, నియమాల ప్రకారం నడుచుకుంటున్న అధికారుల భరతం పడతానంటూ జగన్మోహన్‌రెడ్డి నిత్యం ఊగిపోతున్నారు. ఈ విధమైన పగ, ప్రతీకారాలతో ఎదురయ్యే అనర్థాల పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండాలి. స్వీయ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం ఈ విధంగా బరితెగించి నడుచుకునే నాయకుల్లో ఆయన అగ్రస్థానంలో ఉంటారు.

బటన్ నొక్కడమే అన్ని ప్రజాసమస్యలకు పరిష్కార మార్గంగా భావించిన జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు ఎందుకు తిరస్కరించినట్లు? ప్రజలకు నొప్పి కలిగితేనే కదా వారు మార్పు కోరుకునేది. ఇందుకు సంబంధించి ప్రజారోగ్య రంగంలో ఆయన హయాంలో నెలకొన్న పరిస్థితిని స్థూలంగా పరిశీలిద్దాం. జగన్ పాలించిన ఆ ఐదేళ్లూ భారీ ప్రకటనలు, ఆచరణ శూన్యతలకు ఆలవాలం. ఇందుకు ప్రజారోగ్య రంగం ఒక విశిష్ట సాక్ష్యం. రూ.8,400 కోట్ల ఖర్చుతో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్ని ఏర్పాటు చేస్తానని చెప్పి, అధికారం నుంచి దిగిపోయే నాటికి అందులో కేవలం 14 శాతం మాత్రమే ఖర్చు చేసి, తదుపరి బాధ్యతను కూటమి ప్రభుత్వంపై వదిలేశారు. నాడు–నేడు కార్యక్రమం కింద రూ.12,000 కోట్లతో వైద్య సదుపాయాల స్వరూపాన్ని సమగ్రంగా మార్చివేస్తానని బీరాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి, అందులో కేవలం 17 శాతం మాత్రమే ఖర్చు చేసి తదుపరి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వ వాకిట వదిలేశారు. జీరో వేకెన్సీ పాలసీ కింద వైద్య రంగంలో నియమాకాలన్నింటినీ పూర్తి చేశానని ఆయన గొప్పలు చెప్పుకున్నారు. వాస్తవంలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఐదేళ్లూ వైద్య రంగంలో కూడా అవినీతి అన్ని స్థాయిల్లో తాండవించింది. ప్రతి విషయంలోనూ రాజకీయ జోక్యం మితిమీరి వ్యవస్థ అస్తవ్యస్తమయ్యింది. ఉద్యోగ నియమాకాల లిస్టులు కలెక్టర్ కార్యాలయాల నుంచి కాకుండా వైసీపీ నేతల ఇళ్ల నుంచి వచ్చాయి.

వందలాది మంది డాక్టర్లు అనుమతుల్లేకుండా పనికి ఎగనామం పెట్టారు. డ్యూటీకి వచ్చినవారు మొక్కుబడిగా సంతకాలు చేసి స్వంత పనుల్ని చక్కబెట్టుకున్నారు. ప్రజలు, ముఖ్యంగా పేదల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి ఉన్న ఏ ముఖ్యమంత్రి అయినా ప్రజారోగ్య రంగాన్ని ఈ విధంగా గాలికొదిలేస్తారా? అది జగన్‌కే సాధ్యం. కూటమి ప్రభుత్వం పరిస్థితిని మెరుగుపరచడానికి నడుం బిగించి, మొదటి ఏడాదిలో మార్పు తేగలిగింది. జగన్ పుణ్యమా అని ఇంకా చేయాల్సింది చాలా ఉంది... చేస్తామని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం తరఫున ప్రజలకు హామీ ఇస్తున్నాను.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత మేరకు ఆరోగ్య, ఐశ్వర్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా ఆరోగ్య రంగంలో ముందుకు పోతున్నాం. ఇది మా విద్యుక్త ధర్మంగా భావిస్తున్నాం. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిజమైన అధినేతలని కూటమి విశ్వసిస్తోంది. ఓడించారని ప్రజల్ని వెన్నుపోటుదారులుగా దూషించే వారికి మేము భిన్నం.



○ సత్యకుమార్ యాదవ్
ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి

బడులొచ్చేశాయి

ఆకులన్నీ రాల్చుకుని
బట్టల్లేని నగ్నశిశువులా
ఒంటరిగా నిల్చొని ఉంది వేసవి బడి..

గిల్లి దండా, క్రికెట్, కబడ్డీ ఆటలన్నీ ఆడేసి
పిల్లలంతా ఒంటరిగా వొదిలేసి వెళ్ళిన
నేలచెక్కలా ఖాళీగా పడివుంది మైదానం.

కూలీలు లాక్‌డౌన్ ప్రకటించి
బోసిపోయిన గోడలతో
మిగిలిపోయిన ఫ్యాక్టరీలా
మౌనంగా రోదిస్తుంది ఖాళీగా ఉన్న బడి.

కోతలన్నీ ముగిసిపోయి
పేదజనం పరిగెలన్నీ ఏరుకొని వెళ్ళిపోయాక
కొంగలు కూడా పలకరించని
ఎండిన చెరువులా దీనంగా పడి ఉంది
ఆ బడి కమతం.

నిన్నంతా కాశీ అన్నపూర్ణమ్మ
నుదుటి బొట్టులా
ఆకాశాన్ని వెలిగించిన చందమామ
చుక్కలతో సహా పలాయనం
చిత్తగించిన ఆకాశంలాగా
ఖాళీగా, తేజోవిహీనంగా
వసంతం సమ్మె చేసిన తోటలా ఉంది
నిన్నటి పిల్లలు లేని బడి..

కుందేలు పిల్లల్లా
గున గున పరుగులు తీసే
పచ్చని తోటలా
అక్షరజ్యోతులను వెలిగించే
బడులొచ్చేశాయి.


– ఈతకోట సుబ్బారావు

వ్యాసాలు, ఉత్తరాలు
పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

తొలిపొద్దులో విజయకాంతులు

కూటమి ప్రభుత్వం కొలువుతీరి సరిగ్గా 12 నెలలు అయింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసంతో గాడి తప్పిన వ్యవస్థలను చక్కదిద్దుతూనే ప్రజలకు మెరుగైన పాలనను అందిస్తోంది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోంది. నవ్యాంధ్రప్రదేశ్‌ను ప్రగతిపథంలో నడిపించేందుకు అనేక సమస్యలను, సవాళ్లను అధిగమించి పురోగమనంలో పయనిస్తోంది. ఏడాది పాలనలోనే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 70శాతం నెరవేర్చింది.

యావత్ దేశం నివ్వెరపోయే ఫలితాలు సాధిస్తూ చంద్రబాబు పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు పెడుతోంది. దేశానికి దిక్సూచిగా నిలిచే నదుల అనుసంధానం, పి–4, వాట్సాప్ గవర్నెన్స్, ఆర్టీజీఎస్, 104, 108 అంబులెన్సుల ఆధునీకరణ, సురక్షిత తాగునీరు, యోగాంధ్ర వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తోంది. రాష్ట్రంలో రూ.4,000 పింఛన్ అమలు దేశవ్యాప్తంగా రికార్డుగా నిలిచింది. ఇందులో చంద్రబాబు నాయుడు ఒక్కరే రూ.2,834 పెంచారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.1,000 మాత్రమే పెంచింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటి నెలలోనే పింఛన్‌ను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచింది. మహిళలు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న ఉద్దేశంతోనే 'దీపం–2' పథకాన్ని ప్రారంభించి ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తోంది. రాబోయే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తోంది. మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి రుణ పరిమితిని రూ.10 లక్షలు నుంచి రూ.20 లక్షలకు పెంచింది.



విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. పేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు 'విదేశీ విద్య' పథకాన్ని పునరుద్ధరించడం, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయడం వంటి కీలక చర్యలు ప్రభుత్వం చేపట్టింది. 'యాక్టివ్ ఆంధ్ర', 'నో బ్యాగ్ డే', 'తల్లికి వందనం', 'యోగాంధ్ర', 'మెగా పేటీయం' వంటి వినూత్న కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేస్తోంది. ఉచిత ఇసుక విధానం ద్వారా 125 కుల వృత్తులు, వ్యాపారాలకు ప్రోత్సాహం లభించగా, 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు స్థిరమైన ఉపాధి లభిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో వైద్య ఆరోగ్యరంగం అంపశయ్య మీద ఉంది. 108, 104 అంబులెన్సులను నేడు కొత్త సర్వీసు ప్రొవైడర్‌కు అప్పగించి పేదలకు మెరుగైన వైద్యాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తోంది.


వైసీపీ ప్రభుత్వం రైతులకు కన్నీరు తప్ప, పంట పొలాలకు ఏనాడూ సాగునీరు అందించలేదు. కానీ కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో పెండింగ్ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ సముద్రంలోకి వృథాగా పోయే జలాలను కూడా ఒడిసి పట్టేందుకు నదుల అనుసంధానాన్ని చేపట్టి, దేశానికే ఆదర్శంగా నిలిచింది. పంట దిగుబడి పెంచడంతో పాటు రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యుత్ కోతలు, పవర్ హాలిడేలు, మూతపడ్డ పరిశ్రమలు, ఎండిపోయిన పంటలు గత ప్రభుత్వ హయాంలో కనిపించేవి. ఇప్పుడు సోలార్, విండ్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తూ రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలిచింది. 15వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్ళించకుండా రూ.1,987 కోట్లు పంచాయతీలకు విడుదల చేసింది.


గత అయిదేళ్ల రోడ్లపై గోతుల్లో తట్ట మట్టిపోసిన పాపాన పోలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.860 కోట్లతో 20 వేల కి.మీ. రోడ్లను గుంతలరహిత రహదారులుగా మార్చడానికి చర్యలు తీసుకుంది. రాష్ట్రాభివృద్ధికి గుండెకాయ లాంటి పారిశ్రామిక రంగం పట్ల గత పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. నేడు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని పారిశ్రామికవేత్తలకు వివరించి ఏడాది కాలంలో రూ.9.40 లక్షల కోట్ల పెట్టుబడులు, 8.5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించే పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువస్తోంది. యువగళం హామీల్లో ఒకటైన 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం శ్రమిస్తోంది. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం పెట్టుబడుల వికేంద్రీకరణకు కృషి చేస్తూ ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేలా ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రముఖ పరిశ్రమ, ఒక ఎంఎస్ఎంఈకి శ్రీకారం చుట్టింది. 26 జిల్లాల అభివృద్ధికి, యువతకు ఉద్యోగాల కల్పనకు దోహదపడేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రజారాజధాని అమరావతిని ప్రభుత్వం శరవేగంతో నిర్మిస్తోంది.

రెవెన్యూ శాఖలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి, వైసీపీ హయాంలో తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేసి, డిజిటల్ భూ రికార్డుల పునర్వ్యవస్థీకరణ ద్వారా పారదర్శకత పెంచింది. రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సుస్థిరమైన శాంతిభద్రతల ద్వారా రాష్ట్రంలో పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటక రంగం వికసించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. గంజాయి, డ్రగ్స్ వంటి నేరాలను నియంత్రించేందుకు యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ ఈగల్‌ను ఏర్పాటు చేసింది. మహిళల జోలికి వస్తే తాటతీసేలా ప్రత్యేక చట్టాలు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసింది. దూరదృష్టితో నవ్యాంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయపథం వైపు నడిపిస్తున్నారు. ఎలాంటి భేదభావం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు, కార్యక్రమాలు అమలు చేయడం చంద్రబాబు సుపరిపాలనకు సజీవ సాక్ష్యం.



• అనగాని సత్యప్రసాద్
ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి





అమరావతికి రైల్వేలైన్

వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన అమరావతి నూతన రైల్వే లైన్ ప్రాజెక్టు మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక తెరమీదకు వచ్చింది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో భూసేకరణకు నోటిఫికేషన్లను కూడా వెలువరించింది. ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం మీదుగా ఎన్టీఆర్ జిల్లా పరిటాల.. గుంటూరు జిల్లా అమరావతి మీదుగా నంబూరు వరకు నూతన అమరావతి రైల్వే లైన్‌ను నిర్మించనున్నారు. భూ సేకరణ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.



పెరిగిన విమాన సర్వీసులు

విజయవాడ విమానాశ్రయం కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ కళకళలాడుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాధించిన మిలియన్ మార్క్ ప్రయాణికుల రాకపోకలు మళ్లీ ఇప్పుడు సాధ్యమైంది. ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలకు రద్దైన విమానాలను పునరుద్ధరించటంతో పాటు అదనంగా మరిన్ని విమానాలను నడుపుతున్నారు. ప్రస్తుతం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 52 విమానాల రాకపోకలు సాగుతుండటం విశేషం. విదేశీ విమానాలకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. విమానాశ్రయంలో సాగుతున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులను కూడా వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంది.

పునర్నిర్మాణం



జెట్ సిటీ నమూనా

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న కూటమి పాలనకు నేటితో ఏడాది

- అశోక్ లేల్యాండ్ కంపెనీ ప్రారంభం.. 600 మందికి ఉద్యోగాలు
- అమరావతి రైల్వే లైన్, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు కదలిక
- జక్కంపూడి జెట్ సిటీ పునర్నిర్మాణానికి అడుగులు.. మల్లవల్లికి మహర్దశ
- పుంజుకున్న విమానయానం.. శరవేగంగా నూతన టెర్మినల్ పనులు
- ఓఆర్ఆర్, విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రవాణా సౌలభ్యం
- ఉమ్మడి కృష్ణాజిల్లా అభివృద్ధే లక్ష్యంగా మరిన్ని ప్రణాళికలు

కూటమి ప్రభుత్వం రాగానే ఉమ్మడి కృష్ణాజిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమై.. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టుల పునరుద్ధరణకు నడుం బిగించింది. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది. మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ కంపెనీని పునఃప్రారంభింపజేయడం, తద్వారా 600 మందికి ఉద్యోగాలు కల్పించడంతోనే తొలి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత విజయవాడ మెట్రో ప్రాజెక్టు, అమరావతి నూతన రైల్వే లైన్, జెట్ సిటీ పునరుద్ధరణతో అభివృద్ధి వైపు అడుగులు వేసింది. కేంద్రాన్ని ఒప్పించి జాతీయ రహదారి ప్రాజెక్టుల సాకారం దిశగా కృషి చేసింది. ఎన్‌డీబీ రోడ్ల విస్తరణ, మల్లవల్లి పారిశ్రామిక వాడకు పూర్వ వైభవం వంటి అనేక లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటితో ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ)





పట్టుబట్టి అశోక్ లేల్యాండ్ ప్రారంభం

అధికారంలోకి వస్తే మల్లవల్లిలోని అశోక్ లేల్యాండ్ ప్లాంట్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. అన్నట్టుగానే ఆ హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది.అధికారంలోకి రాగానే అశోక్ లేల్యాండ్ కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి, వారి ఇబ్బందులు ఏమిటో తెలుసుకుంది. ఎలక్ట్రిక్ బస్సులకు గతంలో బాడీ బిల్డింగ్ చేయాలన్న ఒప్పందం నడిచినా.. కరోనా అనంతరం తలెత్తిన ఆర్థిక మాంద్యం తదితర కారణాలతో ఉత్పాదకత తగ్గటం, బాడీ బిల్డింగ్‌కు ఇంత దూరం రావటం వయబిలిటీగా లేదని ఆ సంస్థ భావించింది. దీంతో ఎలక్ట్రికల్ బస్సులతో పాటు సాధారణ డీజిల్ బస్సులకు కూడా ఇక్కడే బస్ బాడీ బిల్డింగ్ చేసుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో అశోక్ లేల్యాండ్ యాజమాన్యం మిగతా 4లో..

పరిశ్రమలకు ఊతం

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమలు ప్రారంభించలేదన్న పేరుతో 376 యూనిట్ల భూ కేటాయింపులను రద్దు చేయటం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి మరో అవకాశాన్ని కల్పిస్తూ భూ కేటాయింపులను పునరుద్ధరించింది. పరిశ్రమలకు ఊతం ఇచ్చింది.

ఓఆర్ఆర్‌పై ఆశలు

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను కేంద్రం చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది. ఓఆర్ఆర్‌ను చేపట్టేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవలే స్వల్పంగా అలైన్‌మెంట్‌లో కేంద్రం ఆదేశాల మేరకు మార్పులు జరిగాయి. రోడ్డు 70 మీటర్లా.. 140 మీటర్లా అన్న దానిపై అధికారిక ఆదేశాలు రాగానే.. శరవేగంగా ఈ రోడ్డు పనులు పూర్తి కానున్నాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ సింహభాగం వెళుతోంది. ఓఆర్ఆర్‌కు భూ సేకరణ అధికారులను కూడా నియమించారు.



ఇదేం పద్ధతి?


'ప్రొటోకాల్' అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై విమర్శలు

- దుర్గమ్మ దర్శనానికి సిఫార్సు లేఖలు.. టికెట్లు తీయవద్దని నోట్‌లు
- ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారని పలువురి ఆగ్రహం

• తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లేవారిలో పలుకుబడి ఉన్న వారు ప్రజాప్రతినిధులు, అధికారుల సిఫార్సు లేఖలు తీసుకునివెళ్తారు. ఆ లేఖలతో సంబంధిత కౌంటర్‌కి వెళ్లి గుర్తింపు కార్డు ఫొటోస్టాట్ కాపీలను అందజేసి దరఖాస్తు పూర్తి చేస్తారు. ఇలా ఒక దరఖాస్తుపై ఆరుగురికి వీఐపీ బ్రేక్ దర్శనాన్ని టీటీడీ ఇస్తుంది. ఈ దర్శనం టికెట్లకు సంబంధించిన మొత్తాన్ని భక్తులు కౌంటర్లలో చెల్లించాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే భక్తుల చేతుల్లోకి టికెట్లు వెళ్తాయి.

• ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు కొంత మంది ప్రజాప్రతినిధులు, అధికారులు సిఫార్సు లేఖలు ఇస్తున్నారు. ఆ లేఖలపై దర్శనానికి వచ్చిన భక్తుల నుంచి ఎలాంటి టికెట్లు కొనుగోలు చేయించవద్దని రాస్తున్నారు. ఆలయ ఆదాయానికి గండి కొడుతున్న ప్రొటోకాల్ అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదేం పద్ధతి అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత అంత ప్రాచుర్యం కలిగినది విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం. ఆలయాలు అన్నింటిలోనూ ఒకే విధానం అమలు చేయాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా ఆచరణలో అమలు కావడంలేదు. దుర్గమ్మ ఆలయానికి ఆదాయాన్ని పెంచాలని అధికారులు ఆరాటపడుతుంటే కొంత మంది ప్రొటోకాల్ జాబితాలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం గండికొడుతున్నారు. సిఫార్సు లేఖలు ఇవ్వడంలో తప్పు లేదని, భక్తుల నుంచి టికెట్లు కొనుగోలు చేయించవద్దని రాయడం ఎంతవరకు సబబు అన్న ప్రశ్న దేవస్థానం వర్గాల నుంచి వినిపిస్తోంది. ఈ విధంగా టీటీడీకి ఇచ్చే లేఖలపై రాయగలరా అని మరికొందరు ప్రశ్నిస్తున్నారు.



రోజుకు వెయ్యి మందిపైనే..

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి రోజుకు 1000 మంది భక్తుల వరకు సిఫార్సులతో దర్శనానికి వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి జిల్లా పరిషత్ చైర్మన్లు మొదలు కేంద్ర మంత్రుల వరకు ఈ సిఫార్సు లేఖలు ఇస్తున్నారు. కొంతమంది కార్యాలయానికి ఫోన్ చేసి చెబుతుంటారు. మరికొంతమంది సందేశాలు మిగతా 4లో..

ఫ్లోటింగ్ యోగాతో చరిత్రలో స్థానం



షరీఫ్ హనీఫ్ నుంచి ప్రపంచ రికార్డు సర్టిఫికెట్ అందుకుంటున్న లక్ష్మీశ, కేశినేని చిన్ని, అజయ్ జైన్, ముఖేశ్ కుమార్ మీనా, ధ్యానచంద్ర, ఇలక్కియా

- బెరంపార్క్‌లో 2 వేల మందితో యోగాసనాలు
- ప్రపంచ రికార్డుగా గుర్తింపు.. సర్టిఫికెట్ ప్రదానం

ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమాలను వైవిధ్యంగా నిర్వహిస్తున్నారు. బుధవారం బెరంపార్క్‌లో నిర్వహించిన వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగాకు ప్రపంచ రికార్డు లభించింది. కలెక్టర్ జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో నదిలో సిద్ధం చేసిన ఫంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు తదితర 201 వాటర్ క్రాఫ్ట్‌లపై వెయ్యి మంది యోగాసనాలు వేశారు. నదీ తీరాన ఏర్పాటు చేసిన వేదికపై మరో వెయ్యి మందికి పైగా యోగాసనాలు ప్రదర్శించారు. వీటిని నిశితంగా పరిశీలించిన వరల్డ్ రికార్డు యూనియన్ న్యాయనిర్ణేత షరీఫ్ హనీఫ్ యోగాసనాలను నిర్వహించిన తీరు, ఆచరించిన విధానం, సమయ పాలన తదితరాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగాసనాల కార్యక్రమానికి ప్రపంచ రికార్డు సర్టిఫికెట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలోని అతిథి బృందానికి సర్టిఫికెట్‌ను అందజేశారు. 4



సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఏపీజీఏడీ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా
- నేడు పోరంకిలో జరిగే కార్యక్రమానికి హాజరుకానున్న చంద్రబాబు

పెనమలూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సాధారణ పాలనాశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా మిగతా 4లో..



అధికారులతో మాట్లాడుతున్న ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

నేటి నుంచి మోగనున్న బడి గంటలు



వేసవి సెలవులు ఇక ముగిశాయి. గురువారం నుంచి పాఠశాలలు తెరచుకోనున్నాయి. ఇప్పటికే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, షూ తదితర కొనుగోలులో బిజీ అయ్యారు.

భక్తితో దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

4

ఫాస్ట్‌ట్యాగ్‌తో పట్టుకున్నారు

ఈ నెల 3న ఎంజీ రోడ్డులో రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి.. కారు ఆపకుండా వెళ్లిపోయిన నిందితుడు
- పోలీసులకు సాంకేతికంగా చిక్కిన వైనం

విజయవాడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడి మరణానికి కారణమైన కారు యజమానిని మాచవరం పోలీసులు ఫాస్ట్‌ట్యాగ్ ద్వారా పట్టు కున్నారు. పోలీసులకు పక్కా ఆధారాలు లభించడంతో నిందితుడు లొంగిపోయాడు. వివరాల్లోకి వెళితే... ఈ నెల మూడో తేదీన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో ఆర్సీబీ విజయం సాధించడంతో యువకులు రహదారులపై విజయోత్సవాలు చేశారు. ఈ ఘటనలో ఒక యువకుడు విజయవాడ ఎంజీ రోడ్డులో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వించిపేట ఇస్మాయిల్ పేటకు చెందిన తాడిగిరి శేఖర్‌బాబు(30), స్నేహితులు ఉదయ్‌కుమార్, గొల్లవరపు శ్రీనాథ్ బైక్‌పై ర్యాలీలో పాల్గొన్నారు. శ్రీనాథ్ బైక్ నడుపుతుండగా వెనుక వైపున శేఖర్‌బాబు, ఉదయ్‌కుమార్ కూర్చున్నారు. బైక్‌కు ఒక్కసారిగా ఎక్సలేటర్ ఇవ్వడంతో పక్కన ఉన్న బైక్‌కు హ్యాండిల్ తగిలింది. దీనితో బైక్‌పై ఉన్న శేఖర్‌బాబు, ఉదయ్‌కుమార్ రోడ్డుపై పడిపోయారు. వెనుక వస్తున్న ఎరుపు రంగు బెంజ్ కారు శేఖర్‌బాబుపైనుంచి వెళ్లిపోయింది. పక్కనే ఉన్న వ్యక్తి ఇది గమనించి హెల్మెట్‌తో కారుపై బలంగా కొట్టారు. మొత్తం మిగతా 4లో..



భక్తితో గిరి ప్రదక్షిణ..

ఇంద్రకీలాద్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంగా గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవ మూర్తుల గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చి బలిహరణ సమర్పించారు. ఆలయ ఈవో వీకే శీనానాయక్ గుమ్మడికాయ దిష్టితీశారు. ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి తదితరులు కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, భక్తుల భజనలు భక్తిపారవశ్య వాతావరణంలో దుర్గమ్మ గిరిప్రదక్షిణ కుమ్మరిపాలెంసెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేళా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు.పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో షాపుల కేటాయింపు వేలం

ఇంద్రకీలాద్రి : దుర్గగుడిలో పూజాద్రవ్యాలు, ఆటవస్తువులు విక్రయించేందుకు దేవస్థానం మహామండపంలోని 5వ అంతస్తులో గల 19 షాపులకు మూడేళ్ల కాలపరిమితికి అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు బుధవారం సీల్డ్ కమ్ టెండర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 మంది దేవస్థానం బృందం వేలం ప్రక్రియను నిర్వహించారు. వేలం పాటలో 14 మంది పాల్గొన్నారు. కాగా, షాపు నెంబర్లు 1, 2, 3, 14, 15, 16, 17, 18 మొత్తం 8 షాపులకు వేలం పాటలో పాడుకున్నారు. అయితే 4 నుంచి 13 వరకు షాపులు, 19వ నెంబరు షాపునకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో పెండింగ్‌లో పెట్టారు. దేవదాయ శాఖ కమిషనర్ తుది ఉత్వర్వుల మేరకు నిలిచిపోయిన 11 షాపులకు వేలంపాటను నిర్వహించనున్నారు.

మైలవరం అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం

» ఎంపీ కేశినేని శివనాథ్

గొల్లపూడి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర విజన్-2047కు సంబంధించి సీఎం చంద్రబాబు ఆదేశానుసారం మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని, త్వరలో డాక్యుమెంటేషన్ అందజేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై గొల్లపూడి శ్రీసాయిదత్త కళ్యాణ మండపంలో బుధవారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పలు విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాలో హార్టికల్చర్ ఎక్కడైనా ఉందంటే అది మైలవరం నియోజకవర్గంలోనే అని, రాబోయే నాలుగేళ్లలో రాజధాని ప్రాంతంలో మరెన్నో అభివృద్ధి పనులు జరుగుతాయని అధికారులకు సూచించారు. పవిత్ర సంగమం వద్ద జలహారతిని తిరిగి ప్రారంభించాలని, సందర్శకులు పెరగడంతో పాటు చిరువ్యాపారులకు తోడ్పాటుగా ఉంటుందన్నారు. కృష్ణా తీరప్రాంతమైన చిన్నలంకను పర్యాటకంగా అభివృద్ధి చేసి బోటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కొండపల్లి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తే అమరావతికి తీసిపోని విధంగా మైలవరం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ఏపీ రాజధాని అమరావతికి మైలవరం ముఖద్వారం కానుందన్నారు. కొండపల్లి ఖిల్లాతో పాటు పవిత్ర సంగమం అభివృద్ధి, కొండపల్లి బొమ్మల ప్రాచుర్యానికి, అటవీ, పర్యాటకశాఖల సమన్వయంతో ఎకో టూరిజం అభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) బీజేపీ ఇన్‌చార్జి నూతులపాటి బాలకోటేశ్వరరావు, గూడపాటి పద్మశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరణ్, సివిల్ సప్లయిస్ డీఎం, విజన్ 2047 నోడల్ ఆఫీసర్ సతీష్, ఎండీవో, విజన్ 2047 కో-ఆర్డినేటర్ అనురాధలతో పాటు అధికారులు, టీడీపీ, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

» గ్రామస్థుల కోరిక మేరకే చెరువు పూడికతీత పనులు

విజయవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మట్టితో వ్యాపారం చేడయానికి రాజకీయాల్లోకి రాలేదని, నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నానని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మట్టి అక్రమ తవ్వకాలపై ఆధారాలు సమర్పిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ ప్రజల కోరిక మేరకే చెరువు పూడికతీత పనులకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. చెరువుల్లో తవ్వకాలు చేపట్టేవారు మీటరు కంటే ఎక్కువలోతు తవ్వితే కఠినచర్యలు తీసుకుంటామని, లారీల ద్వారా మట్టిని తరలించేందుకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికే మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్, వీరపనేనిగూడెం పారిశ్రామిక వాడలకు అదనంగా మరో రెండు పారిశ్రామికవాడలు నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నట్టు యార్లగడ్డ పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే ఆర్థికంగా కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షుడిగా సమరం



పటమట: ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు జి.సమరం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ సమరంతో పాటు వైస్ చైర్మన్‌గా వెలగా జోషి, జిల్లా కార్యదర్శిగా చిట్టిబాబు, కోశాధికారిగా పి.బాబ్జి, కార్యవర్గ సభ్యులుగా విజయలక్ష్మి, ఎమ్.అనురాధ, డాక్టర్ కొల్లేటి రమేష్, కర్లపాటి శ్రీనివాసరావు, ఎం.బలరామ్, సుధాకర్, ఎస్.జోషఫ్ జోషి, కె.జయరాజ్‌లు ఎన్నికయ్యారు.

శాప్ బోర్డు సభ్యుల నియామకం

విజయవాడ స్పోర్ట్స్ జూన్11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) బోర్డు సభ్యులుగా 8 మందిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎక్స్ అఫీషియో సభ్య కన్వీనర్‌గా ఉంటారు. ఇప్పటికే శాప్ చైర్మన్‌గా అనిమిని రవి నాయుడును ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఇ.రజని (చిత్తూరు), ఎ.రమణరావు (విజయవాడ), ఎం.డి. రమేష్ కుమార్ (విశాఖపట్నం), పేరం రవీంద్రనాథ్ (ఏలూరు), ఎస్.సంతోష్ కుమార్ (విజయవాడ పశ్చిమ), కె.జగదేశ్వరి (పోలవరం), బి.శివ (అనంతపురం), పి.బి.వి.ఎస్.ఎన్. రాజు (బుచ్చిరాజు) (అనకాపల్లి) లు బోర్డు సభ్యులుగా ఉన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

(3వ పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలన సందర్భంగా గురువారం పోరంకి మురళీరిసార్ట్సులో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. సదరు సభ ఏర్పాట్లను బుధవారం మీనా పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాకపోకలు, భద్రతకు ఎలాంటి అంతరాయం కలుగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఫైనాన్స్ కార్యదర్శి అనంతశంకర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు డీకే బాలాజీ, నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్లు గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు పాల్గొన్నారు.



ఆరోగ్య యోగం

పులకించిన కృష్ణా తీరం

కలెక్టర్ లక్ష్మీశకు ప్రశంసా పురస్కారం

కృష్ణా వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ ప్రపంచ రికార్డు

విద్యాధరపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21 వరకు నెలరోజుల పాటు ఒక్కోరోజు ఒక్కో థీమ్‌తో ఎన్టీఆర్ జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కృష్ణా నది తీరాన బెరంపార్క్‌లో నిర్వహించిన వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగాకు ప్రపంచ రికార్డు లభించింది. చిరుజల్లులు పడుతుండగా బెరంపార్క్‌లో యోగ సాధకులు ఆసనాలతో అబ్బురపరిచారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని తిలకించారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, సాధారణ పరిపాలన ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులకు ఘనస్వాగతం పలికారు. కలెక్టర్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈవెంట్‌ను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. తదితర 201 వాటర్ క్రాఫ్ట్‌ల పై వెయ్యిమంది యోగ సాధకులు ఆసనాలు వేశారు. తీర ప్రాంగణంలో వేదికపై మరో వెయ్యిమందికి పైగా యోగాసనాలు వేశారు. ఆద్యంతం యోగాసనాలను నిశితంగా పరిశీలించిన వరల్డ్ రికార్డు యూనిట్ న్యాయనిర్ణేత షరీఫ్ హనిఫ్ యోగాసనాలను నిర్వహించిన తీరు, ఆచరించిన విధానం, సమయపాలన తదితరాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. హర్షధ్వానాల మధ్య వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగాసనాల కార్యక్రమానికి ప్రపంచ రికార్డు సర్టిఫికెట్ ఇస్తున్నట్టు ప్రకటించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో అతిథి బృందానికి ఆమె సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రమశిక్షణ, సమష్టి కృషి, నిబద్ధత ఫలితంగా సరికొత్త ప్రపంచ రికార్డు సాధించిందన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, ప్రజల సమష్టి కృషితో రికార్డు సాధించినట్టు పేర్కొన్నారు. ఈనెల 21న విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో 5లక్షల మందితో యోగాసనాలు వేయించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అజయ్ జైన్ మాట్లాడుతూ, ఐక్యతకు సమష్టి కృషికి ప్రపంచ రికార్డు లభించిందని పేర్కొన్నారు. యోగా ఈవెంట్‌లో తాను పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, యోగాపై అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయటంలో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తుందని చెప్పారు. కృష్ణమ్మ ఒడిలో, కనకదుర్గమ్మ పాదాల చెంత భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన యోగాసనాలకు పట్టం కట్టడం జీవితంలో మరిచిపోలేని సంఘటనగా భావిస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ పిలుపు మేరకు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 300 మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వలంటీర్లు పాల్గొన్నట్లు కో-ఆర్డినేటర్ కొల్లేటి రమేష్ తెలిపారు.

టీమ్ ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రపంచ రికార్డు సాధించటం సంతోషంగా ఉందన్నారు. జేసీ ఎస్.ఇలక్కియా, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ బి.చంద్రశేఖర్, ఆయుష్ అధికారులు వి.రాణి, రామతల్లేహి, రత్నప్రియదర్శిని, జిల్లా అధికారులు డాక్టర్ ఎం.సుహాసిని, ఎ.శిల్ప, జి.జ్యోతి, డాక్టర్ జె.సుమన్, పి.లావణ్యకుమారి, ఎ.ఎన్.వి.నాంచారరావు, ఎ.రా ము, వి.పెద్దిబాబు, తహసీల్దార్లు ఇంతియాజ్ పాషా, రోహిణిదేవి, సుగుణకుమారి, సూర్యారావు పాల్గొన్నారు.

ఏరువాకా సాగారో..

» ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభం



కంచికచర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి వర్షం పడటంతో రైతులు పత్తి విత్తనాలు వేస్తున్నారు. ఈ ఏడాది మిర్చి, పత్తి విస్తీర్ణం తగ్గనుండగా, మొక్కజొన్న విస్తీర్ణం పెరగనున్నది. మే నెలలో భారీ వర్షాలు పడినప్పటికీ రైతులు విత్తనాలు చల్లలేదు. కొద్దిమంది రైతులు మాత్రం మొక్కజొన్న వేశారు. చెత్తా, చెదారం వేరించి, పంటభూములను బాగుచేసి, సాగుకు సిద్ధం చేసి ఉంచారు. ఈ నెలలో పదో తేదీ వరకు చినుకు పడకపోవటం వల్ల విత్తనాలు వేయటానికి వీలుపడలేదు. మంగళవారం రాత్రి డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో వర్షం పడింది. వత్సవాయిలో అత్యధికంగా 62.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. జగ్గయ్యపేటలో 24.8, పెనుగంచిప్రోలులో 24.8, నందిగామలో 18.2, వీరులపాడులో 33.2, కంచికచర్లలో 27.2, చందర్లపాడులో 12.6, సగటున 29.0 మిల్లీమీటర్ల వర్షం పడింది. భూములు పదును కావటంతో రైతులు బుధవారం పత్తి విత్తనాలు వేయటం ప్రారంభించారు. పత్తి విత్తనాల సంచి ధర రూ. 37లు పెరిగింది. గత ఏడాది రూ. 864 ఉన్న 475 గ్రాముల పత్తి విత్తనాల సంచి ధర ఈ ఏడాది రూ. 901 చేరింది. పత్తి విత్తనాలకు ప్రస్తుతం చెప్పుకోదగిన గిరాకీ లేదని డీలర్లు చెబుతున్నారు. రుతుపవనాలు బలంగా ఉన్నాయని, మూడు రోజులు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారుల ప్రకటనలతో వచ్చే వారం మొక్కజొన్న, పెసర, మినుము పంటలు సాగు చేయాలని రైతులు యోచిస్తున్నారు. ఈ ఏడాది మిర్చి విస్తీర్ణం గణనీయంగా తగ్గనున్నది. గత సీజన్‌లో మిర్చికి గిట్టుబాటు ధర లభించలేదు. దిగుబడి కూడా ఆశాజనకంగా లేదు. 90శాతం మంది రైతులు నష్టపోయారు. ఈ ఏడాది పత్తి మద్దతు ధర రూ. 589లు పెరిగినప్పటికీ పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే ఆలోచనలో ఉన్నారు. అయితే మొక్కజొన్న విస్తీర్ణం పెరగనున్నది. కోళ్ల దాణాతో పాటుగా మద్యం తయారీలో కూడా మొక్కజొన్న విరివిగా వినియోగిస్తున్నారు. డిమాండ్ బాగా ఉండటం, పెట్టుబడి కూడా తక్కువ కావటం వల్ల రైతులు మొక్కజొన్న సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు.

దేశ సౌభాగ్యానికి పునాదిరాళ్లు రైతన్నలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దేశ సౌభాగ్యం, ఆరోగ్య భాగ్యానికి పునాది రాళ్లు ఆరుగాలం శ్రమించే రైతన్నలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. 'ఏరువాక పౌర్ణమి'ని ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో మంగళవారం అన్నదాతల మధ్య ఉత్సాహంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు కష్టమే ప్రజల కడుపు నింపుతుందన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలన్నారు. మైసమ్మతల్లి ఆగ్రోఫామ్, జక్కంపూడి, అమరావతి కిసాన్ డ్రోన్ గ్రూప్ రాయనపాడు సభ్యులకు 80శాతం రాయితీపై ఆయన డ్రోన్లను అందజేశారు. కొద్దిసేపు ట్రాక్టర్ నడిపి కలెక్టర్ సందడి చేశారు. జిల్లా వ్యవసాయధికారిణి విజయకుమారి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

సేంద్రియ ఎరువుల గుంతలపై దృష్టి పెట్టండి

కలెక్టరేట్ : పారిశుధ్య సమస్యకు చెక్‌పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బహుళ ప్రయోజనాలున్న సేంద్రియ ఎరువుల గుంతల నిర్మాణ పనుల ప్రారంభానికి ఈనెలలో మెగా గ్రౌండింగ్ మేళా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉపాధి పనుల్లో పురోగతిపై కలెక్టర్ బుధవారం ఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఇతర క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా వుంచుతూ ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు దోహదంచేసే సేంద్రీయ ఎరువుల గుంతల (కంపోస్ట్ పిట్)పై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లాలో తొలివిడత మంజూరైన 16 వేల గుంతల ఏర్పాటుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కమ్యూనిటీ ఇంకుడు గుంతల ఏర్పాటుకు ఈనెల 20లోగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం అమలుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము పాల్గొనగా, క్షేత్రస్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

ఇదేం పద్ధతి?

(3వ పేజీ తరువాయి)

పంపుతుంటారు. ఇలా వచ్చిన వారికి ప్రొటోకాల్ విభాగంలో సిబ్బంది ఒక సహాయకుడిని ఇచ్చి దర్శనానికి పంపుతుంటారు. ఈ సిఫార్సు దర్శనాలు ఎక్కువ కావడంతో దుర్గగుడి అధికారులు కొన్నాళ్ల క్రితం ఒక నిర్ణయం తీసుకున్నారు. ఎంతమంది దర్శనానికి వస్తే అందులో సగం మందితో టికెట్లుకొనిపించాలని నిర్ణయించారు. ఒక సిఫార్సు లేఖపై నలుగురు వస్తే వారిలో ఇద్దరితో టికెట్లు కొనుగోలు చేయించి మిగిలిన ఇద్దరిని ఉచితంగా దర్శనానికి పంపుతున్నారు. ఇలా చేయడంతో దర్శనానికి వచ్చిన వారు ప్రొటోకాల్ ఆఫీస్ దగ్గర నుంచే సిఫార్సు చేసిన వారికి ఫోన్ చేసి టికెట్లు తీసుకోమంటున్నారని చెబుతున్నారు. సిఫార్సు చేసిన వారు సహాయకులపై చిందులు తొక్కడంతో సిబ్బంది చేసేదిలేక ఉచితంగానే అంతరాలయ దర్శనాలకు పంపుతున్నారు. ఇప్పుడు ఏకంగా సిఫార్సు లేఖలు ఇస్తున్న వారే భక్తులతో టికెట్లు కొనుగోలు చేయించవద్దని ఒక నోట్ పెడుతున్నారు. ఇదిప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అంతరాలయం తప్ప మరో దర్శనం వద్దు

ప్రజాప్రతినిధులు, అధికారుల పేషీల సిఫార్సులతో వచ్చిన భక్తులు అంతరాలయం దర్శనానికి తప్ప మరో దర్శనం చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల సిఫారసుతో వచ్చినందున తమకు ప్రొటోకాల్ వర్తిస్తుందన్న భావనలో భక్తులు ఉంటున్నారు. దుర్గగుడికి ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ మూడు వారాల్లో రోజుకు 30 వేల నుంచి 40వేల మంది అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ఆలయంలో ఉచిత దర్శనం, రూ.100, రూ.300, రూ.500 దర్శనాలు ఉన్నాయి. ఇందులో రూ.500 టికెట్ తీసుకున్న భక్తులను అంతరాలయంలోకి అనుమతిస్తారు. రూ.300 టికెట్ ఉన్న భక్తులకు ముఖ మండప దర్శనం చేయిస్తారు. ఆలయంలో ఒక్కోసారి రూ.500 క్యూ రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో సిఫార్సులతో వచ్చిన వారిని రూ.300 క్యూలో పంపాలని ప్రొటోకాల్ సిబ్బంది భావిస్తుంటారు. అంతరాలయం క్యూ రద్దీగా ఉన్నందున ముఖ మండప దర్శనానికి వెళ్లాలని సిబ్బంది భక్తులకు సూచిస్తుంటారు. దీనికి వారు ససేమిరా అంటున్నారు. దీనితో వారిని ప్రముఖులను తీసుకువెళ్లే మార్గంలో దర్శనానికి పంపాల్సిన పరిస్థితి వస్తుంది. దీనిపై అప్పటి వరకు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడిన భక్తులు మండిపడుతున్నారు. ఈ భక్తులకు అంతరాలయం చేయించకపోతే సిఫార్సు చేసిన వారి నుంచి చివాట్లు పడతాయి అన్న భయంతో తప్పక అంతరాలయంలోకి పంపుతున్నారు. దీనివల్ల ఇతర భక్తుల నిరసనను తాము ఎదుర్కోవాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. టికెట్లు తీసుకోవడం వల్ల వచ్చే ఆదాయం అమ్మవారి హుండీకే చెందుతుంది తప్ప తమ జేబులోకి రాదని ఆలయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

పునర్నిర్మాణం

(3వ పేజీ తరువాయి)

వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టింది. మొత్తం 75 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాంట్స్‌ను సన్నద్ధం చేసింది. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అశోక్ లేల్యాండ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా స్థానికంగా ఉన్న 600 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ ప్లాంట్ మళ్లీ ప్రారంభం కావడానికి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విశేషమైన కృషి జరిపారు.

● విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం రాగానే కదలిక వచ్చింది. మొత్తంగా 38.4 కిలోమీటర్ల పొడవున రెండు కారిడార్లను నిర్మించటానికి అడుగులు పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కోసం కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. దాదాపుగా టెండర్ల దశకు చేరుకుంటోంది.

● కేంద్రం విజయవాడకు అతిపెద్ద ఫ్లై ఓవర్‌ను మంజూరు చేస్తూ శుభవార్త వినిపించింది. రూ.600 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్-16 మీద ఆరు వరసల విధానంలో నిర్మించేందుకు డీపీఆర్ కూడా పూర్తయింది. ఫ్లై ఓవర్ మీద మెట్రో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేలా.. నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు 4.5 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించేందుకు అడుగులుపడ్డాయి. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు సంబంధించి మెట్రో అధికారులు రూ.1000 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు వేసి మోర్తుకు పంపించారు.

● జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పని, నివాసం ఒకేచోట అన్న విధానంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 15 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జెట్ సిటీకి పునర్వైభవం దిశగా అడుగులు పడ్డాయి. ఫ్యాక్టరీ ఫ్లాటెడ్ కాంప్లెక్స్‌ను పూర్తి చేయటానికి అపెక్స్, ఏపీఐఐసీలకు సంయుక్తంగా బాధ్యతలను అప్పగించింది.

● ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలో మొత్తం 13 ఆర్అండ్‌బీ రోడ్లను రెండు వరసలుగా విస్తరించేందుకు రూ.245 కోట్లతో శ్రీకారం చుట్టగా, కేవలం మూడూ రోడ్లనే అప్పట్లో చేపట్టడం జరిగింది. మిగిలిన 10 రోడ్ల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. కూటమి ప్రభుత్వం రాగానే.. ఎన్‌డీబీ పనులపై దృష్టి సారించటంతో ఉమ్మడి జిల్లాలో 10 ఆర్అండ్‌బీ రోడ్ల పనులను ప్రారంభించారు.

● విజయవాడ - నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ - ఖమ్మం మధ్య తలపెట్టనున్న నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ పనులు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం రాగానే ఎన్‌హెచ్‌కు స్వాధీనం చేసిన భూముల్లో పనులు మొదలయ్యాయి.

ఫాస్ట్‌ట్యాగ్‌తో పట్టుకున్నారు

(3వ పేజీ తరువాయి)

అందరూ తనపై దాడి చేస్తారన్న భయంతో కారు యజమాని వేగంగా వెళ్లిపోయాడు. కారుకు నంబరు బోర్డు లేకపోవడంతో సీసీ కెమెరాల్లో ప్రమాద దృశ్యాలు కనిపించినా ఫలితం లేకపోయింది.

100 సీసీ కెమెరాల పరిశీలన

ఈ కేసులో నిందితుడ్ని ఎలాగైనా అరెస్టు చేయాలని అధికారుల నుంచి మాచవరం పోలీసులకు ఆదేశాలు అందాయి. ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి 100 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. మొత్తం కారు వెళ్లిన మార్గాలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు కీసర టోల్‌గేట్ వద్ద నిందితుడ్ని గుర్తించారు. పల్నాడు జిల్లాకు చెందిన కె.కిరణ్‌ను నిందితుడిగా నిర్ధారించారు. కిరణ్ బేకరీ నిర్వహిస్తున్నాడు. అతడు తన స్నేహితుడితో కలిసి మూడో తేదీన రాత్రి హైదరాబాద్‌కు వెళ్లడానికి పల్నాడు నుంచి బయలుదేరాడు. ఎంజీ రోడ్డులో ఐపీఎల్ విజయోత్సవాలు జరుగుతుండడంతో వాటిలో పాల్గొనడానికి కారును ఈ మార్గంలో తిప్పాడు. సరిగ్గా ఎంజీ రోడ్డులో శ్రీచైతన్య కళాశాల వద్ద శేఖర్‌బాబుపై నుంచి కారు ఎక్కించాడు. తర్వాత అక్కడి నుంచి వేగంగా వేర్వేరు రూట్లలో హైదరాబాద్ రహదారిపైకి వెళ్లాడు. కీసర టోల్‌గేట్ వద్ద టోల్ చెల్లించడానికి ఆగడాడు. ఫాస్ట్‌ట్యాగ్ ద్వారా టోల్ చెల్లించాడు. విజయవాడ నుంచి ఒక సీసీ కెమెరా నుంచి మరో సీసీ కెమెరాను అనుసంధానం చేసుకుంటూ వెళ్లిన మాచవరం పోలీసులకు కీసర టోల్ ప్లాజా వద్ద కారు యజమాని కిరణ్ ఆధారాలు లభించారు. హైదరాబాద్ వెళ్లిన తర్వాత కారుకు మరమ్మతులు చేయించడానికి మాదాపూర్‌లోని ఓ షెడ్‌లో ఉంచాడు. కారును పరిశీలించగా ప్రమాదానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించాయి. అక్కడ కారును పెట్టేసిన తర్వాత కిరణ్, అతడి స్నేహితుడు పల్నాడుకు చేరుకున్నారు. ఫాస్ట్‌ట్యాగ్‌లో ఉన్న సెల్ నంబరు ఆధారంగా కిరణ్‌ను అరెస్టు చేశారు. ప్రమాదం తానే చేసినట్టుగా పోలీసుల ముందు అంగీకరించాడు. తనపై మిగిలిన వారు దాడి చేస్తారన్న భయంతోనే పారిపోయినట్టు వివరించాడని తెలిసింది.



తాళాలివ్వండి!

» మనీష్ షిండే మిల్స్‌కు ఏపీఐఐసీ మెయిల్

» ప్రారంభానికి ఏర్పాట్లు చేసుకుంటామని అభ్యర్థన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మల్లవల్లిలోని మెగా ఫుడ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) తాళాలను అప్పగించాల్సిందిగా ఏపీఐఐసీ జోనల్ అధికారులు నిర్వహణ సంస్థ మనీష్ షిండే మిల్స్‌కు లేఖ రాశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సంస్థ నిర్వహణను దక్కించుకుంది. రూ. 15 కోట్ల మేర బకాయిలున్నాయని సంస్థ నిర్వాహకులు కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌కు తాళాలు వేశారు. మెగా ఫుడ్ పార్క్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల కామన్ అవసరాలకు ఉపయోగపడేలా ఏపీఐఐసీ అధికారులు రూ.30 కోట్లు వెచ్చించి సీపీసీని ఏర్పాటు చేశారు. మనీష్ షిండే మిల్స్ యాజమాన్యం తమకు ప్రభుత్వం నుంచి రూ. 15 కోట్లు రావాలని డిమాండ్ చేస్తోంది. అంత ఇవ్వాల్సిన అవసరం లేదని ఏపీఐఐసీ వాదిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన చెల్లింపులపై విచారణ జరిపించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఏపీఐఐసీ అధికారులు మాత్రం నిర్వహణ సంస్థ నుంచి తాళాలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. సంస్థ యాజమాన్యానికి ఏపీఐఐసీ జోనల్ అధికారులు మెయిల్‌ను కూడా పంపారు. రూ.1.45 కోట్ల డబ్బులను చెల్లిస్తామని సంస్థకు మరికొన్ని ఆఫర్లను కూడా ఏపీఐఐసీ అధికారులు ఇచ్చారు. అతి త్వరలో సీపీసీని అధికారికంగా ప్రారంభించనున్నామని, ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావటానికి వీలుగా సన్నద్ధం చేయటానికి తాళాలు ఇవ్వాల్సిందిగా మనీష్ షిండే మిల్స్ యాజమాన్యాన్ని ఏపీఐఐసీ అభ్యర్థించింది.

సికింద్రాబాద్-కాకినాడ టౌన్ రైలు రద్దు

రైల్వేస్టేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నందున 07041 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలును ఈనెల 12న, 07042 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలును ఈనెల 13న రద్దు చేశారు. ఈమేరకు విజయవాడ డివిజన్ పీఆర్ఓ నుస్రత్ ఎం మండ్రూపకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బెంజిసర్కిల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బృందావన విద్యుత్ ఉపకేంద్రం ఎలక్ట్రిసిటీ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరపరా ఉండదని ఏర్పడనుందని కార్యనిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ కన్వెన్షన్, గ్రాండ్ హోటల్, పకీర్‌గూడెం రోడ్డు, జార్జిపేట, సిద్ధార్థ మహిళా కళాశాల, ప్రశాంత్ హాస్పిటల్. డి అడ్రస్ మాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరపరా ఉండదని తెలిపారు.

చంద్రబాబు అంటేనే అభివృద్ధి, సంక్షేమం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అంటేనే అభివృద్ధికి పర్యాయపదంగా మారిందని, చంద్రబాబు అంటేనే అభివృద్ధి, సంక్షేమం అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధి 4వ డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ ఏడో రోడ్డు బృందావనం అపార్ట్‌మెంట్ ఏరియాలో బుధవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. కాలనీలో సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపట్టే రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడను రాజధాని నగరంగా ప్రకటించినప్పటి నుంచి టీడీపీ హయాంలో అనేక అభివృద్ధిపనులు చేపట్టామని అన్నారు. సీఆర్‌డీఏ నుంచి నగరంలోని డ్రైయిన్ల నిర్మాణానికి రూ. 250 కోట్లు, రోడ్ల నిర్మాణానికి రూ.150 కోట్లు కేటాయించామన్నారు. నగర అభివృద్ధితో పాటు తూర్పులోని డ్రైయిన్లు, రోడ్ల నిర్మాణాలతో పాటు ప్రధాన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వడ్లపట్ల నాని, కొనరాజు రవి, కార్పొరేషన్ ఈఈ పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించేలా కూటమి పాలన

కృష్ణలంక: పేదరికాన్ని జయించేలా కూటమి ప్రభుత్వ పాలన వుంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం తూర్పులోని కృష్ణలంక 22వ డివిజన్‌లో గంగానమ్మ గుడి ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికంగా వున్న సమస్యలపై మాట్లాడారు. అనంతరం డివిజన్‌లో దాదాపు రూ. కోటి 70 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గద్దె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈ ఒక్క రోజే దాదాపు రూ.16 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఇంటికొక వ్యాపారవేత్త లేదా పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకుడు పలిశెట్టి అన్నారావు, నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, వేముల దుర్గారావు, పాల్గొన్నారు.

జిమ్ బిల్డింగ్ ప్రారంభం

రాణిగారితోట: కూటమి ప్రభుత్వం హయాంలో నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. రాణిగారితోట 17వ డివిజన్‌లో బుధవారం పర్యటించిన ఆయన రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన జిమ్ బిల్డింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు రాయి రంగమ్మ, వేముల దుర్గారావు, కొక్కిరి తిరుపతయ్య పాల్గొన్నారు.

దుర్గగుడి సిబ్బంది సమస్యల పరిష్కారానికి స్పెషల్ గ్రీవెన్స్

ఇంద్రకీలాద్రి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో పనిచేసే సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు నెలలో రెండో బుధవారం స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ తెలిపారు. బుధవారం దేవస్థానం కార్యాలయంలో ఆలయ సిబ్బంది నుంచి వివిధ సమస్యలపై ఈవో గ్రీవెన్స్ వినతులు స్వీకరించారు. పదోన్నతులు, ఉద్యోగ సమస్యలపై సిబ్బంది ఈవోకు వినతి పత్రాలు అందజేశారు. దేవస్థానంలో పనిచేసే అన్ని స్థాయిల సిబ్బంది తమ సమస్యలను తెలపవచ్చని పరిపాలన విభాగం అధికారులు పేర్కొన్నారు.



ఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగి

దుర్గగుడిలో కారుణ్య నియామకం

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో పనిచేస్తూ మృతి చెందిన వ్యక్తి కుమార్తె సరిపల్లి అమ్ములు అనే మహిళకు కారుణ్య నియామకం కింద స్వీపర్‌గా బుధవారం ఈవో శీనానాయక్ నియామక పత్రాలను అందజేశారు.

కాళీమాతకు మల్లెల అలంకారం



కృష్ణలంక, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జ్యేష్ఠ మాసం ఏరువాక పౌర్ణమి సందర్భంగా శ్రీ కాళీమాత అమ్మవారిని బుధవారం మల్లెపూలతో ఆలయ కమిటీ సభ్యులు అలంకరించారు. పౌర్ణమి సందర్భంగా మూర్తి సూర్యప్రకాశ శర్మ అధ్వర్యంలో 25 మంది దంపతులతో చండీహోమం నిర్వహించారు. అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకం, వేదస్వస్తి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.పుల్లయ్య, జగదీష్‌కుమార్, విజయ్‌కిరణ్, జగన్, శ్రీవిజయ్, సత్యం, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పనిచేయని ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్లు

బస్టేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యల కారణంగా గురువారం జిల్లాలోని ఏపీఎస్ఆర్టీసీ అన్ని బస్‌పాస్ కౌంటర్లను మూసి వేస్తున్నారు. సాంకతికపరమైన అసౌ కర్యం కలిగిస్తున్నందుకు వినియోగదారులు సహకరించాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.వై.దానం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 13న అన్ని బస్‌పాస్ కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

సాంబశివరావుకు ఎంపీ శివనాథ్ పరామర్శ



భారతీనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్ బుధవారం నాల్గో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావును గాయత్రీనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం సాంబశివరావు తల్లి స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

వన్‌టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రోడ్డు పాత బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పాత బస్టాండ్ వద్ద ఏలూరు రోడ్డు వైపు వెళ్లే వై జంక్షన్ వద్ద ఓ వ్యక్తిని బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొంది. అతనిపై బస్సుచక్రం ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లేకపోవటంతో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 50 ఏళ్ల లోపు ఉంటాయని పోలీసులు తెలిపారు.

ఎస్ఆర్ఆర్ స్థలంలో వేరెవరికీ అనుమతులు ఇవ్వొద్దు

నగర కమిషనర్ ధ్యానచంద్రకు పూర్వ విద్యార్థుల వినతి



కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు

గుణదల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ సీవీఆర్ కళాశాలకు చెందిన ప్రభుత్వ భూమిలో ఇతర విద్యాసంస్థలకు, వ్యక్తులకు అనుమతులు ఇవ్వొద్దని నగర కమిషనర్ ధ్యానచంద్రకు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం వినతి పత్రం ఇచ్చింది. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు లంక జానయ్య, చిగురుపాటి యుగంధర్, మాజీ డిప్యూటీ మేయర్ కృష్ణకుమార్, దోనేపూడి శంకర్ తదితరులు బుధవారం కమిషనర్‌ను కలిశారు.ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదని, కోర్టు వివాదంలో ఉన్న స్థలాన్ని పరిరక్షించి సెక్షన్ 22 1 ఏ ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాని కోరారు. తమ విజ్ఞప్తి మేరకు కమిషనర్ ఆ స్థలాన్ని పరిరక్షిస్తామని, ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇచ్చేది లేదని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా చూడండి

కార్పొరేషన్ : నగరంలో ఆకస్మాత్తుగా కురుస్తున్న వానలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఉదయం వైర్లెస్ సెట్ ద్వారా అధికారులతో మాట్లాడారు. వర్షం పడినప్పుడు ఎక్కడైతే రోడ్డుపైన నీటి నిల్వలు నిలుస్తాయో, అక్కడ వెంటనే నిల్వకుండా "మాన్సూన్ యాక్షన్ ప్లాన్" అమలు చేయాలని సూచించారు. దానిలో భాగంగా అధికారులు రోడ్డుపైన నిల్వలు ఉండే ప్రదేశాలకు వాహనాలను పంపించి వెంటనే నీటినిల్వలు తొలగించాలని ఆదేశించారు. అధికారులు ప్రజలకు ఎక్కడ ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

త్వరలో నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య సదస్సులు



మాట్లాడుతున్న కోట వెంకటేశ్వర రెడ్డి, గోళ్ల తదితరులు

విజయవాడ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నవ్యాంధ్ర సమగ్ర అభివృద్ధికి ప్రజలలో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో, బుధవారం నగరంలోని ఎంబీవీకే ఆడిటోరియంలో నవ్యాంధ్ర చైతన్య వేదిక ఆధ్వర్యంలో సాంస్కృతిక చైతన్య ప్రచార కరపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. నవ్యాంధ్ర చైతన్య వేదిక గౌరవాధ్యక్షులు గోళ్ల నారాయణరావు, అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి చింతకాలయ చిట్టిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నవ్యాంధ్ర రాష్ట్రవ్యాప్తంగా 30 కేంద్రాల్లో 'నాడు-నేడు-రేపు' పేరుతో చైతన్య సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయిలో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. రాజధాని అమరావతిని సాంకేతిక, సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేసి, కృష్ణానదీ తీరాన ట్యాంక్ బండ్ నిర్మించి తెలుగు జాతి మహనీయుల విగ్రహాలతో పాటు ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కోట వెంకటేశ్వరరెడ్డి, జి.సుదర్శనరాజు, జేఎస్ఎస్ ఝాన్సీ, కె.రాజ్యలక్ష్మిలు కలిసి నవ్యాంధ్ర చైతన్య గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, జి.సుదర్శనరాజు, విజయగణేష్, శోభన్, రామయ్య, ప్రచార కార్యదర్శి కె.వి.నారాయణ, బోడి ఆంజనేయరాజులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కూటమి కృషి: ఎంపీ



జాతీయ అధ్యక్షురాలు పూనమ్ శర్మకు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

లబ్బీపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతే ప్రధాన ఎజెండాగా కృషి చేస్తుందని, రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల స్థాపన ద్వారా మధ్య తరగతి కుటుంబాలలోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించారని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఫ్లో విజయవాడ 21వ చాప్టర్‌ను బుధవారం హోటల్ వివంతలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సాధికారత కోసం విశేష కృషి చేస్తున్నారని, 2047 నాటికి వికసిత్ భారత్ కావాలంటే మహిళా పనిశక్తి 70 శాతం ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఫిక్కీ ఆధ్వర్యంలో ప్రతిభ గల 15 మంది పేద విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు, చేనేత ఉత్పత్తుల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి ఎండీ శైలజ కిరణ్, ఫిక్కీ ఫ్లో నేషనల్ ప్రెసిడెంట్ పూనమ్ శర్మ, ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ రష్మి సరిత, విజయవాడ చాప్టర్ అధ్యక్షులు అమిత కుమార్, మెంటార్ పద్మ రాజగోపాల్, గవర్నింగ్ బాడీ సభ్యురాలు ఉషారాణి మన్నె, వైజాగ్, గుంటూరు, విజయవాడ నుంచి 132 మంది సభ్యులు పాల్గొన్నారు.

తొమ్మిది కేజీల గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

బెంజిసర్కిల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 9 కేజీల గంజాయిని పటమట పోలీసులు మంగళవారం రాత్రి పటమటలంక చేపల మార్కెట్ సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం గుండ్ల వంశీ కుమార్ మొబైల్ రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇతని స్నేహితుడు గుంచి సాయి తరుణ్ హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నాడు. వీరు గంజాయికి బానిసలయ్యారు. గంజాయి విక్రయిస్తే అధిక నగదు వస్తుందనే ఆశతో మూడు రోజుల క్రితం ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ వెళ్లి 9 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. కేజీ రూ.3 వేల చొప్పున తీసుకున్నారు. వీటిని చిన్నచిన్న ప్యాకెట్లో పెట్టి విక్రయించాలనుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వల్లభనేని పవన్ కిషోర్ తెలిపారు.



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్న అధికారులు

కౌన్సిల్ ఎజెండాపై మేయర్ సమీక్ష

కార్పొరేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ ఎజెండాపై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న కౌన్సిల్ సమావేశం జరగనుంది. దానిలో భాగంగా కౌన్సిల్ ఎజెండా, అడిషనల్ ఎజెండాలో ఉన్న ప్రతిపాదనలకు సంబంధించి శాఖాధిపతులతో చర్చించారు.

ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎస్ఈలు పి.సత్యకుమారి, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

కొత్త యూటర్న్ ఏర్పాటు..సర్వత్రా హర్షం

పటమట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బందరు రోడ్డు ఆటోనగర్ గేటు వద్ద నుంచి బెంజిసర్కిల్ మధ్యలో కొత్తగా రెండు యూటర్న్‌లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్ గేటు నుంచి బెంజిసర్కిల్ వెళుతున్నప్పుడు మధ్యలో పోరంకి, పెనమలూరు, ఆటోనగర్ వైపు వెళ్లాలంటే ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో హోటల్ మార్గ్ కృష్ణాయ వద్ద కుడివైపు ఉన్న యూటర్న్ ఒక్కటే మార్గం.

ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా..



బందరు రోడ్డులో ట్రాఫిక్ భారీగా పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం కొత్తగా రెండు చోట్ల యూటర్న్ ఏర్పాటు చేశాం.

-రామారావు, 4వ పట్టణ ట్రాఫిక్ సీఐ



ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో..



హైస్కూల్ రోడ్డు సమీపంలో ..

కిలోమీటర్ పైగా దూరం ప్రయాణం చేసి యూటర్న్ తీసుకునేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్థానికులు పలు సార్లు వారి ఇబ్బందిని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు, ట్రాఫిక్ పోలీసులకు విన్నవించారు. దీర్ఘకాలిక పోరాటం తర్వాత పటమట హైస్కూల్ రోడ్డు సమీపంలో, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కుడి వైపు వెళ్లేందుకు పోలీసులు యూటర్న్ చేశారు. దీంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సెలింగ్

పసికందులకు ఎలాంటి ఘనాహారం?

డాక్టర్! మా బాబుకు ఐదో నెల. ఆరో నెల నుంచి ఘనాహారం మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. బిడ్డకు ఏడాది వయసొచ్చేవరకూ ఎలాంటి ఆహారం అందించాలో వివరించగలరు? - ఓ సోదరి, హైదరాబాద్

ఆరో నెల నుంచి సాధారణంగా అన్నంలో పప్పు, నెయ్యి కలిపి తినిపించడం మొదలు పెడతాం! కానీ వీటి ద్వారా బిడ్డకు అందే పోషకాలు అతి స్వల్పం. కాబట్టి...

- పప్పుధాన్యాలు, అన్ని రకాల కూరగాయలు, పులుపు లేని పళ్లు తినిపించాలి. రుచి కోసం చాలా పరిమితంగా నెయ్యి వాడొచ్చు. లేదంటే ఏదైనా వెజిటబుల్ ఆయిల్ అయినా అన్నంలో కలిపి పెట్టొచ్చు.
- ఉప్పు, తీపి... ఈ రెండూ రుచిని పెంచే మాట నిజమే అయినా, పసికందులకు వీటిని అలవాటు చేయకూడదు. వీటికి బదులుగా రుచి కోసం పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ధనియాల పొడులను వంటకాల్లో కలిపి తినిపిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- తీపి పెట్టాలనుకుంటే తగు మాత్రంగా బెల్లం వాడొచ్చు. నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే బెల్లం లేదా పళ్ల ముక్కలు వేసి తాగించవచ్చు.
- తొమ్మిదో నెల నుంచి గుడ్డు పచ్చసొన తినిపించవచ్చు.
- ఉడికించే ఆహారం మెత్తగా ఉండాలి.
- ప్రతి పూటా అన్నమే తినిపించాలని లేదు. అన్నం బదులు కూరగాయ ముక్కలను తగుపాళ్లలో మసాలాలు జోడించి తినిపించవచ్చు. ఉడికించి, చిదిమిన పళ్ల ముక్కలు తినిపించవచ్చు.




- పెద్దలతో సమానంగా పిల్లలూ మూడు పూటలు తినాలి అనుకుంటే పొరపాటు. ఒకేసారి ఎక్కువ పరిమాణాల్లో పిల్లలు తినలేకపోతే, అదే పరిమాణాన్ని 6 భాగాలుగా వేర్వేరు సమయాల్లో తినిపించవచ్చు.
- సెరెలాక్ లాంటి ప్రత్యామ్నాయ మిల్క్ ఫుడ్స్, ప్రయాణాల్లో, ఇంటి భోజనం వండలేని సమయాల్లో మాత్రమే ఇవ్వాలి. దీన్లో చక్కెర కలపకూడదు.

ఇవి కూడదు...

పిల్లలకు తినిపించకూడని పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటంటే..

- అలర్జీ తలెత్తకుండా ఉండడం కోసం కొత్తగా ఏ రెండు కొత్త పదార్థాలను కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటిగానే రుచి అలవాటు చేయాలి.
- ఈ వయసు పిల్లలకు నట్స్ నుంచి అలర్జీ లాంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి వేరుశనగ, బాదం, జీడిపప్పు లాంటివి పొడి రూపంలో కూడా తినిపించకూడదు.
- సంవత్సరం లోపు పిల్లలకు తేనె, ఉప్పు, చక్కెర తినిపించకపోవడమే మంచిది. తీయదనం కోసం బెల్లం వాడొచ్చు.
- బాస్మతి లాంటి పాలిష్ పట్టిన బియ్యం వాడకూడదు.
- ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు ఇవ్వకూడదు. **- డాక్టర్ సుమతి,** పిడియాట్రిషియన్, హైదరాబాద్

అభిరుచి



అలనాటి అరుదైన నటి సూర్యకాంతం. పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి... మరెవరికీ సాధ్యంకాదన్న రీతిలో అభినయించి... తెలుగు తెరపై తనదైన ముద్ర వేశారు. ఇది దశాబ్దాల కిందటి కథ. మళ్లీ ఇప్పుడు ఆ నట విన్యాసాన్ని అనుకరించి... సూర్యకాంతాన్ని మరిపించి... తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోంది... మంజూష ముక్కవిల్లి. వెండితెరపై నాటి అపురూప సన్నివేశాలను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో పండించి... టాలీవుడ్ తారల ప్రశంసలు సైతం అందుకున్న మంజూషతో 'నవ్య' ముచ్చట్లు.

అచ్చం సూర్యకాంతంలా!

"ఒక అభిరుచి... చిన్నప్పుడే నాలో బలంగా నాటుకుపోయింది. అది మరేదో కాదు... నటించాలన్న తపన. నాకు తెలియకుండానే నాలోని నటుణ్ణి బయటకు తీసే ప్రయత్నం ఎప్పటికప్పుడూ చేస్తూనే ఉన్నాను. బడికి వెళ్లే రోజుల్లో... కాలేజీలో చదివే సమయంలో.. అవకాశం దొరికినప్పుడల్లా అలనాటి మేటి తారల్లా అభినయిస్తూ వస్తున్నాను. నటులే కాదు... ఇంట్లోవాళ్లు, సన్నిహితులను అనుకరించడం కూడా నాకు ఒక అలవాటుగా మారిపోయింది. అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు... ఇలా పెద్దవాళ్ల హావభావాలను సరదాగా నాలో పలికిస్తుండేదాన్ని. దాంతోపాటు పాటలు పాడేదాన్ని. డ్యాన్స్ చేసేదాన్ని. చూసినవాళ్లందరూ బాగా ఆస్వాదించేవారు. అభినందించేవారు. వారి పొగడ్తలు నాకు మరింత ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేవి. అలా మొదలైంది నా ఈ ప్రయాణం. మా ఊరు భద్రాచలం. నేను అక్కడే పుట్టి పెరిగాను. 2010లో హైదరాబాద్‌లో ఎంబీయే పూర్తయింది.

ఉద్యోగం... పెళ్లి...

డిగ్రీ అవ్వగానే ఓ ఆంగ్ల పత్రికలో ఏడాదిన్నర సేల్స్, మార్కెటింగ్ విభాగంలో పని చేశాను. తరువాత ఆరేళ్లు రేడియో సిటీలో ఉద్యోగం. అక్కడ మార్కెటింగ్‌తో పాటు ప్రకటనలకు వాయిస్ ఓవర్ ఇచ్చేదాన్ని. అదే సమయంలో నాకు పెళ్లయింది. మావారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. తన ఉద్యోగ నిమిత్తం ఫ్రాన్స్‌కు వెళ్లాం. కొన్నాళ్లకు తిరిగి భారత్‌కు వచ్చేశాం. ఆయనకు మంచి ఉద్యోగ అవకాశం రావడంతో 2021లో అమెరికాకు పయనమయ్యాం. ప్రస్తుతం ఇక్కడే నివాసం.

అమెరికా వచ్చాక...

మొదటి నుంచీ అందర్నీ అనుకరించడంవల్ల క్రమంగా నా ఆసక్తి నటన వైపు మళ్లింది. అమెరికా వచ్చాక అనిపించింది... ఒక ప్రయత్నం చేద్దామని. ఒకప్పుడంటే సినిమాలు, టీవీలు మినహా వేరే అవకాశాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వల్ల మన ప్రతిభ ప్రపంచానికి చూపడానికి అనువైన ఒక చక్కని వేదిక అందుబాటులో ఉంది కదా. దాని ద్వారా నాలోని నటిని సంతృప్తి పరచాలని అనుకున్నా. చిన్నప్పటి నుంచీ ఇమిటేట్ చేస్తున్నాను కాబట్టి... కంటెంట్ కూడా దానికి సంబంధించే పెట్టాలనుకున్నా. అలా మూడేళ్ల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో నా పేరు మీదనే ఒక చానల్ ప్రారంభించాను.

మధుర జ్ఞాపకాలెన్నో...



ప్రముఖ నటుడు హర్షవర్ధన్ గారు ఒక ఇంటర్వ్యూలో నా గురించి ప్రత్యేకంగా చెప్పారు. సూర్యకాంతంలా బాగా నటిస్తున్నానని. ఆ వీడియో ఎవరో నాకు పంపించారు. చూసి ఆశ్చర్యపోయాను. ఆయనతో నాకు పరిచయం లేదు. ఒక మెసేజ్ కూడా పంపారు... 'ఆ బాడీ లాంగ్వేజ్, ఆ వాయిస్ అనుకరణ అంత సులువు కాదు. కానీ మీరు సూర్యకాంతంలా అతికినట్టు చేస్తున్నారు. నేను మీకు పెద్ద అభిమానిని. మా కుటుంబం అంతా కూర్చొని మీ వీడియోలు చూస్తాం' అని. అలాగే సంగీత దర్శకుడు తమన్ తన ఇన్‌స్టా స్టోరీలో నా వీడియోలు షేర్ చేశారు. చార్మి, అవసరాల శ్రీనివాస్, నందినీరెడ్డి లాంటి పరిశ్రమ ప్రముఖులు అభినందన మెసేజ్‌లు పంపడమే కాదు, వాటిని ఇతర సామాజిక మాధ్యమాల్లో పంచుకొంటున్నారు కూడా. కొంత మంది అసిస్టెంట్ డైరెక్టర్‌లు, సినిమాటోగ్రాఫర్‌లు 'అవకాశం వస్తే సినిమాల్లో నటిస్తారా' అని అడుగుతున్నారు. తప్పకుండా చేస్తానని వారికి చెప్పాను. నా లక్ష్యం కూడా అదే.

నిర్మలమ్మ గారి రీల్‌తో...

చదువుకొనే రోజుల్లో డ్రామా, డ్యాన్స్ ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. కాలేజీలోనే కాదు... బయటి వేదికలపై కూడా. కానీ ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. అన్నీ నాకు నేను చూసి నేర్చుకున్నవే. ఇన్‌స్టాలో చిన్న చిన్న వీడియోలు చేసి పెట్టాను కానీ... వాటికి అంత గుర్తింపు రాలేదు. 'శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్' చిత్రంలో నిర్మలమ్మ గారు నటించిన కోడి సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ బిట్ నేను చేశాను. దానికి మంచి స్పందన వచ్చింది. లక్షల మంది వీక్షించారు. అంతకు మించి షేర్ చేశారు. నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆ ఉత్సాహంతో సూర్యకాంతం గారిని అనుకరించే ధైర్యం చేశా.

'ఏంటి నేను ఇంత లావున్నానా'...

అయితే నాకు బాగా పేరు వచ్చింది మాత్రం సూర్యకాంతం గారి వీడియోతో. రేలంగి గారితో కలిసి ఆమె నటించిన 'ఏంటి నేను ఇంత లావున్నానా' సన్నివేశం ఒకటి ప్రయత్నించాను. ఆ రీల్‌కు ఊహించనంత స్పందన లభించింది. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. నాకు బాగా పేరు వచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ వీడియో పెట్టినా లక్షల్లో వ్యూస్. తరువాత ఛాయాదేవి గారిని అనుకరించాను. వాటికీ విపరీతమైన ఆదరణ లభించింది. వాస్తవానికి ఆ సలహా ఇచ్చింది రఘు కుంచె గారు. 'మీరు ఛాయాదేవి గారి పాత్రలు కూడా ప్రయత్నించండి. బాగా చేస్తారు' అన్నారు. ఆయన చెప్పాకే ఆవిడవి మొదలుపెట్టాను.

ఐదు వందలకు పైనే...

ఇప్పటివరకు నేను ఐదు వందలకు పైగా వీడియోలు చేశాను. ఇన్‌స్టాలో లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధికంగా చూసిన వీడియో సూర్యకాంతం గారిది. దానికి వ్యూస్ రెండు కోట్లు దాటాయి. ఆ తరువాత వరుసలో బ్రహ్మానందం, నిర్మలమ్మ, ఛాయాదేవి గారి వీడియోలు. అన్నీ నా మొబైల్ ఫోన్ తోనే తీస్తాను. ముందుగా సన్నివేశం ఏంటనేది నిర్ణయించుకొని, ఓ అరగంట సాధన చేసి, నటిస్తాను. ఎడిటింగ్ లాంటివన్నీ నేనే చూసుకొంటాను. ఒక్కో వీడియోకు సగటున ఐదు లక్షల వ్యూస్ వస్తాయి. కాస్ట్యూమ్స్ ఇంట్లో ఉన్నవాటితోనే సరిపెడుతుంటా. అవి కుదరకపోతే షాపింగ్ చేస్తాను. కొన్ని భారత్ నుంచి కూడా తెప్పిస్తుంటాను. ఇక్కడ ఒక్కటే చెప్పదలుచుకున్నాను... సామాజిక మాధ్యమాలవల్ల ప్రతికూలతలు, అలాగే అనుకూలతలు కూడా ఉన్నాయి. దాన్ని మనం ఎలా ఉపయోగించుకొంటామనేది ముఖ్యం. ఒకప్పుడు నేరుగా వెళ్లి వేషాలు అడగాలంటే భయపడేదాన్ని. కానీ రీల్స్ వల్ల నాకు ఆ భయం పోయింది. నన్ను నేను ప్రపంచానికి పరిచయం చేసుకోగలిగాను. ఇది నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది. కాస్త గర్వంగానూ అనిపిస్తుంది."

• హనుమా

అదే నా బలం...

నేను చిన్నప్పటి నుంచీ సూర్యకాంతం, నిర్మలమ్మ సినిమాలు ఆసక్తిగా చూసేదాన్ని. దాంతో వాళ్ల నటన మీద కొంత అవగాహన వచ్చింది. ప్రత్యేకించి సూర్యకాంతాన్ని అనుకరించడం చాలా కష్టమనేది చాలామంది చెప్పే మాట. ఆవిడ డైలాగ్ డెలివరీ వేగంగా సాగిపోతుంది. డైలాగ్‌కు డైలాగ్‌కు మధ్య విరామం ఉండదు. నటనలో, మాటలో ఫోర్స్ ఉంటుంది. కానీ ఏదీ తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, ఎంతో సహజంగా అనిపిస్తుంది. ఇంకో ప్రత్యేకత ఏంటంటే.. నిలుచున్న మనిషి నిలుచున్నట్టే, కదలకుండా డైలాగులు చెప్పేస్తారు. అలా మా ఇంట్లో నాయనమ్మలు, అమ్మమ్మలను చూసేదాన్ని. వాళ్లను అనుకరించడంవల్ల ఇప్పుడు నేను ఇంత బాగా చేయగులుగుతున్నాను. కాంచన, భానుమతి, బ్రహ్మానందం, కొవ్వై సరళ, ఆమని, సౌందర్య తదితరులని కూడా అనుకరిస్తుంటాను. ఎవరినైనా చూస్తే వారి హావభావాలను వెంటనే పట్టేయగలను. అదే నా బలం.

చెద పురుగులు పట్టాయా?

కంప్యూటర్ టేబుల్, డైనింగ్ టేబుల్ వద్ద కలరా వుండలు ఉంచితే చెద పురుగులు చేరవు.

మన ఇంట్లో చెక్క అల్మారాలు, మంచాలు, తలుపులకు చెద పురుగులు పడుతూ ఉంటాయి. ఎంతో ఖరీదైన చెక్కను తెచ్చి ఇష్టంగా చేయించుకున్న అరలతో సహా పుస్తకాలు, దుస్తులను కూడా ఇవి పాడుచేస్తుంటాయి. ఒకసారి చేరితే వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. రసాయనాలతో కూడిన స్ప్రేలకు బదులు కొన్ని ఇంటి చిట్కాలు ఉపయోగించి కొంతమేరకు వీటి బెడదను తగ్గించుకోవచ్చు.

- చెద పురుగులను నివారించడంలో కర్పూరం పొడి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇవి ఎక్కువగా చేరే మంచాలు, తలుపులు, కిటికీలు, అరల మూలల్లో సందుల్లో కర్పూరం పొడిని చల్లితే రెండు రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.
- ముదురు వేపాకులను తెచ్చి ఎండబెట్టి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని గది మూలల్లో, అరల్లో, చెక్క సమాన్ల మీద చల్లితే వారం రోజుల్లో చెద పురుగులన్నీ చనిపోతాయి.
- పుస్తకాలు, దుస్తులు భద్రపరచుకునే చెక్క బీరువాల్లో; చెదపురుగులు ఉన్నాయన్న అనుమానం వచ్చిన ప్రదేశాల్లో చిటికెడు నల్ల జీలకర్ర ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- మంచాలు, సోఫాలు, టేబుళ్లు, కుర్చీల మీద కొద్దిగా వెనిగర్ చిలకరిస్తే ప్రయోజనం ఉంటుంది.
- ఇంట్లో ఉండే సామాన్లు, పుస్తకాలను ఎక్కువకాలం ఒకేచోట ఉంచకుండా కనీసం ఆర్నెల్లకోసారి కదిలిస్తూ ప్రదేశాలు మారుస్తూ ఉంటే చెదలు చేరవు.



లీచీ.. ఔషధ గుణాలెన్నో

ఎర్రగా చూడగానే తినేయాలనిపించే లీచీ పండు వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..



- లీచీల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తికి ఊతమిస్తుంది.
- ఈ పళ్లలోని ఫైబర్ అజీర్తి, మలబద్ధకం సమస్యలను దూరం చేస్తుంది.
- లీచీల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి డీహైడ్రేషన్ ముప్పు తప్పుతుంది.
- లిచి పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను ఇది దరిచేరనీయదు.
- లీచీల్లో క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు నియంత్రణకు ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి.
- ఇందులోని విటమిన్ సి, యాంటిఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వంటగది శుభ్రం ఇలా..

అద్దంలా మెరిసే వంటగది అహ్లాదకరంగా ఉంటుంది. వంటగది పరిశుభ్రంగా లేకపోతే క్రిమి కీటకాలు చేరడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వంట చేసేటప్పుడు చికాకుగా అనిపిస్తుంటుంది. కాబట్టి ఇంట్లో దొరికే వస్తువులతో సులువుగా వంటగదిని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం....

- వంట చేసేటప్పుడు వెలువడే పొగ, ఆవిరి వల్ల స్టవ్ వెనక గోడపై అమర్చిన టైల్స్ మీద జిడ్డు చేరుతూ ఉంటుంది. ఒక్కోసారి పసుపు, కారం, మసాలాల మరకలు కూడా పడుతుంటాయి. అలాంటప్పుడు ఒక గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని టైల్స్ మీద రాసి రెండు నిమిషాల తరవాత స్క్రబ్బర్ లేదా స్పాంజ్‌తో రుద్దాలి. తరవాత గోరు వెచ్చని నీళ్లతో కడిగేస్తే టైల్స్ చక్కగా శుభ్రమవుతాయి. వంట పూర్తయిన వెంటనే టిష్యూ పేపర్‌తో టైల్స్‌ని తుడిచేస్తే ఏ సమస్యా ఉండదు.



- వంట చేస్తున్నప్పుడు స్టవ్ కింద, దాని చుట్టూ కూడా ఆహార పదార్థాలు చింది పడుతూ ఉంటాయి. వంట పూర్తయిన తరవాత వీటిని పలుచని గుడ్డతో శుభ్రంగా తుడవాలి. రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల వెనిగర్ లేదా లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గట్టు మీద చల్లి పది నిమిషాలు ఉంచాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగేస్తే గట్టు పూర్తిగా శుభ్రపడుతుంది. ఇదేవిధంగా స్టవ్‌ని కూడా శుభ్రం చేయవచ్చు.
- వంటగదిలో ఉండే ట్యూబ్‌లైట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, స్విచ్ బోర్డులతోపాటు కిటికీ ఊచలు, తలుపులు కూడా జిడ్డు పట్టి దుమ్ము, ధూళితో నిండుతుంటాయి. అలాంటప్పుడు సర్ఫ్ లేదా లిక్విడ్ సోప్ కలిపిన నీళ్లలో ముంచి గట్టిగా పిండిన స్పాంజ్‌తో వీటిని తుడిచేస్తే సరిపోతుంది.
- అటకమీద, అరల్లో తరచూ బూజు పడుతూ ఉంటుంది. దీన్ని మెత్తని చీపురు లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. అరల మూలల్లో కర్పూరం బిళ్లలు, లవంగాలు, వేపాకుల్లో ఒకటి ఉంచితే బొద్దింకలు చేరవు.
- వంటగదిలో నేలను ప్రతిరోజూ ఉప్పునీటితో తుడవాలి. పాత్రలు కడిగే సింక్‌లో కొన్ని వేడి నీళ్లు పోసి బ్రష్‌తో రుద్ది శుభ్రం చేయాలి.

స్ఫూర్తి



డైవింగ్ సంచలనం

ఎలాంటి పరికరాలు లేకుండా ఊపిరి బిగపట్టి లోతైన నీళ్లలోకి డైవ్ చేయడమే ఫ్రీ డైవింగ్. ఎంతో కష్టమైన, క్లిష్టమైన ఈ క్రీడలో పైచేయి సాధించడమే కాకుండా, ఏకంగా తొమ్మిది జాతీయ రికార్డులను నెలకొల్పారు చెన్నైకి చెందిన 32 ఏళ్ల అర్చన శంకర నారాయణన్. ఈ మహిళా డైవర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.

ఆరేళ్ల కిందట... కొత్త సంవత్సర వేడుకల కోసం అండమాన్‌కు వెళ్లినప్పుడు, అర్చనకు మొదటిసారిగా డైవింగ్ చేసే అవకాశం దొరికింది. అలా జీవితంలో మొదటిసారిగా స్కూబా డైవింగ్ చేశారామె. ఆ అనుభవం గురించి వివరిస్తూ... "నాకా అనుభవం ఎంతో బాగా నచ్చింది. నీటి అడుగున దాగి ఉండే అద్భుతమైన ప్రపంచాన్ని నేనప్పుడు మొదటిసారిగా చూడగలిగాను. సముద్రంతో తక్షణ అనుబంధం ఏర్పడిపోయిన భావనకు లోనయ్యాను. నీటి ప్రపంచంలో నెలకొని ఉండే ప్రశాంతత, నిశ్శబ్దం నన్నెంతో అబ్బురపరిచాయి. అలా మొదటి అనుభవంతోనే డైవింగ్‌కు ఎంతో దగ్గరైపోయాను. నా భవిష్యత్తు డైవింగ్‌తో ముడిపడి ఉందని అనిపించింది. కానీ అప్పటికే న్యాయవాద వృత్తిలో ఉన్నాను. కాబట్టి డైవింగ్ పట్ల ఏర్పడిన మక్కువను నా తల్లితండ్రులు అర్థం చేసుకోలేకపోయారు. అది ప్రాణాంతకమైన క్రీడ కాబట్టి వాళ్లు బాగా భయపడిపోయారు. మాది సంప్రదాయ తమిళ కుటుంబం. న్యాయవాద వృత్తిని వదిలేసి, ప్రాణాంతకమైన డైవింగ్‌లో కొనసాగాలనే నా కోరికను మొదట్లో వ్యతిరేకించిన తల్లితండ్రులు చివరకు అర్థం చేసుకుని ప్రోత్సహించారు. ఇప్పుడు నన్ను చూసి గర్వపడుతున్నారు" అంటూ తన డైవింగ్ ప్రయాణాన్ని వివరిస్తున్నారు అర్చన.

ఫ్రీడైవింగ్... అంత సులువు కాదు

నీళ్ల అడుగుకి డైవ్ చేయడం, సులభతరమైన క్రీడలాగే అనిపించవచ్చు. కానీ నీళ్లలో లోతుకు ప్రయాణించేకొద్దీ నీటి ఒత్తిడి పెరిగిపోతుంది. ఆక్సిజన్ మోతాదులు తగ్గిపోతాయి. దాంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందక స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పెరిగి, అవి కుంచించుకుపోతాయి. నీటి ఒత్తిడిలో చోటుచేసుకునే మార్పుల వల్ల కళ్లు, చెవులు, సైనస్‌లు, ఊపిరితిత్తులకు గాయలయ్యే అవకాశాలుంటాయి. లోతుకు చేరుకున్న తర్వాత అంతే వేగంగా నీళ్ల పైకి చేరుకునే వీలుండదు. అలా లోతు నుంచి వేగంగా నీటి పైకి ప్రయాణిస్తే, రక్తంలో నైట్రోజన్ బుడగలు ఏర్పడి, డీకంప్రెషన్ సిక్‌నెస్‌కు గురవుతారు.

లోతులన్నీ నెగ్గి...

అర్చన తాజాగా ఫిలిప్పైన్స్‌లో జరిగిన రెండు ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఆరు కొత్త జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఈ చెన్నై యువతి, రెండు అంతర్జాతీయ పోటీల్లో ఆరు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు, 35 మీటర్ల జాతీయ రికార్డును నెలకొల్పి, 42 మీటర్ల ఫ్రీడైవింగ్ తో స్వీయ వ్యక్తిగత ప్రతిభను కనబరచడం విశేషం. ఇలా ఏడాది వ్యవధిలో తొమ్మిది రికార్డులను నెలకొల్పిన తొలి భారతీయ మహిళా ఫ్రీడైవర్‌గా చరిత్ర సృష్టించారు. ఫ్రీడైవింగ్ ఊపిరిని బిగపట్టే క్రీడ. ఈ క్రీడలో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి శ్వాస పరికరాలు లేకుండా, నీటి అడుగున వీలైనంత లోతుకు ఫ్రీడైవింగ్ చేస్తూ ఉంటారు. అర్చన, గత నెలలో ఫిలిప్పైన్స్‌లోని మబినిలో జరిగిన ఎబిడిఎ మబిని డెప్త్ క్వెస్ట్‌లో పాల్గొని, తన రికార్డును బద్దలు కొట్టడంతో పాటు నాలుగు జాతీయ రికార్డులతో తన అసమానమైన ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ఫిలిప్పీన్స్ పాంగ్లోలో జరిగిన హగ్ కప్ పోటీల్లో, మరొక సొంత రికార్డుతో పాటు, రెండు జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఇలా ఇప్పటివరకూ అర్చన, కాన్‌స్టెంట్ వెయిట్, కాన్‌స్టెంట్ వెయిట్ బై ఫిన్స్, కాన్‌స్టెంట్ వెయిట్ నో ఫిన్స్, ఫ్రీ ఇమ్మర్షన్... ఇలా ఈ క్రీడలోని నాలుగు డెప్త్ విభాగాల్లో జాతీయ రికార్డులను సాధించి భారత దేశ సత్తాను చాటారు.

మక్కువతో మథించి...

ఆ ప్రయాణంలో భాగంగా మొదట బహిరంగ జలాల స్కూబా అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్‌ను పొంది, రెస్క్యూ డైవర్‌గా మారారు. ఆ తర్వాత, ఎటువంటి ఆక్సిజన్ ఆసరా లేకుండా ఫ్రీడైవింగ్ చేసే భారత దేశానికి చెందిన శుభమ్ పాండే వీడియోలు చూసి అతని నుంచి ఎంతో ప్రేరణ పొందారు. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ.. "నన్నీ క్రీడ విపరీతంగా ఆకర్షించింది. కేవలం రెస్క్యూ డైవర్‌గా స్థిరపడిపోకుండా, ఈ క్రీడలో మరింత పరిణతి సాధించాలని అనుకున్నాను. శుభమ్ వీడియోలు చూసిన తర్వాత, అతని దగ్గర శిక్షణ పొందాలని అనిపించింది. దాంతో బాలి వెళ్లి, భారతీయ అగ్ర ఫ్రీడైవింగ్ శిక్షకుల్లో ఒకడైన శుభమ్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత, ఆసియాలోని సుప్రసిద్ధ ఫ్రీడైవింగ్ స్కూల్, అప్నియా బాలిలో కూడా శిక్షణ పొందాను" అంటూ చెప్పుకొచ్చారు అర్చన. శిక్షణలో భాగంగా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం విజువలైజేషన్, బ్రెత్‌వర్క్, ధ్యానం... సాధన చేశారామె. డయాఫ్రమ్ బ్రీదింగ్ లాంటి శ్వాస నైపుణ్యాలను సాధన చేయడం ద్వారా డైవింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, మహాసముద్రంలో ఆత్మవిశ్వాసంతో డైవింగ్ చేయగలిగే సామర్థ్యం కూడా పెరిగిందని అంటున్నారామె. అలాగే థాయిల్యాండ్‌లోని కొ టావోలో క్రైజెన్ ఫ్రీడైవింగ్‌లో కూడా అర్చన శిక్షణ తీసుకున్నారు. ఫ్రీడైవింగ్ ప్రపంచ రికార్డులు, 100 మీటర్లను అధిగమించాయి కాబట్టి భారతదేశ డైవర్లు ఈ క్రీడలో పైచేయి సాధించడానికి కఠోర శిక్షణ పొందడం అవసరమని గ్రహించిన అర్చన, ప్రస్తుతం తన శిక్షణ తీవ్రతను పెంచారు. "ఆగష్టు 1 నుంచి 3 వరకు, ఇండోనేషియాలోని, నార్త్ సులవేసిలో జరగబోయే మనాడొ డెప్త్ కాంపిటీషన్‌లో నెగ్గడం కోసం, శుభమ్ పాండేతో కలిసి ఇండోనేషియాలోని అమెద్‌లో శిక్షణ తీసుకుంటున్నాను" అంటూ చెప్పుకొస్తున్నారు.



స్వర్ణ కవచాలతో మాడవీధుల్లో విహరిస్తున్న ఉత్సవర్లు

తిరుమలలో ముగిసిన జ్యేష్ఠాభిషేకం

మరోసారి స్వర్ణ కవచంతో మలయప్ప దర్శనం

తిరుమల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన జ్యేష్ఠాభిషేకం బుధవారం ముగిసింది. విగ్రహాల పరిరక్షణ కోసం టీటీడీ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తొలిరోజు వజ్ర కవచం, రెండో రోజు ముత్యపు కవచంలో దర్శనమిచ్చిన మలయప్పస్వామి చివరి రోజు ఉభయ దేవేరులతో కలిసి తిరిగి బంగారు కవచాన్ని ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్ఠాభిషేకం వరకు ఏడాది పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంలోనే ఉంటారు. ముందుగా ఉదయం మలయప్పస్వామి, అమ్మవార్లను శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. అక్కడ అర్చకులు, వేదపారాయణదారులు మహాశాంతి హోమం నిర్వహించారు. తర్వాత ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, స్వర్ణకవచాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి ధగధగమెరిసే స్వర్ణ కవచ సమర్పణ చేశారు. అనంతరం ఉత్సవర్లు సహస్రదీపాలంకారసేవలో పాల్గొని భక్తులకు దర్శనమిచ్చారు. సేవ పూర్తికాగానే నాలుగు మాడవీధుల్లో వేంచేపుగా ఆలయానికి చేరుకున్నారు.

జూలై 6 నుంచి నెల్లూరులో రొట్టెల పండుగ

నెల్లూరు (సిటీ), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా, రాష్ట్ర పండుగగా నెల్లూరులో ఏటా జరిగే బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ జూలై 6వ తేదీన ప్రారంభం కానుంది. ఐదు రోజులపాటు జరిగే ఈ వేడుకను విజయవంతంగా పూర్తి చేసేందుకు బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్ అధికారులతో సమీక్షించారు.

అరసెంటు స్థలంలో మూడు అంతస్థుల భవనమా?

- కూల్చేయాలని అధికారులకు రఘురామ ఆదేశం

పాలకోడేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులోని మంగయ్య చెరువు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అర సెంటు స్థలంలో నిర్మిస్తున్న భవనాన్ని కూల్చేయాలని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం పాలకోడేరులో సీసీ రోడ్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన పక్కనే నిర్మిస్తున్న భవనాన్ని చూసి అధికారులను ప్రశ్నించారు.



పాలకోడేరులో అక్రమంగా నిర్మించిన భవనం

6న ఏపీఎన్‌సెట్

- 20 వరకు దరఖాస్తులకు గడువు

బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల కోర్సుల్లో అడ్మిషన్లకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఏపీఎన్‌సెట్ జూలై ఆరో తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి పి.చంద్రశేఖర్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను రిజిస్ట్రార్ రాధికారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీనివాసరావుతో కలిసి విజయవాడలో బుధవారం విలేకరులకు తెలిపారు. ఏపీఎన్‌సెట్ దరఖాస్తుల స్వీకరణకు తుది గడువును ఈ నెల 20గా నిర్ణయించారు.

ఎంటీఎస్ టీచర్ల సేవలు కొనసాగింపు

మినిమం టైమ్ స్కేల్ ప్రాతిపదికన పనిచేస్తున్న 1998, 2008 డీఎస్సీ టీచర్ల సేవలను కొనసాగిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు వారిని రెన్యువల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంటీఎస్ టీచర్లు గురువారం సంబంధిత ఎంఈవోల వద్ద రిపోర్టు చేయాలని సూచించారు.

నేటి నుంచే బడులు

- పాఠశాలల పునఃప్రారంభానికి మోగిన గంట
- విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ నేటి నుంచే
- 233 రోజులు బడి... 83 సెలవులు
- గణితానికి అత్యధికంగా 40 పీరియడ్లు
- ప్రతి శనివారం నో బ్యాగ్ డే
- అన్ని పరీక్షలూ రాసేది ఒక్క పుస్తకంలోనే
- మార్చి 16 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- 2025-26 అకడమిక్ క్యాలెండర్ విడుదల



అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బడికి వేళయింది. గురువారం నుంచి బడి గంట మోగనుంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 35 లక్షల మంది విద్యార్థులకు నేటి నుంచే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించనుంది. కిట్‌లో బ్యాగు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టు, డిక్షనరీ ఉంటాయి. అలాగే పాఠశాలల్లో నేటి నుంచి సంసిద్ధత కార్యక్రమాలు చేపడతారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తారు. ఇక, ఈ విద్యా సంవత్సరంలో 233 రోజులు బడులు నిర్వహిస్తారు. 83 రోజులు వివిధ రూపాల్లో సెలవులు ఉంటాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ 2025-26 విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసింది. ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకు వేర్వేరుగా క్యాలెండర్లు రూపొందించింది. సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 10 వరకు దసరా సెలవులు, జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి. సబ్జెక్టుల వెయిటేజీని పరిశీలిస్తే గణితం సబ్జెక్టుకు అత్యధికంగా 40 పీరియడ్లు కేటాయించారు. తెలుగుకు 30, హిందీకి 25, ఇంగ్లీష్‌కు 30, బయాలజీకి 30, ఫిజిక్స్‌కు 18, సోషల్‌కు 30 పీరియడ్లు కేటాయించారు.

- నవంబరు 10 నుంచి 19 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు, ఏప్రిల్ 6 నుంచి 15 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు జరుగుతాయి.
- పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రాథమిక తేదీలను ఈసారి ముందుగానే ప్రకటించారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగేలా షెడ్యూలు రూపొందించారు. మార్చి 2 నుంచి 12 వరకు టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తారు. అలాగే పబ్లిక్ పరీక్షలకు ముందు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తారు.
- ఐదు నుంచి ఆరో తరగతికి వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా 40 రోజుల సంసిద్ధత కార్యక్రమం నిర్వహిస్తారు. టీచర్- విద్యార్థి మధ్య ఇంటరాక్షన్, వకాబులరీ బిల్డింగ్ లాంటి కార్యక్రమాలు ఇందులో ఉంటాయి. ఆరో తరగతి సాధారణ సిలబస్‌తో పాటు ఇది కొనసాగుతుంది.
- 6-10 తరగతుల విద్యార్థులకు రాజ్యాంగం పుస్తకం కూడా ఇస్తారు. షెడ్యూలు ప్రకారం ప్రతినెలా అందులోని అంశాలపై బోధన కొనసాగుతుంది.
- 8, 9, 10 తరగతుల విద్యార్థులను ఎంపిక చేసి అమరావతిలోని అసెంబ్లీలో స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహిస్తారు. విద్యార్థుల్లో రాజకీయ అక్షరాస్యతను పెంచడం దీని లక్ష్యం. క్షేత్రస్థాయిలో క్విజ్‌లు నిర్వహించి ఫైనల్‌గా రాష్ట్రస్థాయి అసెంబ్లీకి విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- జూన్ 25, నవంబరు 25న మెగా పేరెంట్- టీచర్స్ సమావేశాలు నిర్వహిస్తారు. మరో ఐదు సాధారణ పేరెంట్- టీచర్ సమావేశాలు నిర్వహిస్తారు.
- గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా భాషా పండుగ నిర్వహిస్తారు. ఆగస్టు 28 నుంచి 30 వరకు ఈ కార్యక్రమం చేపడతారు.
- గురజాడ అప్పారావు, గుర్రం జాషువాల జయంతుల సందర్భంగా సెప్టెంబరు 21 నుంచి 29 వరకు తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహిస్తారు.
- 6- 9 తరగతుల విద్యార్థులకు ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ఉంటుంది. ఆ రోజుల్లో విద్యార్థులకు స్కిల్ టెస్ట్, క్లబ్ కార్యకలాపాలు, స్పోకెన్ ఇంగ్లీష్, వృత్తి విద్య, మాక్ పార్లమెంట్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా విద్యార్థులకు అసెస్‌మెంట్ బుక్‌లెట్ అందిచబోతున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు అన్ని పరీక్షలూ రాయాలి. టీచర్లు అందులోనే మార్కులూ వేస్తారు. దానివల్ల టీచర్లు, తల్లిదండ్రులు... విద్యార్థుల ప్రగతి ఎలా ఉంది అనేది ఆ పుస్తకంలో చూసి తెలుసుకోవచ్చు. ఒక్కో సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ ఉంటుంది.
- 1-5 తరగతుల ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు, గణితంకు అత్యధికంగా 44 చొప్పున పీరియడ్లు కేటాయించారు. ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ఉంటుంది. గూగుల్ రీడ్ యాప్ ద్వారా ఇంగ్లీష్ వినడం, మాట్లాడటం నేర్పిస్తారు. వీరికి కూడా స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్‌లెట్ ఇస్తారు. విద్యార్థులు అన్ని పరీక్షలు అందులోనే రాయాలి.

యోగాంధ్రకు 2.04 కోట్ల మంది పేర్లు నమోదు

- లక్ష్యాలను పది రోజులు ముందుగానే దాటేశాం
- నేడు రాష్ట్ర పునర్నిర్మాణ సంకల్ప దినం: మంత్రి సత్యకుమార్

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో యోగాభ్యాసం పట్ల అవగాహనను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నెల రోజుల యోగాంధ్ర కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను పది రోజులు ముందుగానే దాటేశామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వరకూ 2,04,64,831 మంది యోగాభిమానులు పేర్లు నమోదు చేసుకున్నారని, యోగా శిక్షకుల నమోదు, వారి శిక్షణ, యోగా పోటీల నిర్వహణ, స్థలాల ఎంపిక కూడా పూర్తయిందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న విశాఖలో జరిగే ప్రధాన కార్యక్రమంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా లక్షకుపైగా ఎంపిక చేసిన కేంద్రాల్లో రెండు కోట్ల మంది యోగాభిలాషులు పాల్గొనే దిశగా లక్ష్యాన్ని నిర్దేశించామని తెలిపారు. కాగా, జూన్ 12ను రాష్ట్ర పునర్నిర్మాణ సంకల్ప దినంగా మంత్రి సత్యకుమార్ మరో ప్రకటనలో అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ఈ ప్రకటన విడుదల చేశారు.

ఉపాధి నిధులు 1,280 కోట్ల విడుదలకు అనుమతి

గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి మెటీరియల్ కాంపోనెంట్ కోసం కేంద్ర సహాయం మొదటి విడతలో అదనపు నిధులుగా రూ.1,280.20 కోట్లు విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతినిచ్చింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యక్తిగత మరుగుదొడ్లకు రూ.8,333 అదనపు సాయం

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పట్టణాల్లో నిర్మించే వ్యక్తిగత మరుగుదొడ్లకు పట్టణ స్థానిక సంస్థల నుంచి రూ.8,333 అదనపు సాయం అందించనున్నారు. ఒక్కో యూనిట్ విలువ రూ.15,000 కాగా.. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.4 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.2,667, పట్టణ స్థానిక సంస్థల నుంచి రూ.8,333 చొప్పున లబ్ధిదారులకు మంజూరు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కె.సుమన్

విజయవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో బుధవారం జరిగిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కె.సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో 15 మందితో కూడిన నూతన కమిటీని ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఇ.మధుబాబు, సహాధ్యక్షుడిగా పి.శివసైదారావు, కోశాధికారిగా సి.హెచ్.రమణమూర్తి ఎన్నికయ్యారు.

ఎస్వీ గోసంరక్షణశాలకు మరో డైరెక్టర్

- అనుభవజ్ఞుడిని నియమించేందుకు టీటీడీ నిర్ణయం

తిరుమల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎస్వీ గోసంరక్షణశాలపై వచ్చిన విమర్శలకు చెక్ పెట్టడంతో పాటు భవిష్యత్తులో మరింత మెరుగైన గోసంరక్షణ కోసం మరో డైరెక్టర్‌ను నియమించాలని టీటీడీ నిర్ణయించింది. టీటీడీ గోశాలలో మూడు నెలల్లో వందకు పైగా గోవులు అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాయంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆరోపించడం కలకలం రేపిన విషయం తెలిసిందే. గోవులు అసాధారణంగా చనిపోయాయంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, కేవలం వయస్సు పైబడినవి కొన్ని, అనారోగ్యంతో మరికొన్ని మాత్రమే చనిపోయాయంటూ టీటీడీ కూడా గోవుల మరణాలపై స్పష్టత ఇచ్చింది. ఆ తర్వాత ఇదే అంశం రాజకీయ రంగు పులుముకుని సవాళ్లు విసురుకునే స్థాయికి చేరింది. అసలు గోశాలలో ఏం జరుగుతోందనే అంశంపై టీటీడీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించడంతో గత ప్రభుత్వంలో జరిగిన అనేక అవినీతి అక్రమాలు విజిలెన్స్ నివేదికల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో గోశాలలో మెరుగైన గోసంరక్షణ కోసం టీటీడీ చర్యలకు పూనుకుంది. గోశాలలో రోజువారీ కార్యకలాపాలతో పాటు ప్రధానంగా గోవుల మరణాలను తగ్గించడానికి, సంరక్షణ, మేత, పలమనేరు, కమలయ్యగారిపల్లెలోని గోశాలల నిర్వహణ, నవనీతం వంటి వాటితో పాటు అగరుబత్తీల తయారీ, ఫీడ్ ప్లాంట్ నిర్వహణ, మినీ నెయ్యి ప్లాంట్, ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ(పిండ మార్పిడి) కార్యక్రమాలను డైరెక్టర్ స్థాయి అధికారి స్వయంగా పర్యవేక్షించాల్సిన అవసరముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకోసం పశుసంవర్ధక శాఖలో అనుభవం కలిగిన అధికారిని మరో డైరెక్టర్‌గా నియమించాలని టీటీడీ నిర్ణయించింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు నక్సల్స్ ఎన్‌కౌంటర్

చర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు నక్సలైట్లు మృతిచెందారు. వీరిలో ఓ మహిళా నక్సలైట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రెండ్రోజుల క్రితం కుంట సమీపంలో మావోయిస్టులు పేల్చిన మందుపాతరకు అదనపు ఎస్పీ ఆకాశ్‌రాయ్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బలగాలు అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువైపులా కాల్పులు జరిగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయాక.. బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ఇద్దరు నక్సలైట్ల మృతదేహాలు, ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక 12-బోర్ తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడో, రేపో నైరుతిలో కదలిక..!

- బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- అల్పపీడనంగా మారే అవకాశం
- కోస్తా, రాయలసీమకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు వారాల విరామం తర్వాత నైరుతి రుతుపవనాల్లో కదలిక రానుంది. గత నెల 29వ తేదీ తర్వాత నిలిచిపోయిన నైరుతి రుతుపవనాలు ఒకటి, రెండు రోజుల్లో మళ్లీ పురోగమించే వాతావరణం నెలకొంది. రుతుపవనాలు నిలిచిపోవడంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగుతోంది. ప్రధానంగా ఉత్తరాదిలో తీవ్రమైన వడగాడ్పులతో ప్రజలు ఉడికిపోతున్నారు. అయితే హిందూ మహాసముద్రం నుంచి తేమగాలులు దక్షిణ భారతం వైపు వస్తున్నాయి. దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రెండు, మూడు రోజుల్లో కర్ణాటక, కొంకణ్, గోవా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. తమిళనాడు, తెలంగాణ, ఏపీల్లో వర్షాలు పెరగనున్నాయి. దీనికి బలం చేకూరేలా ఉత్తరాంధ్రకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీంతో గురువారం నుంచి ఈ నెల 15వ తేదీ మధ్య రుతుపవనాలు ఉత్తర దిశగా పురోగమించేందుకు అవకాశాలున్నాయని వాతావరణ నిపుణుల అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగానే రుతుపవనాలు ఈ నెల 14 నుంచి మధ్య, తూర్పుభారతం వైపు పయనిస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం రాయలసీమ, కోస్తాల్లో వర్షాలు కురిశాయి.

మధ్య, తూర్పుభారతంలో వర్షాలు పెరుగుతాయి


ప్రస్తుతం నైరుతి రుతుపవనాల్లో కదలిక రావడంతో మధ్య, తూర్పు భారతం వరకు అనేక ప్రాంతాల్లో వర్షాలు పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే నైరుతి రుతుపవనాలు మధ్య, తూర్పు భారతం దాటి ఉత్తరాదిలోకి ప్రవేశించేంత వరకు రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, హరియాణా, యూపీ, పరిసర ప్రాంతాల్లో ఎండలు, గాడ్పులు కొనసాగుతాయని హెచ్చరించారు. దీంతో రాత్రి కూడా వేడి వాతావరణం నెలకొంటుందని, ఇది పంటలపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

నేడు అక్కడక్కడా భారీ వర్షాలు

ఉపరితల ద్రోణి ప్రభావంతో ఏపీలో మరో రెండ్రోజులు అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. గురువారం మన్యం, అల్లూరి, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరుగా, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం మన్యం, అల్లూరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీగా, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం రాత్రి 7 గంటల వరకు మన్యం జిల్లా రస్తాకుంటుబాయిలో 72, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో 65.2, కోనసీమ జిల్లా తాతపూడిలో 47, ప్రకాశం జిల్లా కొలుకులలో 44.7 మిల్లీమీటర్ల వాన పడింది.

పాదాల మండపం పరిరక్షణకు చర్యలు

- పరిశీలించిన ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా బృందం



పాదాల మండపాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ అధికారులు, ట్రస్టు సభ్యులు

తిరుమల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అలిపిరిలోని అతి ప్రాచీనమైన పాదాల మండపం పరిరక్షణకు అడుగులు పడుతున్నాయి. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) అధికారులు బుధవారం మండపాన్ని పరిశీలించారు. దాదాపు 500 ఏళ్ల క్రితం నిర్మితమై శిథిలావస్థకు చేరుకున్న ఈ కట్టడాన్ని తిరుమలలోని పార్వేట మండపం తరహాలో తొలగిస్తారంటూ వైసీపీ ప్రభుత్వంలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో దీనిపై బీజేపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. ఆర్కియాలజీ విభాగం ఆధ్వర్యంలోనే మండపాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం పాదాల మండపం పరిరక్షణకు చర్యలు చేపట్టింది. ఆర్కియాలజీ అధికారి మునిరత్నంరెడ్డి సహకారంతో ఆ విభాగాన్ని సంప్రదించింది. ఈ నేపథ్యంలోనే ఏఎస్ఐ రిటైర్డ్ డైరెక్టర్ జమ్వాల్(పూణే), ఇంజనీరింగ్ అధికారులు, విశాల్ బృందం, 'లార్డ్ వెంకటేశ్వర రిలీజియస్ అండ్ ఛారిటబుల్ ట్రస్టు(పూణే) దాతలతో కలిసి బుధవారం మండపాన్ని పరిశీలించారు. ప్రాచీన పద్ధతుల్లోనే కట్టడాన్ని పరిరక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు.

బీజేపీని ఎదిరించే సత్తా కాంగ్రెస్‌కే

- ప్రధానికి దత్తపుత్రుడిగా జగన్ వ్యవహరించారు: షర్మిల

కర్నూలు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బీజేపీని ఎదిరించే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం కర్నూలులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీ అంబానీ, అదానీలకు సంపదను దోచిపెట్టారని ఆరోపించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ మోదీకి దత్తపుత్రుడిగా వ్యవహరించారని విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబు సీఎం గా ఉన్న కూటమి ప్రభుత్వం కూడా అదే బాటలో పని చేస్తోందన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో చేసింది శూన్యమన్నారు. సూపర్ సిక్స్ సూపర్ ఫెయిల్ అయిందన్నారు.

ఉత్సాహంగా ఏరువాక

అధికారికంగా నిర్వహించిన వ్యవసాయ శాఖ.. 20న అన్నదాత సుఖీభవ నిధుల విడుదల: మంత్రి అచ్చెన్న



ఏరువాక పౌర్ణమి ప్రారంభించి విత్తనాలు చల్లుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, పెదవేగి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తొలకరి చినుకులు రాలిన వేళ.. రైతు పండుగ 'ఏరువాక' ఉత్సవం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగింది. ఏటా జూన్ నెలలో వచ్చే పౌర్ణమినాడు జరుపుకునే ఏరువాక ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది అధికారికంగా నిర్వహించింది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఏలూరు జిల్లా పెదవేగి మండలం వంగూరులో బుధవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి నాగలితో పొలం దున్ని ఏరువాక పౌర్ణమిని ప్రారంభించారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో ఏరువాక ఉత్సవాన్ని ప్రారంభించారు. నవధాన్యాలు పొలంలో చల్లి, ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి, దండిగా దిగుబడులతో రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయంలో రైతులకు అండగా నిలవడమే లక్ష్యంగా అన్నదాత సుఖీభవ పథకంలో ఈ నెల 20న అన్నదాత సుఖీభవ పథకం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావు, కమిషన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. వివిధ నియోజకవర్గాల్లో జరిగిన ఏరువాక కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావు రైతులకు వివరించారు.

హైదరాబాద్ కేపీహెచ్‌బీలో గజం రూ.2.98 లక్షలు

» హౌసింగ్ బోర్డు ప్లాట్ల వేలంలో అత్యధిక ధర

హైదరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో గృహ నిర్మాణ మండలి పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్ల వేలంలో.. ఒక కమర్షియల్ ప్లాట్ ధర గజం రూ.2.98 లక్షలు పలికింది. చదరపు గజం ధర ఇంత భారీగా పలకడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారని తెలంగాణ గృహ నిర్మాణ మండలి ఎండీ ఐఏఎస్ వి.పి.గౌతమ్ తెలిపారు. హౌసింగ్ బోర్డు పరిధిలో కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-7లో ఖాళీగా ఉన్న 18 స్థలాలకు బుధవారం కేపీహెచ్‌బీ ఫంక్షన్ హాల్‌లో వేలం నిర్వహించారు. వీటిలో నాలుగు నివాస స్థలాలు కాగా.. 13 వాణిజ్య కేటగిరీ, కైతలాపూర్‌లో ఉన్న బిట్టుతో కలిపి మొత్తం 18 స్థలాలు. వేలంలో ఇవన్నీ.. అధికారుల అంచనాలకు మించి హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి. వీటిలో 22వ నంబరు ప్లాట్‌కు (151 చదరపు గజాలు, కమర్షియల్) చదరపు గజానికి రూ.2.98 లక్షల చొప్పున చెల్లించి కొనుగోలు చేశారు. కాగా.. కేపీహెచ్‌బీ ఏడోఫేజ్ ఆవిర్భావ సమయం 2000లో గజం రూ.1818కే రిజిస్ట్రేషన్ చేశారు. అప్పట్లో ఇక్కడ జాగా తీసుకున్న నివాసితులు.. తాజా వేలంలో గజం ఏకంగా రూ.2.5 లక్షల దాకా పలకడంతో 'వామ్మో' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పీఎస్ఆర్‌కు మధ్యంతర బెయిల్



విజయవాడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న పీఎస్ఆర్ ఆంజనేయులుకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. విజయవాడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 14 రోజులు బెయిల్ మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయాసం, గుండెలో నొప్పికి మంగళవారం నుంచి పీఎస్ఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అంతకుముందు ఆయన మధ్యంతర బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని కొట్టేసిన హైకోర్టు ఈ అంశాన్ని కింది కోర్టులో తేల్చుకోవాలని ఆదేశించింది. దీనితో ఆయన తరపున న్యాయవాది విష్ణువర్ధన్ విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం వాదనల అనంతరం న్యాయాధికారి దేవిక తీర్పు వెలువరించారు. మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ.. ఈనెల 26వ తేదీ సాయంత్రం ఆరు గంటలలోపు జైలుకు చేరుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. ఇద్దరు వ్యక్తులు చెరో రూ.లక్ష పూచికత్తు ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

రాష్ట్రంలో మరో మూడు కరోనా కేసులు

నెల్లూరు (వైద్యం), నిమ్మనపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లాలో బుధవారం రెండు కేసులు వెలుగుచూడగా.. అన్నమయ్య జిల్లాలో ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. నెల్లూరు నగరానికి చెందిన ఇద్దరు యువతులు కరోనా బారినపడినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయింది. దీంతో నెల్లూరు జిల్లాలో కొవిడ్ కేసుల సంఖ్య 11కు చేరినట్టయింది. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలం వెంకోజీగారిపల్లికి చెందిన మహిళకు కరోనా పాజిటివ్ వచ్చింది. రెండు వారాలుగా దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న ఆమెకు వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా పరీక్షలు నిర్వహించారు. పాజిటివ్ రావడంతో స్థానిక వైద్య సిబ్బంది ఆమెను హోం ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

ఐఎస్‌డబ్ల్యూ సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ పెంపు

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏపీ నిఘా విభాగంలో అంతర్భాగమైన ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ) సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ రూ.11వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిం ది. ఏపీ పోలీసుశాఖలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు ఇప్పటికే రూ.11 వేలు అందుతుండగా ఐఎస్‌డబ్ల్యూ(వీఐపీల రక్షణ) సిబ్బందికి ప్రభుత్వం 8,750 మాత్రమే చెల్లిస్తోంది. నిఘా విభాగాధిపతి ప్రతిపాదనతో అలవెన్సు పెంచుతూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులిచ్చారు.

అసైన్డ్‌పై మూడో 'సారీ'

ఉసూరుమనిపించిన ఉపసంఘం.. తాజా భేటీలోనూ ఏ నిర్ణయమూ లేదు

» కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్ణయాలపైనే చర్చ
» ఈ మాత్రం దానికి ఉపసంఘం ఎందుకో?
» నాలా చట్టం రద్దు అంటూ హడావుడి
» ఇలాగైతే భూ సమస్యలు తీరేదెన్నడు?
» ఫ్రీ హోల్డ్‌పై రైతుల్లో తీవ్ర ఆందోళన
» సర్కారు నిషేధం విధించి 10 నెలలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం మూడో సమావేశం ముచ్చటగానే ముగిసింది. గత పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న అసైన్డ్ భూముల సమస్యకు ఈ సమావేశంలో అయినా మంత్రుల బృందం పరిష్కారం చూపిస్తుందని ఎదురు చూసిన లక్షలాది మంది రైతుల ఆశలను అడియాశలు చేశారు. అసైన్డ్ భూముల అంశం ఎజెండాలో లేకుండా, చర్చే చేయకుండా కేవలం నాలా చట్టం ఉపసంహరణపై మాట్లాడుకుని సమావేశాన్ని ముగించారు. అది కూడా ఎప్పుడో జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ఆదేశం. దానిపై చర్చకు మంత్రివర్గ ఉపసంఘం అవసరమా? అన్న విమర్శలు వస్తున్నాయి. నాలా చట్టం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారికి, రూ.కోట్ల విలువైన వెంచర్లు వేస్తున్న వారికి ఇబ్బందులున్నాయి. ఆ సమస్యపైనే ఉపసంఘం దృష్టిపెట్టింది కానీ లక్షలాది మంది పేద రైతులకు చెందిన ఫ్రీ హోల్డ్ అంశంపై నిర్ణయాత్మక చర్చ చేయలేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పగించిన బాధ్యత నెరవేర్చడంలో రెవెన్యూ శాఖ ఇలాగే వ్యవహరిస్తుందా? అన్న ఆగ్రహం కూటమి వర్గాల నుంచే వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూముల(పీఓటీ) చట్టం-1977లో 2023లో అప్పటి జగన్ సర్కారు సవరణలు చేసిన సంగతి తెలిసిందే. పేదలకు అసైన్ చేసిన భూముల కాలపరిమితి 20 ఏళ్లు దాటి ఉంటే వాటిని నిషేధిత జాబితా(22)(ఏ) నుంచి తొలగించి (ఫ్రీ హోల్డ్) లబ్ధిదారులకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించాలని చట్టసవరణ చేశారు. దీని అమలుకు అదే ఏడాది డిసెంబరు 19న 596 జీఓ ఇచ్చారు. దీన్ని ప్రామాణికంగా తీసుకొని అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయాలి. ఆ తర్వాత ఆ భూములను రైతుల పేరిట మార్చాలి. ఆ తర్వాత రైతులు స్వేచ్ఛగా ఆ భూములను అమ్ముకోవచ్చు. అయితే, జగన్ సర్కారులోని పెద్దలు ఈ చట్టసవరణను అడ్డు పెట్టుకొని భూ దందాకు పాల్పడ్డారు. 13 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేయగా, అందులో 5.73 లక్షల ఎకరాలను జీఓ 596ని ఉల్లంఘించి పీఓటీ చట్టవిరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వ విచారణలో ఈ దందా బయటపడింది. దీంతో గత ఏడాది ఆగస్టులో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌లు, ఇతర వ్యవహారాలన్నింటిపై నిషేధం విధించారు. త్వరలో ప్రభుత్వం ఓ విధాన నిర్ణయం తీసుకొని అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా పరిష్కారం చూపిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ మేరకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది.



రెవెన్యూ శాఖలో సంస్కరణలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రులు అనగాని, పయ్యావుల, నారాయణ

లక్షలాది రైతులకు ఇబ్బందులు

జగన్ జమానాలో 13 లక్షల అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ అయితే 5.75 లక్షల ఎకరాలే అక్రమని తేలింది. మిగిలిన భూములు అంటే.. 7.25 లక్షల ఎకరాలు జీఓ 596 ప్రకారమే నిబంధనలకు లోబడి ఫ్రీ హోల్డ్ చేశారని రెవెన్యూ శాఖ చెబుతోంది. ఈ భూముల్లో అత్యధిక శాతం ఎకరం, రెండు ఎకరాలున్న రైతులే ఉన్నారు. వారందరికీ చట్టప్రకారం రిజిస్ట్రేషన్ చేసే హక్కులు ఉన్నాయి. అక్రమార్కులున్నారనే పేరిట అందరికీ నిషేధం వర్తింపచేసి 10 నెలలవుతోంది. ఫ్రీ హోల్డ్ తర్వాత బినామీ, అక్రమ లావాదేవీలతో ముడిపడిన భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలి. అలాంటి వాటిపై సామాజిక నిఘా ఉంచి రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇందుకు రెవెన్యూ శాఖ గట్టి కసరత్తు చేయాలి. కానీ ఇంత వరకు ఆ శాఖ నుంచి ఏ చిన్న ప్రయత్నం జరగకపోగా, మొత్తం అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌లపై నిషేధం విధించారు. దీంతో చట్టబద్ధంగా నిజమైన హక్కుదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఎవరో తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకోకుండా, అందరికీ నిషేధం వర్తింపజేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అసలు ఉపసంఘం తీరుపైనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకసారి సమీక్ష చేస్తే అక్కడ జరిగిన చర్చలు, తీసుకున్న నిర్ణయాలేమిటో తెలిసిపోతాయని, కనీసం అప్పుడైనా అసైన్డ్ భూముల సమస్యకు పరిష్కారం లభిస్తుందేమోనని ఓ రిటైర్డ్ ఐఏఎస్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

డబుల్ ఇంజన్ సర్కారుతో ఏపీకి డబుల్ ధమాకా

» ఏ రాష్ట్రానికీ లేనివిధంగా నిధుల వరద : కేంద్ర మంత్రి బండి సంజయ్



కేంద్ర సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలిస్తున్న బండి సంజయ్

తిరుపతి(విద్య), జూన్ 11(ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఆంధ్రప్రదేశ్‌కు డబుల్ ధమాకా లభించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ పాలన 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర సంక్షేమ పథకాలను వివరిస్తూ తిరుపతిలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఏపీకి ఏ రాష్ట్రానికీ లేనంతగా కేంద్రం నిధుల వరద పారించింది. ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు ప్రత్యేక ఆర్థిక సాయాన్ని మోదీ అందిస్తున్నారు. మోదీ పాలన స్వర్ణయుగం. రైల్వేల అభివృద్ధికి ఏపీకి రికార్డ్ స్థాయిలో నిధులు కేటాయించింది. ఎక్కడ టెక్నాలజీ ఉందో అక్కడ అభివృద్ధి ఉంటుంది. ఎక్కడ బీజేపీ ఉంటుందో అక్కడ పేదల సంక్షేమం ఉంటుంది. ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక సత్తా చాటడంతో పాటు భారతీయులు తలెత్తుకుని నిలబడేలా కేంద్రం వ్యవహరించింది' అన్నారు.

లిక్కర్ సొమ్ముతో బంగారం

» భారతీరెడ్డి 400 కేజీలు కొన్నారు
» జగన్ జైలుకెళ్లడం ఖాయం : ఆదినారాయణరెడ్డి

కడప మారుతీనగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో యథేచ్ఛగా దోచుకున్న లిక్కర్ సొమ్ముతో జగన్‌రెడ్డి సతీమణి భారతీరెడ్డి సుమారు 400 కేజీల బంగారం కొనుగోలు చేశారని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. బుధవారం ఇక్కడ వికసిత్ భారత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడుతూ 'జగన్‌రెడ్డి-భారతిల చరిత్ర మహాభారతం కంటే చాలా పెద్దది. తల్లిని చెల్లిని దూరం పెట్టిన దుర్మార్గుడు కాబట్టే అమరావతి మహిళలపై అసభ్యపదజాలంతో వాఖ్యలు చేసిన వారికే వంత పలుకుతున్నాడు. లిక్కర్ కేసులో జగన్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయం. ఆయనతో పాటు చాలామంది జైలు ఊచలు లెక్కపెట్టడం తథ్యం' అని ఆదినారాయణరెడ్డి అన్నారు.

గాయని మంగ్లీపై కేసు!

» చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌లో పుట్టిన రోజు వేడుకలు
» అనుమతి లేని పార్టీలో పలువురు సినీ ప్రముఖులు
» అర్ధరాత్రి పోలీసుల దాడి.. డ్రగ్స్ పరీక్షలు
» దామోదర్‌రెడ్డి శరీరంలో గంజాయి ఆనవాళ్లు
» మంగ్లీ సహా నలుగురిపై కేసు నమోదు



చేవెళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయని మంగ్లీపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా చేవెళ్లలోని ఓ రిసార్ట్‌లో మంగ్లీ బర్త్‌డే వేడుకలపై ఎస్ఓటీ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులూ లేకుండా పుట్టిన రోజు పార్టీ నిర్వహించడం, మద్యం సరఫరా చేయడం, గంజాయి సేవించిన వ్యక్తి పట్టుబడడంతో మంగ్లీ సహా నలుగురిపై కేసు పెట్టారు. సీఐ భూపాల్ శ్రీధర్ కేసు వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లిలోని త్రిపుర రిసార్ట్‌లో సింగర్ మంగ్లీ అలియాస్ సత్యవతి మంగళవారం రాత్రి తన బర్త్‌డే వేడుకలు జరుపుకొన్నారు. ఈ పార్టీకి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, సినిమా పరిశ్రమకు చెందిన 22 మంది హాజరయ్యారు. అయితే అర్ధరాత్రి వేళ పెద్ద పెద్ద శబ్దాలతో పార్టీ చేసుకుంటున్నారనే సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు రిసార్ట్‌పై దాడులు నిర్వహించారు. ఈ వేడుకలకు అనుమతి తీసుకోలేదని, మద్యానికి కూడా ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు లేవని గుర్తించారు. అక్కడ ఉన్న 22 మందిలో 9 మంది అనుమానితులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా దామోదర్‌రెడ్డికి పాజిటివ్ వచ్చింది. మూడు రోజుల కిందట గంజాయి తీసుకున్నానని, ఈ పార్టీలో కాదని దామోదర్‌రెడ్డి పోలీసులకు తెలిపాడు. గంజాయి సరఫరా చేసిన వారి సమాచారం కూడా ఇచ్చాడు. పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. మంగ్లీతోపాటు ఆమె మేనేజర్ దున్న మేఘరాజ్, అతని స్నేహితుడు దామోదర్‌రెడ్డి, రిసార్ట్ అసిస్టెంట్ మేనేజర్ శివరామకృష్ణలపై కేసు నమోదు చేసి 41ఏ నోటీసులు జారీ చేశారు. ఆరు ఖాళీ మద్యం సీసాలు, నాలుగు ఫుల్ బాటిళ్లు, డీజే సౌండ్ బాక్స్‌లను సీజ్ చేశారు.

పుట్టిన రోజు నాడే కేసు..

పుట్టిన రోజు నాడే మంగ్లీపై కేసు నమోదవడం గమనార్హం. పుట్టినరోజు పార్టీకి వచ్చిన స్నేహితులకు మంగ్లీ మద్యం సరఫరా చేయించారు. డ్రగ్స్ పరీక్షల సమయంలో మంగ్లీ స్నేహితురాలు దివి పోలీసులతో దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. పోలీసులు వీడియో తీస్తుండగా అడ్డుపడడంతో.. 'మా పని చేయకుండా అడ్డుపడితే మీకే నష్టం' అని పోలీసులు హెచ్చరించారు. ఈ పార్టీలో మంగ్లీ కుటుంబ సభ్యులు, దగ్గరి స్నేహితులతో పాటు సింగర్ ఇంద్రావతి, దివి, సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్, రచ్చ రవి కూడా ఉన్నట్లు సమాచారం. పోలీసుల దాడి సమయంలో తాను అక్కడ లేనని కాసర్ల శ్యామ్ ప్రకటించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

డబ్బింగ్ షురూ...



ఎన్టీఆర్, హృతిక్ రోషన్ కథానాయకులుగా నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. ఎన్టీఆర్ బుధవారం తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించారు. 'వార్ 2 డబ్బింగ్ ప్రారంభం' అంటూ ఎన్టీఆర్ స్టూడియోలోకి అడుగుపెడుతున్న వీడియోను చిత్ర బృందం సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఎన్టీఆర్‌కు ఇది తొలి హిందీ చిత్రం. ఈ స్పై థ్రిల్లర్‌లో సీక్రెట్ ఏజెంట్‌గా ఆయన డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. కియారా అద్వానీ ఈ చిత్రంలో కథానాయిక. గతంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ నటించిన 'వార్' చిత్రానికి ఇది కొనసాగింపు. ఆదిత్యా చోప్రా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ముస్సోరిలో మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'మెగా 157' వర్కింగ్ టైటిల్. ఇటీవలె హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేశారు మేకర్స్. ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను బుధవారం ముస్సోరిలో ప్రారంభించారు. ఈ అందమైన హిల్ స్టేషన్‌లో 10 రోజుల పాటూ వినోదాత్మక సన్నివేశాలను చిత్రీకరిస్తారు. చిరుతో పాటూ సినిమాలోని కీలక పాత్రధారులు ఇందులో పాల్గొంటున్నారు. ఆయనకు జోడిగా నయనతార నటిస్తున్నారు. 'ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి', 'గాడ్ ఫాదర్' చిత్రాల తర్వాత వారిద్దరూ కలసి నటించడం ఇది మూడోసారి. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. చాలా రోజుల తర్వాత చిరంజీవి వినోదానికి ప్రాధాన్యం ఉన్న పాత్ర చేస్తుండడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇందులో ఆయన పాత్ర అభిమానులకు విజువల్ ట్రీట్‌లా ఉంటుందని మేకర్స్ హామీ ఇచ్చారు.



సినిమా అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది

నితిన్

నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు తెరకెక్కిస్తున్న చిత్రం 'తమ్ముడు'. 'కాంతార' ఫేమ్ సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ, స్వసిక విజయన్, లయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. జూలై 4న విడుదలవుతోంది. బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు వేణు శ్రీరామ్ మాట్లాడుతూ "ఇందులో సరికొత్త స్క్రీన్ ప్లేను చూస్తారు. తన కోసం కాకుండా సినిమా గురించి ఆలోచించే వ్యక్తి నితిన్. నేను, నితిన్, దిల్‌రాజు.. పవన్‌కల్యాణ్ గారి అభిమానులం. అందుకే ఈ సినిమాకు 'తమ్ముడు' టైటిల్ పెట్టాం" అని తెలిపారు. "ఈ సినిమా మీ అందర్నీ తప్పక సర్‌ప్రైజ్ చేస్తుంది. ఇంతకన్నా ఎక్కువ ఈ సినిమా గురించి చెప్పను. జూలై 4న సినిమా మాట్లాడుతుంది. చిత్రం ఘనవిజయం సాధిస్తుంది" అని నితిన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. అవి ప్రస్తుతం సంచలనంగా మారాయి.

నితిన్, శ్రీరామ్ వేణు సపోర్ట్ చేశారు



"ఈ ఏడాది విడుదలైన సినిమాల్లో కేవలం నాలుగైదు మాత్రమే ఆదరణ పొందాయి. దీన్ని బట్టి థియేట్రికల్‌గా సినిమాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 'తమ్ముడు' సినిమా షూటింగ్ ఎక్కువ రోజులు జరగడంతో బడ్జెట్ పెరిగింది. ఈ విషయం దర్శకుడు వేణుకు చెప్పా. 'అద్భుతమైన సౌండింగ్, ఉన్నత స్థాయి విజువల్స్ ఉన్న అవుట్‌పుట్ కోసమే బడ్జెట్ పెరిగింది. ఈ సినిమాకు ఇప్పటివరకూ ఇంత తీసుకున్నా. ఇక నుంచి ఒక్క రూపాయీ తీసుకోను. సినిమా విడుదలై హిట్ అయ్యాక పారితోషికం ఇవ్వండి' అని అన్నారు. నా 22 ఏళ్ల కెరీర్‌లో ఇలాంటి దర్శకుడిని నేను చూడలేదు. అలాగే, నితిన్ కూడా పారితోషికం విషయంలో చాలా రాజీ పడ్డారు. 'ఎంత వీలైతే అంతే ఇవ్వండి' అని సపోర్ట్‌గా మాట్లాడారు. నిర్మాత పరిస్థితి తెలుసుకుని దర్శకుడు, హీరో ఇలా వ్యవహరించడం గొప్ప విషయం. ఇలా హీరో, దర్శకుడు నిర్మాతలకు మద్దతు ఇస్తూ ఓ కొత్త ఒరవడిని తీసుకురావాలి".

డబ్బులు పెట్టి వ్యూస్ కొనొద్దు

"'తమ్ముడు' సినిమా ట్రైలర్‌కు ఒరిజినల్‌గా ఎన్ని వ్యూస్ వస్తాయో అన్నే చెప్పాలనుకుంటున్నాం. ఇన్ని మిలియన్స్, అన్ని మిలియన్స్ అనే ప్రచారం కోసం డబ్బులు పెట్టి వ్యూస్ కొనొద్దని, ప్రేక్షకుల నుంచి నిజంగా వచ్చిన వ్యూస్ మాత్రమే కనిపించాలని పీఆర్ టీమ్‌కు చెప్పా. అప్పుడు గాని టీజర్, పాటలు ప్రేక్షకులకు ఎంతగా చేరాయో తెలియదు. సినిమా రీచ్ ఎలా ఉందో అర్థం అవుతుంది. ఈ విషయంలో నేను ముందడుగు వేశా. కష్టమైనా ముందుకెళ్లాల్సిందే".

పవన్‌కల్యాణ్ ఆదర్శం

"ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ మధ్య థియేటర్లకు ప్రేక్షకులను ఎలా తిరిగి తీసుకురావాలో కొన్ని సూచనలు చేశారు. ఆయన చెప్పిన విషయాలు ఎంతో ఆదర్శవంతంగా ఉన్నాయి. వాటిని పాటించడానికి ప్రయత్నిస్తున్నాను. ఆయన సూచనలను నిర్మాతలంతా పాటించాలి. 'తమ్ముడు' చిత్రానికి ధరలు పెంచమని ప్రభుత్వాలను అడగను. ఇకపై తెలంగాణలో టికెట్ల ధర పెంచడం అంటూ ఉండదు. టికెట్ల ధరలు, తినుబండారాల ధరలు కూడా ప్రేక్షకులకు అందుబాటులో ఉండాలి. ఈ విషయాలను తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలోనూ చర్చించాం. పవన్‌గారి సూచనలపై తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చాను".

వేడుక... వినోదం



హీరో సూర్య నటిస్తున్న తొలి తెలుగు స్ట్రెయిట్ చిత్రం (సూర్య - 46) చిత్రం రెగ్యులర్ షూట్ బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. 'వేడుక, భావోద్వేగం, వినోదం వైపు తొలి అడుగు' అంటూ సూర్య ముందడుగు వేస్తున్న పోస్టర్‌ను చిత్రబృందం పంచుకుంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో మమితా బైజు కథానాయిక. రవీనాటాండన్, రాధికా శరత్‌కుమార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారు. సంగీతం: జీవీ ప్రకాశ్, సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి



తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో చేపట్టిన 'ఆపరేషన్ సంకల్ప్'కు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ మద్దతు పలికింది. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే లక్ష్యంతో చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాల రవి తదితరులు పాల్గొని ప్రచార చిత్రాలు ఆవిష్కరించారు.

'యజ్ఞం' దర్శకుడు ఇక లేరు



టాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు ఏ. ఎస్ రవికుమార్ చౌదరి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య నాగబిందు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2001లో ఆకాశ్ హీరోగా నటించిన 'మనసుతో' చిత్రంతో రవికుమార్ చౌదరి దర్శకుడిగా పరిచయమయ్యారు. గోపీచంద్‌ను హీరోగా ఆయన తెరకెక్కించిన 'యజ్ఞం' చిత్రం వారిద్దరికీ ఇండస్ట్రీలో బ్రేక్ ఇచ్చింది. సాయిదుర్గాతేజ్‌తో తెరకెక్కించిన 'పిల్లా నువ్వు లేని జీవితం' చిత్రం బాక్సాఫీసు దగ్గర మంచి విజయాన్ని అందుకుంది. బాలకృష్ణతో 'వీరభద్ర', నితిన్‌తో 'ఆటాడిస్తా' చిత్రాలను తెరకెక్కించినా అవి విజయవంతం అవ్వలేదు. రాజ్‌తరుణ్‌తో తెరకెక్కించిన 'తిరగబడరా సామి' రవికుమార్ ఆఖరిచిత్రం.

తత్కాల్ బుకింగ్‌కు కొత్త నిబంధనలు

ఆధార్ వెరిఫైడ్ యూజర్లకు మాత్రమే టికెట్లు



న్యూఢిల్లీ, జూన్ 11: తత్కాల్ బుకింగ్‌లో అవకతవకలను నిరోధించడానికి, అంతిమ వినియోగదారుడు మాత్రమే లబ్ధి పొందేలా రైల్వే శాఖ నిబంధనలు మార్చింది. ఆధార్ వెరిఫైడ్ యూజర్లు మాత్రమే తత్కాల్ బుకింగ్ చేసుకునేలా ఐఆర్‌సీటీసీ వెబ్‌లో, యాప్‌లో మార్పులు చేయాలని, జూలై 1 నుంచి అమలు చేయాలని రైల్వే నిర్ణయించింది. ఈమేరకు జూన్ 10న అన్ని జోన్‌లకు సర్క్యులర్ జారీ చేసింది. అలాగే జూలై 15 నుంచి అదనంగా తత్కాల్‌లో టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికుడు ఆధార్ ఆధారిత ఓటీపీని కూడా నిర్ధారించాల్సి ఉంటుంది. అలాగే రైల్వే రిజర్వేషన్ ఏజెంట్లు తత్కాల్ మొదటి రోజు మొదటి అరగంట టికెట్లు బుక్ చేయకుండా వెబ్‌సైట్‌లో మార్పులు చేసింది. ఏసీ టికెట్ అయితే 10.30 తరువాత, సాధారణ తరగతిలో అయితే 11.30 తరువాత మాత్రమే ఏజెంట్లకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా ఇప్పటి వరకూ వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు రైలు బయలుదేరడానికి కేవలం నాలుగు గంటల ముందు మాత్రమే తమ టికెట్ స్టేటస్ తెలుస్తుంది. దీనివలన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో 24 గంటల ముందే వెయిటింగ్ లిస్ట్ టికెట్ స్టేటస్ వెల్లడించేందుకు రైల్వే సిద్ధమవుతోంది. ఈ మేరకు బికనీర్ డివిజన్‌లో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు రైల్వే బోర్డు సమాచార, ప్రచార విభాగం డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

రూ.3 వేలు దాటే యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ చార్జీలు?

- రెండు నెలల్లో అమలు!
- ఖండించిన కేంద్రం



న్యూఢిల్లీ, జూన్ 11: యూపీఐ లావాదేవీలపై మళ్లీ మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) చార్జీలను విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. రూ.3 వేలకు పైబడి చేసే యూపీఐ చెల్లింపులకు ఈ చార్జీలు వర్తిస్తాయి. ఒకట్రెండు నెలల్లో ఈ విధానం అమల్లోకి వస్తుందంటూ 'ఎన్‌డీటీవీ ప్రాఫిట్' ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఉటంకించింది. ఆ కథనం ప్రకారం.. యూపీఐ విధానం అమల్లోకి వచ్చిన తొలినాళ్లలో ఎండీఆర్ చార్జీలు 0.3శాతంగా ఉండేవి. అంటే.. క్రెడిట్ కార్డుల(0.9% నుంచి 2%) మాదిరిగానే వర్తకులపై ఎండీఆర్ భారం పడేది. 2020 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం వర్తకులకు సాంత్వన కల్పిస్తూ.. జీరో ఎండీఆర్ విధానాన్ని అమలు చేసింది. ఇప్పుడు 80శాతానికి పైగా డిజిటల్ చెల్లింపులు యూపీఐ ద్వారా జరుగుతుండడంతో.. బ్యాంకులు, చెల్లింపు సేవాసంస్థల నిర్వహణ చార్జీలను దృష్టిలో పెట్టుకుని, ఎండీఆర్‌కు సిద్ధమైంది. అయితే.. ఎండీఆర్ పెంపు వార్త అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

లోకం తీరు



ట్రంప్‌పై పెట్టిన పోస్టులపై మస్క్ విచారం

- అవి చాలా దూరం వెళ్లాయని వ్యాఖ్య

వాషింగ్టన్, జూన్ 11: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి గత వారం తాను చేసిన కొన్ని సోషల్ మీడియా పోస్టులపై టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల సీఈవో ఎలాన్ మస్క్ విచారం వ్యక్తం చేశారు. అవి చాలా దూరం వెళ్లాయంటూ బుధవారం 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. ట్రంప్ ప్రభుత్వం నుంచి మస్క్ వైదొలిగాక టీవీ ఇంటర్వ్యూల్లోనూ, సోషల్ మీడియా పోస్టుల్లోనూ ఇరువురూ పరస్పరం విమర్శించుకున్న విషయం తెలిసిందే. కాగా, వీరిద్దరూ వైరాన్ని పక్కన పెట్టనున్నట్టు మంగళవారమే సంకేతాలు వెలువడ్డాయి. మస్క్‌తో మాట్లాడాలనే ఆలోచన ఉందా? అని విలేకరులు ట్రంప్‌ను ప్రశ్నించగా.. తనకు ఆ ఆలోచన ఏమీ లేదని, అయితే తానే గనుక మస్క్ స్థానంలో ఉంటే మాట్లాడాలనే ఆలోచన చేసేవాడినని చెప్పారు.

చైనాతో డీల్ కుదిరింది: ట్రంప్

న్యూఢిల్లీ, జూన్ 11: చైనాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఓ డీల్ కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం ప్రకటించారు. ఇందులో భాగంగా చైనా తమకు అరుదైన ఖనిజాలను సరఫరా చేస్తుందన్నారు. ఒప్పందంలో భాగంగా చైనా అమెరికాకు పూర్తి మ్యాగ్నెట్‌లను, అవసరమైన అన్ని అరుదైన ఖనిజాలను సరఫరా చేస్తుందని ట్రంప్ తెలిపారు. ఇందుకు బదులుగా చైనా విద్యార్థులు అమెరికా కళాశాలలు, వర్సిటీల్లో చదువుకొనేందుకు అనుమతిస్తామన్నారు. చైనా నుంచి అమెరికాకు దిగుమతయ్యే వస్తువుల మీద 55 శాతం, అమెరికా నుంచి చైనాకు ఎగుమతయ్యే ఉత్పత్తుల మీద 10% టారిఫ్‌లు అమలవుతాయని తెలిపారు. ఈ ఒప్పందాన్ని తాను, చైనా అధ్యక్షుడు ఆమోదించడమే తరువాయి అని ట్రంప్ తెలిపారు.

యాక్సియం-4 మిషన్..

మళ్లీ వాయిదా



న్యూఢిల్లీ, జూన్ 11: భారత వ్యోమగామి శుభాన్షుశుక్లా సహా నలుగురిని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపేందుకు చేపట్టిన యాక్సియం-4 మిషన్ మరోసారి వాయిదా పడింది. స్పేస్ఎక్స్ క్రూ డ్రాగన్‌ను కక్ష్యలో ప్రవేశపెట్టాల్సిన ఫాల్కన్ 9 రాకెట్‌లో ద్రవ ఇంధన (లిక్విడ్ ఆక్సిజన్) లీకేజీ కారణంగా వాయిదా నిర్ణయం తీసుకున్నట్టు స్పేస్ఎక్స్ ప్రకటించింది. దీనికి సంబంధించిన మరమ్మత్తులు పూర్తయ్యాక కొత్త లాంచ్ డేట్‌ను ప్రకటిస్తామని 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. కాగా.. ఫాల్కన్ 9 రాకెట్ లాంచ్‌ప్యాడ్‌పై ఉండగా నిర్వహించిన ఏడు సెకన్ల హాట్ టెస్ట్ సందర్భంగా.. రాకెట్‌లోని 'ప్రొపల్షన్ బే'లో ద్రవ ఇందన లీకేజీని గుర్తించినట్టు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు.

ఏసీల కనిష్ఠ ఉష్ణోగ్రత ఇక 20 డిగ్రీలకే పరిమితం

న్యూఢిల్లీ, జూన్ 11: విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దేశ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏసీల కనిష్ఠ ఉష్ణోగ్రతపై పరిమితులు విధించనుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఏసీల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతను 16 డిగ్రీల సెల్సియస్ వరకు పెట్టుకోవచ్చు. కానీ, ప్రతిపాదిత నిబంధన ప్రకారం ఏసీ కనిష్ఠ ఉష్ణోగ్రత 20 డిగ్రీలకు.. గరిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం కానుంది. అంటే, 20 డిగ్రీల కంటే ఉష్ణోగ్రతను తగ్గించలేరు. అలాగే 28 డిగ్రీల కంటే ఉష్ణోగ్రతను పెంచలేరు. గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే అన్ని రకాల ఏసీలతోపాటు వాహనాల్లో ఉపయోగించే ఎయిర్ కండిషనర్లల్లోనూ ఈ మార్పులు చేయనున్నారు.

ముసుగు వేసేద్దాం..!

- సిందూర్ దెబ్బతో పాక్ మిలిటరీ సైట్లపై టార్పాలిన్లు



న్యూఢిల్లీ, జూన్ 11: అబ్బెబ్బే.. ఆపరేషన్ సిందూర్ దాడుల్లో మాకేం నష్టంలేదు అని పాకిస్థాన్ చెప్పడం ఉత్తి బుకాయింపే అని శాటిలైట్ చిత్రాల్లో బయటపడింది. సిందూర్ దాడుల్లో దెబ్బతిన్న మూడు మిలిటరీ సైట్లలో రూఫ్‌టాప్‌లకు టార్పాలిన్లు కప్పి రిపేర్లు చేస్తోంది. దానిని హైరిజల్యూషన్ శాటిలైట్ చిత్రాలు పసిగట్టాయి. ఆ వివరాలను ఇండియాటుడే తన కథనంలో వివరించింది. పాక్‌లోని మురిద్, జకోబాబాద్, భోలారీల్లోని బేస్‌లు భారత్ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. సింధ్‌లోని భోలారీ ఎయిర్ బేస్ దెబ్బతిన్నట్లు కనబడకుండా ఉండేందుకు దాని పైకప్పునకు నీట్‌గా ఓ కవర్ కప్పేసింది. ఈనెల 4న తీసిన శాటిలైట్ ఫొటోల్లో అది కవరింగే అన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఇక పంజాబ్‌లోని మురిద్ బేస్‌ది కూడా ఇదే కథ. ఇక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై టార్పాలిన్ కప్పి కింద రిపేర్లు చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.. ఎఫ్-16కు స్థావరమైన జకోబాబాద్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో ఇలాంటి పనులే కనిపిస్తున్నాయి.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి మే 25న నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2025 ఫలితాలను బుధవారం యూపీఎస్సీ వెల్లడించింది. సివిల్స్ మెయిన్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థుల రోల్ నంబర్లతో కూడిన జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పరీక్షకు 74,427 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 42,804 మంది పరీక్షకు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన 14,161 మందిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థుల సంఖ్య 450 నుంచి 500 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. సివిల్స్ మెయిన్ పరీక్షలు ఆగస్టు 22 నుంచి 5 రోజుల పాటు జరగనున్నాయి.

అభివృద్ధిని తట్టుకోలేక విమర్శలు: ఎంపీ కలిశెట్టి

హైదరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అభివృద్ధిలో ముఖ్యభూమిక పోషించిన చంద్రబాబు సారథ్యంలో ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి కావడాన్ని తట్టుకోలేక జగన్ పేటీఎం బ్యాచ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తోందని విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏపీ ఖ్యాతి దేశవ్యాప్తం కావడాన్ని వైఎస్ జగన్, ఆయన అనుచరులు ఓర్వలేకపోతున్నారు' అన్నారు.

విచారణకు రండి!

- కల్తీ నెయ్యి ఘటనలో టీటీడీ ముఖ్యులకు సిట్ నోటీసులు

తిరుపతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తిరుమల కల్తీ నెయ్యి కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానాని(టీటీడీ)కి సంబంధించిన కీలక పదవుల్లో పనిచేసిన ముఖ్యులకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నోటీసులు జారీ చేసింది. విచారణకు హాజరై దర్యాప్తునకు సహకరించాలని అధికారులు కోరారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. సిట్ బృందం ఇటీవల టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు అప్పన్నను విచారించింది. దీంతో తదుపరి వంతు 'కీలక' వ్యక్తులదేనన్న అంచనాలు అప్పుడే మొదలయ్యాయి. దానికి తగ్గట్టుగానే సిట్ అధికారులు గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ బోర్డులో కొనసాగిన ముఖ్యులకు, కీలక స్థానాల్లో పనిచేసిన అధికారులకు సోమ, మంగళవారాల్లో నోటీసులు జారీ చేశారు. 10 రోజుల్లో సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అప్పట్లో నెయ్యి కొనుగోలుకు సంబంధించిన వివరాలు కూడా అందజేయాలని కోరినట్టు సమాచారం.

భారతి క్షమాపణ చెప్పాలి: మహిళా సంఘాలు

విజయవాడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరుస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్న వ్యక్తులను పార్టీల నుంచి బహిష్కరించాలని, చట్టసభలకు దూరంగా ఉంచాలని మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 'ఐక్యవేదిక' ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. సాక్షి చానెల్‌లో అమరావతిని 'వేశ్యల రాజధాని'గా అభివర్ణించడాన్ని ముక్తకంఠంతో ఖండించారు. ఈ వ్యాఖ్యలపై సాక్షి మీడియా చైర్‌పర్సన్ వైఎస్. భారతి క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. జర్నలిస్టు కృష్ణంరాజు, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సజ్జలకు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంత మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఈనెల 18న వ్యక్తిగతంగా కమిషన్ ముందు హాజరై ఆయన చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

న్యాయ వ్యవస్థ క్రియాశీలత..

న్యాయ ఉగ్రవాదం కావద్దు

- జోక్యం చేసుకోకూడని అంశాల్లో కలుగజేసుకోవడం మంచిది కాదు
- న్యాయసమీక్ష అధికారాన్ని అరుదైన కేసుల్లోనే వినియోగించాలి: సీజేఐ జస్టిస్ గవాయ్

న్యూఢిల్లీ, జూన్ 11: న్యాయవ్యవస్థ తాను జోక్యం చేసుకోకూడని అంశాల్లో కలగజేసుకోవడం మంచిది కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ క్రియాశీలత న్యాయ ఉగ్రవాదంగా మారకూడదని వ్యాఖ్యానించారు. ప్రజల హక్కులను పరిరక్షించడంలో ఏదైనా చట్టంగానీ, కార్యనిర్వాహక యంత్రాంగంగానీ విఫలమైనప్పుడు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవచ్చని.. అయితే ఈ న్యాయసమీక్ష అధికారాన్ని అరుదైన కేసుల్లో మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. బుధవారం ఆక్స్‌ఫర్డ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడారు. భారత రాజ్యాంగం రాతప్రతి రూపంలో ఉన్న నిశ్శబ్ద విప్లవమని అభివర్ణించారు. దేశ పౌరుల హక్కులకు అభయమివ్వడమే కాకుండా అణగారినవర్గాల అభ్యున్నతికి తోడ్పడిన శక్తి రాజ్యాంగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అండ్ బెంచ్ వెబ్‌సైట్ ప్రతినిధి అడిగిన ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. "భారతదేశంలో న్యాయవ్యవస్థ క్రియాశీలత అవసరమే. అయితే న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోకూడని అంశాల్లో కలుగజేసుకోవడం మంచిదికాదు. న్యాయ వ్యవస్థ క్రియాశీలత న్యాయ ఉగ్రవాదంగా మారకూడదు. మీరు పరిమితులను మీరడానికి ప్రయత్నిస్తే.. సాధారణంగా న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోకూడని అంశాల్లోకి వెళ్లాల్సి వస్తుంది. ప్రజల హక్కుల పరిరక్షణలో చట్టాలు, కార్యనిర్వాహక యంత్రాంగం విఫలమైనప్పుడు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవచ్చు. కానీ న్యాయసమీక్ష అధికారాన్ని అరుదైన కేసుల్లో మాత్రమే వినియోగించాలి. ఏదైనా చట్టం రాజ్యాంగ మూల సూత్రాలతో విభేదించినప్పుడుగానీ, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేరుగా విఘాతం కలిగినప్పుడుగానీ, ఏదైనా శాసనం పూర్తి ఏకపక్షంగా, వివక్షాపూరితంగా ఉన్నప్పుడుగానీ న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించుకోవాలి" అని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు.

రాష్ట్రపతికి గడువు నిర్దేశించిన అంశంపై కలకలంతో..

రాష్ట్రపతి, గవర్నర్లు తమకు అందిన బిల్లులపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు గడువు నిర్దేశించడం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఇలా గడువు నిర్దేశించే అధికారం కోర్టుకు ఉంటుందా? ఈ అంశంలో రాజ్యాంగం ఏం చెబుతోంది? రాష్ట్రపతి, గవర్నర్లు తమ విధి నిర్వహణకు సంబంధించి ఏ కోర్టుకూ జవాబుదారీ కాదని ఆర్టికల్ 361 స్పష్టం చేసిన అంశాలపై అభిప్రాయం తెలపాలంటూ సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము లేఖ కూడా రాశారు. ఈ నేపథ్యంలో తాజాగా చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

చిన్నారులతో రైలుకి అడ్డం వెళ్లి..

- భార్యపై కోపంతో నలుగురు పిల్లలతో సహా కూలీ ఆత్మహత్య
- అడిగినవి కొనిచ్చి మరీ దారుణం

గుర్‌గావ్, జూన్ 11 : హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఘోరం జరిగింది. భార్యపై కోపంతో ఓ వ్యక్తి తన నలుగురు పిల్లలతో సహా రైలు పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. బిహార్‌కు చెందిన మనోజ్ మహతో(36) అనే కూలీ మూడు నుంచి పదేళ్ల వయస్సున్న తన నలుగురు పిల్లలు చోటు(3), మురళి(5), కరు(9), పవన్(10)లను మంగళవారం మధ్యాహ్నం రైలు పట్టాలపైకి తీసుకువెళ్లాడు. గోల్డెన్ టెంపుల్ ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకు వస్తుండగా పిల్లలు ప్రాధేయపడుతున్నా వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. దీంతో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పిల్లలతో అతడు రైలు పట్టాలు దాటేందుకు వెళుతున్నాడని భావించామని స్థానికులు చెప్పారు. కాగా పిల్లల్ని పార్కుకు తీసుకువెళ్తున్నానని తనకు చెప్పాడని అతడి భార్య ప్రియ పోలీసులకు తెలిపింది. అయితే మనోజ్ పిల్లల్ని పార్కుకు తీసుకువెళ్లకుండా రైలు పట్టాల దగ్గరకు తీసుకువెళ్లాడు. అక్కడి ఫ్లైఓవర్ కింద రైలు వచ్చేంత వరకు పిల్లలు అడిగిన చిప్స్, కూల్ డ్రింకులు కొనిచ్చి గంట సేపు ఉంచాడు. అనంతరం ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకువస్తుండగా ఘోరానికి పాల్పడ్డాడు. దుర్ఘటన తర్వాత లోకో పైలెట్ రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మనోజ్ జేబులో అతడి భార్య ఫోన్ నెంబరు రాసి ఉండడాన్ని గుర్తించారు. దీంతో అతడు ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ చర్యకు పాల్పడ్డాడని భావిస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని గుర్తించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారిస్తున్నట్లు వెల్లడించారు.

కర్ణాటక వాల్మీకి స్కాం కేసులో..

ఈడీ దాడులు

బళ్లారి ఎంపీ తుకారాం ఇంట్లో సోదాలు

ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లలోనూ

బళ్లారి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మహర్షి వాల్మీకి ఎస్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన రూ.187కోట్ల నిధులను లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి మళ్లించారన్న ఆరోపణలపై బళ్లారి ఎంపీ ఈ.తుకారాం, అదే జిల్లాలో ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లలో ఈడీ తనిఖీలు చేపట్టింది. సుమారు పది బృందాలు బుధవారం ఉదయం 6 గంటలకే రంగంలోకి దిగాయి. తుకారాం, బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ, కంప్లి ఎమ్మెల్యే గణేశ్, బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, కూడ్లిగి ఎమ్మెల్యే ఎన్‌టీ శ్రీనివాసులు నివాసాలు, బెంగళూరులోని విధానపరిషత్‌లో మాజీ మంత్రి బి.నాగేంద్రకు కేటాయించిన కార్యాలయం, బళ్లారిలో ఆయన ఆప్తుడు గోవర్ధన్‌రెడ్డి ఇల్లు, నాగేంద్ర పీఏ విజయ్‌కుమార్ ఇంట్లో ఈడీ బృందాలు ఏకకాలంలో సోదాలు చేశాయి. ఈడీ అధికారులు స్థానిక పోలీసులను కాకుండా భద్రత కోసం బీఎస్ఎఫ్ బలగాలను తెచ్చుకున్నారు. స్థానిక పోలీసులు వెళ్లినా వెనక్కి పంపించారు. తమను ఎస్పీ పంపించారని ఓ సీఐ చెప్పగా.. 'మీ సహాయం అవసరం లేదు' అని తిప్పి పంపించారు.

నీటి నిల్వ నిర్ణయం అధికారులదే

- పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ వెల్లడి
- మాజీ సీఎంపై కమిషన్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, జూన్ 11(ఆంధ్ర జ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలన్న నిర్ణయం అధికారులదేనని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్.. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌కు తెలిపారు. పంప్‌హౌస్ హెడ్‌కు తాకేంతవరకు నీటిని వారే నిల్వ చేశారని చెప్పారు. నీటి నిల్వకు తాను ఎటువంటి ఆదేశాలూ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసం తమ ప్రభుత్వ హయాంలో రూ.280 కోట్ల నిధులు విడుదల చేశామని, వాటిని వినియోగించే అధికారాలు కూడా అధికారులకు దఖలు పరిచామని వెల్లడించారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన నిర్ణయం నాటి మంత్రివర్గం తీసుకుందని, ప్రభుత్వ ఆమోదంతోనే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామన్నారు. బ్యారేజీల కోసం స్థలాల ఎంపిక పూర్తిగా సాంకేతికంగానే జరిగిందని తెలిపారు. కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ బుధవారం హాజరయ్యారు. ఓపెన్ కోర్టులో కేసీఆర్‌ను విచారించేందుకు కమిషన్ ఏర్పాట్లు చేయగా.. తనకు తీవ్రంగా జలుబు ఉందని, గుంపులో ఉంటే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఓపెన్ కోర్టు విచారణ వద్దని చెప్పడంతో అందరినీ బయటకు పంపించి ముఖాముఖి విధానంలో కేసీఆర్‌ను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

అబద్ధాలకోరు ప్రధాని!

- పేదలను, యువతను ట్రాప్ చేస్తారు.. వారి ఓట్లు కాజేస్తారు: మల్లికార్జున ఖర్గే



బెంగళూరు-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ, జూన్ 11: ప్రధాని మోదీవంటి అబద్ధాలకోరును తానింతవరకు చూడలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 11 ఏళ్ల పాలనలో 33 తప్పులు చేశారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం వచ్చి 11 ఏళ్లు.. మూడో టర్మ్‌లో మొదటి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం కలబురగిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇన్ని అబద్ధాలాడే ప్రధానిని నేనింతవరకు చూడలేదు. ఎన్నో తప్పులు చేస్తారు. ప్రజలను ఉచ్చులో బిగిస్తారు.. యువతను మోసగిస్తారు.. పేదలను ట్రాప్ చేస్తారు.. ఓట్లు పొందుతారు. నేను 55 ఏళ్లు అధికార పదవుల్లో ఉన్నాను. 65 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నాను. మోదీలాంటి వ్యక్తి ఎక్కడా లేరు. ప్రతి విషయంలోనూ అసత్యాలాడతారు. చెప్పేది ఒక్కటీ అమలు చేయరు. 11 ఏళ్లుగా ఇదే తంతు' అని ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రకారం లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌ను నియమించాలని మోదీకి తాను లేఖ రాశానన్నారు. ఆయన ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అని అంటుంటారని.. కానీ స్వాతంత్ర్యం వచ్చాక ఏ ప్రధానమంత్రీ ఇన్నేళ్లు ఈ పదవిని ఖాళీగా ఉంచలేదన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షానికి చెందిన నాయకుడికి ఈ పదవి కట్టబెట్టామని.. అంతకుముందు కూడా నియామకం జరిగిందని తెలిపారు. మోదీ చర్య చట్టవిరుద్ధం, అప్రజాస్వామికమని.. విపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలనుకోవడం లేదని.. ఆయనకు ప్రజాస్వామ్యం అంటే నమ్మకం లేదని విమర్శించారు. పాకిస్థాన్ ప్రేరిత సీమాంతర ఉగ్రవాదం, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటరీ బృందాలను విదేశాలకు పంపించిన మోదీ.. పహల్గాం దాడి అనంతరం దేశంలో భద్రత, విదేశాంగ విధానం సవాళ్లపై పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర స్థాయి చర్చకు అంగీకరిస్తారా అని కాంగ్రెస్ ప్రశ్నించింది.

బడుగుల హాస్టళ్లు దుర్భరం: రాహుల్

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లలో దుర్భర పరిస్థితులు ఉన్నాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని మోదీకి లేఖ రాశారు. అట్టడుగు వర్గాల విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనాల విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు.

ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే..

రాకెట్‌లో వచ్చేస్తుంది!

- 'డెలివరీ రాకెట్' ప్రయోగం చేసిన చైనా సంస్థ సెపోచ్

బీజింగ్, జూన్ 11: ఏదైనా వస్తువు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే.. చాలా వేగంగా రాకెట్‌లా డెలివరీ చేస్తామని కంపెనీలు చెబుతూ ఉంటాయి. అయితే రాకెట్‌లా కాదు.. అచ్చంగా రాకెట్‌తోనే డెలివరీ చేస్తే!? భూమ్మీద ఏ మూలనో, వేల కిలోమీటర్ల దూరంలోనో ఉన్నా.. గంటా, రెండు గంటల్లోనే ప్యాకేజీలు చేతికి అందితే!? చైనాకు చెందిన ప్రైవేటు రాకెట్ సంస్థ సెపోచ్ గత నెల 29న చైనా తూర్పు తీర ప్రాంతంలో ఈ తరహా ప్రయోగం నిర్వహించింది. సరుకు రవాణా కోసం ప్రత్యేకంగా స్టెయిన్‌లెస్ స్టీలు రాకెట్ ప్రాథమిక రూపాన్ని అభివృద్ధి చేసింది. మళ్లీ మళ్లీ వినియోగించగల (పునర్వినియోగ) ఈ రాకెట్ ఎత్తు 26.8 మీటర్లు, బరువు 57 టన్నులు. దీనిలోని కంటెయినర్‌లో సుమారు 10 టన్నుల మేర సరుకులను మోసుకెళ్లగలదు. ప్రస్తుతం రాకెట్ కంటెయినర్‌లో ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అలీబాబా అనుబంధ సంస్థ టావోబావోకు చెందిన 20 కిలోల బరువున్న ప్యాకేజీలను పెట్టి ప్రయోగించారు. రాకెట్ 125 సెకన్ల పాటు మంటలు విరజిమ్ముతూ 2.5 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుందని.. తర్వాత షాంగ్‌డోంగ్ ప్రావిన్స్ తీరానికి సమీపంలో సముద్రంలో నిలువునా ల్యాండ్ అయిందని సెపోచ్ సంస్థ తెలిపింది. ఆ రాకెట్‌ను రికవరీ చేశామని, తమ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించింది.

అప్రమత్తతతోనే

ఫ్యాటీ లివర్‌కు చెక్

- ముందే గుర్తించాలి.. జీవనశైలి మార్చుకోవాలి: వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో నానాటికీ 'ఫ్యాటీ లివర్' కేసులు పెరుగుతున్నాయని.. 24-30 శాతం మంది పిల్లల్లో సైతం ఈ సమస్య కనిపిస్తోందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జీవనశైలి మార్చుకోవడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చని ఆయన సూచించారు. వరల్డ్ ఫ్యాటీ లివర్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో 'యువర్ లివర్, యువర్ హెల్త్, యువర్ ఫ్యూచర్' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. సదస్సుకు ఏఐజీ ఆస్పత్రి హెపటాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.నాగరాజారావు సంధానకర్తగా వ్యవహరించారు. తొలుత ప్రసంగించిన డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి.. ఫ్యాటీ లివర్ కారణంగా మధుమేహం తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని, గుండె, జీర్ణక్రియ సమస్యలూ రావొచ్చని ఆయన హెచ్చరించారు. కాలేయంలో కొవ్వును కనీసం 10% అయినా తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని.. వ్యాయామాలు చేయడం, ఆహార నియంత్రణలు పాటించడం వంటివి చేయాలని.. అప్పుడే ఈ సమస్యకు చెక్‌పెట్టగలమని చెప్పారు.

నేరాన్ని అంగీకరించిన సోనమ్!

- పెళ్లి ఇష్టం లేకనే భర్త రాజా రఘువంశీ హత్య
- దర్యాప్తులో పాల్గొన్న ఓ పోలీసు అధికారి వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 11: హనీమూన్ హత్యకేసులో నిందితురాలు సోనమ్ పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. భర్త రాజా రఘువంశీ హత్యలో తన ప్రమేయం ఉందని సోనమ్ ఒప్పుకొన్నట్లు ఓ పోలీసు అధికారి వెల్లడించారు. షిల్లాంగ్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు సోనమ్ పథకం ప్రకారమే వెనుకబడిపోయిందని, రాజా రఘువంశీ కోసం కొండపైన అప్పటికే కాపు కాసి ఉన్న మిగతా ముగ్గురు నిందితులు అతన్ని కత్తితో పొడిచి చంపేశారని వివరించారు. హత్యకు ముందు సోనమ్ 'అతన్ని చంపేయండి' అంటూ నిందితులను ప్రోత్సహించిందని పేర్కొన్నారు. రఘువంశీతో పెళ్లి సోనమ్‌కు ఇష్టం లేదని, ఆమెకు అప్పటికే రాజ్ కుశ్వాహాతో ప్రేమలో ఉందని వివరించారు. ఈ కేసులో సోనమ్‌తో పాటు మిగతా నిందితులను బుధవారం పోలీసులు షిల్లాంగ్ తీసుకువెళ్లారు. కాగా, షిల్లాంగ్ కోర్టు సోనమ్, మిగతా నిందితులకు 8రోజుల పోలీసు కస్టడీ విధించింది. మరోవైపు, సోనమే హత్యకు కుట్ర పన్నిందని ఆమె సోదరుడు గోవింద్ తేల్చి చెప్పాడు. గోవింద్ బుధవారం రాజా రఘువంశీ కుటుంబసభ్యులను కలిసి ఓదార్చాడు. న్యాయపోరాటంలో వారికి అండగా ఉంటానన్నాడు. సోనమ్‌కు రాజా రఘువంశీతో పెళ్లి ఇష్టం లేదని, రాజ్ కుశ్వాహాను పెళ్లి చేసుకుంటానని ఆమె ముందే తన తల్లితో చెప్పిందని, అందుకు తల్లి ఒప్పుకోలేదని రాజా రఘువంశీ సోదరుడు విపిన్ ఆరోపించాడు. అప్పుడే సోనమ్.. "ఇష్టం లేని పెళ్లి చేస్తే ఏం జరుగుతుందో చూడు" అంటూ తల్లిని హెచ్చరించిందన్నాడు. ఈ విషయాన్ని సోనమ్ సోదరుడు గోవిందే తనకు చెప్పాడని పేర్కొన్నాడు.



రాజా తల్లిని ఓదారుస్తున్న గోవింద్

15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం

ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

పారిస్, జూన్ 11: ఫ్రాన్స్‌లో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ తరహా చర్యలు తీసుకోవాలని యూరోపియన్ యూనియన్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ సూచించారు. లేకుంటే కొన్ని నెలల్లో తామే ఈ నిషేధాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. తూర్పు ఫ్రాన్స్‌లోని నోజెంట్‌లో ఉన్న ఓ పాఠశాలలో 14 ఏళ్ల విద్యార్థి తన బ్యాగ్ చెక్ చేస్తున్న స్కూల్ సిబ్బందిని కత్తితో పొడిచి చంపిన ఘటన తరువాత మెక్రాన్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. పిల్లలు పర్యవేక్షణ లేకుండా డిజిటల్ వేదికలను వాడుతుండడం వల్ల వారిలో హింస పెరుగుతోందని మెక్రాన్ నొక్కి చెప్పారు.



పేదింటి కల నెరవేరిన వేళ!

కొత్త ఇంట్లోకి నిరుపేద కుటుంబం

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

తాడేపల్లి, జూన్ 11: ఒక పేదింటి కల నెరవేరింది. సీఎం చంద్రబాబు మాటతో నిరుపేద కుటుంబానికి కొత్త ఇల్లు సమకూరింది. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం పెనుమాక గ్రామం నులి కాలనీకి చెందిన పాములు నాయక్ కుటుంబం పూరి గుడిసెలో నివసించేది. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా గతేడాది జూలై 1న సీఎం చంద్రబాబు వారింటికి వెళ్లారు. ఆ సమయంలో పూరింటిని, వారి స్థితిని చూసి ఆయన చలించారు. తమకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆ కుటుంబం విన్నవించుకుంది. స్పందించిన సీఎం వీలైనంత త్వరలో పక్కా గృహాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున రూ.1.80 లక్షలు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి సుమారు రూ.12లక్షలు వ్యయం కాగా మంత్రి లోకేశ్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు తమ సొంత నిధులు సమకూర్చారు. కాగా, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస రావు, కొల్లి శేషు సమక్షంలో పాములు నాయక్ కుటుంబం బుధవారం కొత్త ఇంట్లోకి గృహప్రవేశం చేసింది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రబాబు, లోకేశ్, కొల్లి శేషుకు జీవితాంతం రుణపడి ఉంటామని నాయక్ కుటుంబీకులు పేర్కొన్నారు.



పాములు నాయక్ కుటుంబంతో గుడిసెలో చంద్రబాబు



సీఎం చంద్రబాబు మాటతో సమకూరిన కొత్త ఇల్లు

జగన్ రాజకీయ భూతం!



(మొదటి పేజీ తరువాయి)

కరెక్ట్ అని నమ్మించడం కోసమే పత్రిక, చానల్ నడుపుతున్నారు. శివలింగంపై తేలులా రాజకీయం ముసుగులో ఉండటంతో జగన్‌ను ఎదుర్కోవడంలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినా వదిలిపెట్టను. ఇలాంటి వారిని కంట్రోల్ చేయకుంటే రాష్ట్రానికి నష్టం. రౌడీలెవరూ రాష్ట్రంలో ఉండకూడదు. రాష్ట్రం నుంచి బాయ్‌కాట్ చేయాలి. జగన్‌లాంటి భూతాన్ని రాజకీయంగా భూస్థాపితం చేస్తాను. లేకుంటే రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తారు" అని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం రెండింటికీ ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. కూటమి పాలనకు ఏడాది అయిన సందర్భంగా... 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'కు చంద్రబాబు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇవీ ఆ వివరాలు...

మీరు ముఖ్యమంత్రి కావడం ఇది నాలుగోసారి. అంతకు ముందుతో పోల్చితే... ఇప్పుడు పరిస్థితి ఏమిటి?


ముఖ్యమంత్రి పదవి నాకు కొత్త కాదు. 1995లో ప్రత్యేక పరిస్థితుల్లో సీఎం అయ్యాను. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక ఇబ్బందులున్నా పాలనను గాడిలో పెట్టాను. 1999లో మళ్లీ సీఎంగా కొనసాగాను. 2014లో సీఎం అయ్యాక రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకుంటూ... విభజిత రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ప్రయత్నించాను. ఇప్పుడు... మొదటి మూడుసార్లకంటే ఊహించని, భయంకర పరిస్థితులను ఎదుర్కొని మరీ సీఎంగా బాధ్యతలు చేపట్టాను. సమస్యలన్నింటినీ జటిలం చేసి రాష్ట్రాన్ని ఒక సుడిగుండంలా తయారు చేశారు. అంతుచిక్కని అగాథంలా మార్చేశారు. దీనిని గాడిన పెట్టడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాం.

రాజధాని, పోలవరం ప్రాజెక్టులకు జరిగిన నష్టం మాటేమిటి?

ఆటోపైలట్‌లా పూర్తికావాల్సిన రాజధానికి ఎన్నో ఆటంకాలు కల్పించారు. విధ్వంసం సృష్టించారు. రాష్ట్రానికి ఆస్తిలాంటి పోలవరాన్ని పాడుపెట్టారు. 2014-19 మధ్య 70 నుంచి 80 సార్లు పోలవరంపై సమీక్షలు నిర్వహించాను. డయాఫ్రంవాల్ పూర్తి చేశాం. వైసీపీ అధికారంలోకి రాగానే కక్ష, విద్వేషం, చేతగానితనంతో వచ్చిన రోజునే కాంట్రాక్టు ఏజెన్సీని మార్చేసింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రంవాల్ దెబ్బతినింది. కేంద్ర ప్రభుత్వం నుంచి నిపుణులు వచ్చి చెబితే కానీ డయాఫ్రంవాల్ దెబ్బతినిందని తెలుసుకోలేని పరిస్థితి. రూ.450 కోట్లతో పూర్తికావాల్సిన డయాఫ్రంవాల్ వైసీపీ నిర్లక్ష్యం కారణంగా రూ.1000 కోట్లు ఖర్చు చేస్తే కానీ పూర్తికావడంలేదు. భగవంతుడు నా ద్వారానే పోలవరాన్ని పూర్తి చేయాలని సంకల్పించారు. ఎట్టి పరిస్థితుల్లో 2027 డిసెంబరు నాటికి పూర్తి చేసి తీరుతాం!

ఎన్నికల్లో ఘన విజయంతో ఒక సిక్సర్ కొట్టారు. ప్రజల కోసం మరో 'సిక్సర్' (హామీల అమలు) కొట్టాల్సి ఉంది. అది ఎప్పుడు?

సంపద సృష్టిస్తాం.. ఆదాయం పెంచుతాం.. అందరికీ పంచుతాం! ఇదే నేను చెబుతున్నా! నా వల్ల కాదని ఎప్పుడూ చెప్పను. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా. అదే నా బలం.. దటీజ్ సీబీఎన్! ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా.. చెప్పిన హామీలన్నింటినీ నెరవేర్చి తీరుతాం. ఆర్థికంగా వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని బయటికి తీసుకొచ్చాం. పేదలకు పింఛను రూ.4వేలకు పెంచాం. గత ప్రభుత్వం ఇవ్వకుండా నిలిపివేసిన 80వేల మంది వితంతువులకు మా ప్రభుత్వం పింఛన్లు ఇచ్చింది. మా ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా... గురువారం 'తల్లికి వందనం' డబ్బులను విద్యార్థుల తల్లుల ఖాతాలో వేస్తున్నాం. బడికి వెళ్లే పిల్లలందరికీ ఇది వర్తిస్తుంది. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులకు మాత్రం... అడ్మిషన్లు పూర్తి అయిన వెంటనే డబ్బులు జమ చేస్తాం.



జగన్ చేసిన విధ్వంసం...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో నా తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు నేను చేసిన పనులను కొనసాగించారు. లేదా.. నిలిపివేశారు. కానీ, విధ్వంసం చేయలేదు. వైసీపీ మాత్రమే ఇలాంటి విధ్వంసం చేసింది. రాష్ట్రానికి మంచి నాయకుడు ఉండటం ఎంత అదృష్టం! జగన్ లాంటి శాడిస్ట్ లేదా భూతాలు రావడం రాష్ట్రానికి దురదృష్టం! 2019లో మేం అధికారంలో నుంచి దిగిపోయే నాటికి 13.5 శాతం అభివృద్ధి నమోదైంది. వైసీపీ పాలన ఫలితంగా అది 10 శాతానికి పడిపోయింది. వారి పాలన సక్రమంగా ఉంటే 7 లక్షల కోట్ల రూపాయల జీడీపీ పెరిగి ఉండేది. అది జరగకపోవడంతో రాష్ట్రం వెనుకబడిపోయింది.

ఇదీ మా విధానం...

కేంద్రం సాయం చేస్తుంది కదా అని బ్లాక్‌మెయిల్ చేయడం మా విధానం కాదు. నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, ఎన్డీయే ఇలా అన్నింటిలోనూ టీడీపీ భాగస్వామిగా ఉంది. కానీ ఏనాడూ బ్లాక్‌మెయిల్ విధానాలకు పాల్పడలేదు. అదే మా విశ్వసనీయత.

ఈనెల 20న 'అన్నదాత సుఖీభవ' కింద నిధులు ఇస్తాం. ఆగస్టు 15న ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తాం. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నాం. వారికి నిరుద్యోగ భృతిపై వర్కౌట్ చేస్తున్నాం. ఆడబిడ్డ నిధి పేరుతో మహిళలకు ఇస్తామన్న నెలకు రూ.1500ను పీ4 పథకంతో అనుసంధానించి అమలు చేసే ప్రయత్నం మొదలుపెట్టాం. ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఇచ్చే డబ్బులతోపాటు ప్రభుత్వం కూడా ఆడబిడ్డ నిధి కింద సాయం చేస్తుంది.

గత ప్రభుత్వ హయాంలో రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయి. 'కనెక్టివిటీ'పై దృష్టి సారిస్తారా?

ఏపీని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దాలంటే రోడ్, పోర్టు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ఎంతో ముఖ్యం. మనకు 1000 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. 20 పోర్టులు నిర్మించుకునే అవకాశం ఉంది. ఆ దిశగా దృష్టి పెట్టాం. సుమారు 14 ఎయిర్‌పోర్టులు నిర్మించుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. పంచాయతీరాజ్ రోడ్లను అభివృద్ధి చేయడానికి లాజిస్టిక్ కార్పొరేషన్ ద్వారా నిధులు సమకూరుస్తున్నాం.

మీ ఆలోచనలు భారీగా ఉంటాయి. చిన్న రాష్ట్రానికి 14 ఎయిర్‌పోర్టులు అవసరమా? ఇంత భారీ ఎత్తున రాజధాని అవసరమా... అనే అభిప్రాయాలపై మీరు ఎలా స్పందిస్తారు?

మౌలిక సదుపాయాలే ప్రజల ఆస్తి. వాటిని పెంచుకుంటే ఆదాయం పెరుగుతుంది. అమెరికాలో సుమారు 350 విమానాశ్రయాలు ఉన్నాయి. దానితో పోల్చుకోలేకపోయినా భవిష్యత్తులో ఇంటర్ కనెక్టివిటీ అనేది చాలా ప్రాముఖ్యం వహిస్తుంది. గమ్యస్థానాలకు ఎంత త్వరగా చేరుకోవాలని ఆలోచించే వారు ఉంటారు. అప్పటికప్పుడు విమానాశ్రయాలను, రాజధానిని నిర్మించుకోలేం. దూరదృష్టితో ఆలోచిస్తే రాబోయే రోజుల్లో వాటి అవసరాన్ని గుర్తిస్తే వాటి ప్రాధాన్యం తెలుస్తుంది. నేను హైటెక్ సిటీ ఆలోచన చేసినప్పుడు చాలా విమర్శలు వచ్చాయి. ఐటీ పాలసీలో నేనూ భాగస్వామిని. అప్పట్లో దానిపైనా విమర్శలు వచ్చాయి. ఇప్పుడు హైటెక్ సిటీతో హైదరాబాద్ అత్యధిక తలసరి ఆదాయం కలిగిన నగరంగా రూపుదిద్దుకుంది. ఐటీ పాలసీతో సెల్‌ఫోన్ విప్లవం వచ్చింది. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు కూడు పెడతాయా అని నాడు విమర్శించిన వారు నేడు ఏమంటారు? ముందుచూపు లేని వారే విమర్శలు చేస్తారు. వారి అజ్ఞానాన్ని, చేతగానితనాన్ని విమర్శ రూపంలో ప్రదర్శిస్తారు.

దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు వరుస విజయాలతో స్థిరంగా ఉంటున్నాయి. టీడీపీ ఎందుకు స్థిరంగా కొనసాగలేకపోతోంది?

1995, 1999లో టీడీపీ ప్రభుత్వాలు కొనసాగాయి. దాని వల్ల మంచి ఫలితాలు కనిపించాయి. గుజరాత్‌లో స్థిరమైన ప్రభుత్వం వల్ల ఫలితాలు కనిపిస్తున్నాయి. ఏదైనా పాలసీ అమలు చేయాలంటే సుస్థిర ప్రభుత్వాలు ఉండాలి. నేను రాష్ట్ర ప్రజలకు కూడా అదే చెబుతున్నా! రాష్ట్రాభివృద్ధిని మరోసారి వైకుంఠపాళిలోని పాము నోట్లో పెట్టొద్దని కోరాను.. ఇప్పుడూ కోరుతున్నాను. ఒక్కోసారి ప్రజలకు సరిగ్గా చెప్పడంలో నేను విఫలమవుతుంటాను. ప్రజలకు ఏదో చేయాలన్న తపనతో రాజకీయాన్ని వదిలేస్తుంటాను. దాని ఫలితం 2019లో చూశాం!

జగన్ అరాచక శక్తి!.. బరితెగింపు మాటలు, చేష్టలు

నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో చాలా మంది రాజకీయ నాయకులను చూశాను. వారందరితో సిద్ధాంతపరంగా పోరాడానే తప్ప ఎప్పుడూ వ్యక్తిగతంగా పోలేదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గతంలో రాజకీయ నాయకులు నేరగాళ్లను కలవాలంటేనే భయపడేవారు. ఇప్పుడు నేరగాళ్లే రాజకీయాలు చేస్తున్నారు. బాబాయ్‌ని చంపేసి సీఎంనే ముద్దాయి అంటున్నారు. ఎలాంటి నేరమనస్తత్వం ఉన్న వాళ్లు రాజకీయాలు చేస్తున్నారో అర్థం చేసుకోండి. వివేకా చనిపోయిన రోజు జగన్ చానల్‌లో గుండెపోటు అని వస్తే అదే నిజమని నమ్మాం. వివేకా కుమార్తె సునీత పోస్టుమార్టం కోరడంతో గుండెపోటు గొడ్డలిపోటుగా వెలుగులోకి వచ్చింది. ఆ వెంటనే నింద నాపై వేసి వారి పత్రికలో 'నారాసుర రక్త చరిత్ర' అంటూ రాసుకొచ్చారు. కోడికత్తి, గులకరాయి డ్రామాలు.. బాబాయ్‌ను చంపి మరొకరిపై నింద వేయడం! ఇలాంటి వ్యక్తులతో రాజకీయం చేస్తున్నామన్న ఆవేదన.. కోపం కలుగుతోంది. అలాంటి వ్యక్తులు రాజకీయాలకు అనర్హులు. మావాళ్లు ఒకరు జగన్ సతీమణిని దూషిస్తే వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాం. తప్పు చేసిన వారిని ఎవ్వరినీ క్షమించేది లేదు అన్న సంకేతాన్ని ప్రజల్లోకి పంపాం. కానీ... జగన్ మనుషులు అమరావతి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే నాలుగు రోజులైనా వారిలో పశ్చాత్తాపం లేదు. పైగా రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. దాడులు చేస్తున్నారు. పొగాకు రైతుల కోసమని పొదిలి వెళ్లారు. దానికి 10-15వేల మందితో హడావిడి అవసరమా? రైతుల కోసం వెళ్లి పోలీసులు, మహిళలపై దాడులు చేయడం ఏమిటి? అంటే.. 'నేను రౌడీయిజం చేస్తా! నా ఇష్టం వచ్చినట్లు దాడులు చేస్తా!' అని చెప్పడమేనా? తెనాలి విషయంలోనూ అలాగే వ్యవహరించారు. గంజాయిబ్యాచ్‌ను పరామర్శించడం ఏమిటి? అమ్మ .. ఆలికి తేడా లేకుండా ప్రవర్తించే గంజాయి బ్యాచ్ విషయంలో అలాగేనా ప్రవర్తించేది. గంజాయి తాగి, అశ్లీల చిత్రాలు చూసి అమ్మాయిలను వేధించే వారికి అండగా ఉంటామన్న సంకేతాలను ఓ మాజీ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి పంపుతున్నాడంటే కండకావరం తప్ప మరొకటి కాదు. జగన్ బరితెగింపు మనస్తత్వానికి నిదర్శనం.


2019లో ఘోర ఓటమికి కారణాలు ఏమనుకుంటున్నారు?

ప్రత్యర్థి చేసిన దుష్ప్రచారాన్ని సరిగ్గా అడ్డుకోలేకపోవడం, యుద్ధం చేయాల్సిన కార్యకర్తలను సమాయత్తం చేయలేకపోవడమే ప్రధాన కారణాలు. మా కార్యకర్తలకు కోపం వస్తే ఎక్కడికీ పోరు. కానీ, అలిగి ఇంట్లో ఉండిపోతారు. దాని ఫలితం 2019 ఎన్నికల్లో చూశాం. ఈసారి అటు రాష్ట్ర ప్రజలతోపాటు పార్టీ కార్యకర్తల కోసం పనిచేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న రూ.2.66 లక్షల తలసరి ఆదాయాన్ని 2047నాటికి రూ.54 లక్షలకు చేర్చే లక్ష్యంతో పని చేస్తున్నాం. 2019లో 13.5 శాతం అభివృద్ధి నమోదైతే దాన్ని 15 శాతం లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం.

బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో అవగాహన పెట్టుకున్నాం. ఆరోగ్య, విద్య, వ్యవసాయ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ సాంకేతికతను బిల్‌గేట్స్ ఫౌండేషన్ రాష్ట్రానికి తీసుకొస్తుంది. దాన్ని ఇక్కడ అమలు చేసి వారికి 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్'గా రాష్ట్రాన్ని చూపిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సుమారు 500 సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎవ్వరూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అవసరం లేకుండా చేస్తున్నాం. ఇదంతా రాష్ట్రం కోసం చేస్తున్నాం. అదే సమయంలో పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం.

ఈసారి అధికారం చేపట్టిన తర్వాత '1995 సీబీఎన్‌'ని చూస్తారని చెబుతూ వచ్చారు. సీబీఎన్ 4.0 చూపిస్తున్నారా?

1995లో అధికారయంత్రాంగాన్ని గాడిన పెట్టేందుకు ఆకస్మిక తనిఖీలు చేసే వాడిని. పాలన విషయంలో కఠినంగా వ్యవహరించేవాడిని. ఇప్పుడు కూడా ఆకస్మిక తనిఖీలు చేపడతాను. అయితే ఇప్పుడు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు చాలా మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. దాన్ని అధికారులకు చెప్పి సరిదిద్దుకోమని చెబుతున్నాం. అప్పటికీ వినకపోతే 1995 సీబీఎన్‌ని చూపిస్తాను.



జగన్ మళ్లీ అధికారంలోకి రాడు అని చెప్పగలరా?

జగన్‌కు మళ్లీ అధికారం ఇవ్వకూడదని ప్రజలను కన్విన్స్ చేయగలనన్న నమ్మకం నాకుంది. కులమతాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. మనం మన బిడ్డకు పెళ్లి చేయాలంటే ఎన్ని రకాలుగా ఆలోచిస్తాం. రాష్ట్రానికి పాలకుడిని ఎన్నుకునే సమయంలోనూ అదే విధంగా ఆలోచించాలి. రాష్ట్రాభివృద్ధి విషయంలోనూ అలాంటి జాగ్రత్తలే తీసుకోవాలి. విధ్వంస పాలన వద్దనుకునే... 2024లో కూటమికి 93 శాతం స్ట్రైక్ రేటుతో విజయాన్ని కట్టబెట్టారు. దాన్నే కొనసాగించాలని ప్రజలను కోరుతున్నాను. నేను అభివృద్ధి యజ్ఞం చేస్తున్నాను. దానికి ప్రజల సహకారం కోరుతున్నాను.

కొంత మంది ఎమ్మెల్యేల అవినీతిపై....

అందరూ అలాంటి వారు ఉండరు. కొందరు ఉంటారు. వారందరికీ నేను ఒక్కటే చెబుతున్నా. ఎవ్వరూ వైసీపీని ఆదర్శంగా తీసుకోవద్దు. '1995 సీబీఎన్' అని అందుకే చెబుతున్నా. నేను రాష్ట్రాభివృద్ధి కోసం యజ్ఞం చేస్తుంటే దానికి విఘాతం కలిగించే వారిని ఉపేక్షించను. అవసరమైతే అలాంటి వారిని వదులుకునేందుకూ సిద్ధం.

మీ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నాం. పేదరికం లేని సమాజాన్ని చూడాలన్నది నా జీవితాశయం. పేదవారు మరింత పేదవారిగా.. కోటీశ్వరులు మరింత కోటీశ్వరులుగా మారుతున్నారు. ఈ పరిస్థితి నుంచే పీ4 ఆలోచన పుట్టింది. సమాజంలో అత్యున్నత స్థానంలో ఉన్న వారు అట్టడుగునున్న 20 శాతం పేదలను అక్కున చేర్చుకుని వారి అభ్యున్నతికి కృషి చేయాలి. నేటి బంగారు కుటుంబాలు భవిష్యత్తులో మార్గదర్శులుగా మారాలి. ఇదే నా ఆలోచన.. ఆశయం.

లక్ష కోట్లు...

ఆర్థిక సంస్కరణతో భారీ ప్రాజెక్టుల ఆలోచనకు శ్రీకారం జరిగింది. గతంలో లక్ష కోట్ల ప్రాజెక్టులు ఊహకే అందేవి కావు. ఇప్పుడు ఏపీలోనే లక్ష కోట్లపైచిలుకు ప్రాజెక్టులు చాలా వస్తున్నాయి. ఆర్సెలార్ మిట్టల్ తొలి దశలో లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతోంది. రెండో దశలో 50వేల కోట్ల రూపాయలు పెడుతోంది. ఈ రెండు దశలు పూర్తయితే మరో స్టీల్ సిటీ రాష్ట్రానికి వస్తుంది. ఎన్టీపీసీ గ్రీన్ ప్రాజెక్టు విలువ లక్షా యాభైవేల కోట్ల రూపాయలు! బీపీసీఎల్‌తోపాటు మరెన్నో ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయి. భవిష్యత్తు కోసం ఆలోచన చేసినప్పుడు ఇలాంటి ప్రాజెక్టులను సాకారం చేయగలం. వైసీపీ హయాంలో ఇవన్నీ ఎందుకు రాలేదు! నమ్మకం లేకే రాలేదు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని కలిగించాం. బ్రాండ్ ఇమేజ్ తీసుకురాగలిగాం.

కూటమి పార్టీల ప్రస్థానం ఎలా ఉంది?

విధ్వంస రాష్ట్రాన్ని గాడిన పెట్టాలన్న ఒకే ఒక లక్ష్యంతో పవన్, బీజేపీతో పొత్తు పెట్టుకున్నాం. కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి రావడం.. రాష్ట్రంలోనూ ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామిగా ఉండటం వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు కలుగుతోంది. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం చేయూత లభించింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాల్సిన అవసరం రాదు. విశాఖ ఉక్కును నిలబెట్టుకునే బాధ్యత ఉద్యోగులందరిపైనా ఉంది. లక్ష కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి ప్రైవేటు వ్యక్తులు లాభాలు ఆర్జిస్తున్నారు. సుమారు 20వేల ఎకరాలు.. లక్ష కోట్ల విలువైన ఆస్తులున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాలబాట పట్టించాల్సిన బాధ్యత ఉద్యోగులతోపాటు మనందరిపైనా ఉంది.

పవన్‌తో సంబంధాలు ఎలా ఉన్నాయి?



పవన్ మంచి మిత్రుడుగా సహకరిస్తున్నారు. 2014లో బీజేపీ మంత్రులు ఉన్నా ఈసారి మాత్రమే తొలిసారి సంకీర్ణ ప్రభుత్వం అనే భావనతో పాలన సాగిస్తున్నాం. అందరి సహకారంతో ఒక బాధ్యతగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నాం.



లోకేశ్‌కు పార్టీ పగ్గాలు ఎప్పుడు ఇస్తున్నారు?

పార్టీ నియమావళి అనేది ఒకటి ఉంటుంది. టీడీపీలో యువతరానికి పెద్దపీట వేస్తున్నాం. దేశంలో యువ ఎంపీలు, యువ ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉన్నది టీడీపీలోనే. కేంద్ర క్యాబినెట్‌లో యంగ్ మినిస్టర్ మా పార్టీ నుంచే ఉన్నారు. విద్యార్హతల పరంగా కూడా మా పార్టీనే ముందుంది. లోకేశ్ కార్యకర్తల సంక్షేమానికి చాలా చేస్తున్నాడు. పార్టీ నియమావళి ప్రకారం.. కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని లోకేశ్ విషయంలో నిర్ణయం తీసుకుంటాం.

భవిష్యత్తులో భువనేశ్వరి, బ్రాహ్మణి రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందా?

వారికి అలాంటి ఆలోచన లేదు.

తెలంగాణలో పార్టీ పరిస్థితి ఎలా ఉంది?

తెలుగుజాతి కోసం పెట్టిన పార్టీ టీడీపీ. తెలుగువారు ఉన్న అన్ని ప్రాంతాల్లో కచ్చితంగా టీడీపీ తన ఉనికిని చాటుకుంటుంది.

రామాయపట్నంలో బీపీసీఎల్‌కు మరిన్ని ప్రోత్సాహకాలు

▸▸ ప్రాజెక్టు పురోగతి సమీక్షకు ఉన్నతస్థాయి కమిటీ

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా రామాయపట్నం ఓడరేవు సమీపంలో భారీ పెట్టుబడులతో గ్రీన్‌ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయనున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)కు ప్రోత్సాహకాలను పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయడానికి మార్గదర్శకాల జారీ, ప్రభుత్వ ప్రోత్సాహకాల క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ ప్రాజెక్టు పనుల పురోగతి నిరంతర సమీక్షకు ఉన్నతస్థాయి కమిటీ (ప్రాజెక్టు అమలు యూనిట్- పీఐయూ)ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర పరిశ్రమలశాఖ కమిషనర్/ డైరెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖలకు చెందిన 16 మంది ఉన్నతాధికారులు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఈ హైలెవెల్ కమిటీ ప్రతినెలా సమావేశమవుతుంది. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు వద్ద ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ ప్లాంట్‌కు అనుమతులను సులభతరం చేయడానికి పీఐయూను ప్రభుత్వం పునర్నియమించింది. ఆర్ అండ్‌బీ చీఫ్ ఇంజినీర్, ఇంధనశాఖ డిప్యూటీ సెక్రటరీ, వాణిజ్య పన్నుల శాఖ ప్రతినిధి ఇందులో సభ్యులు.

కృష్ణంరాజు అరెస్టు!

అమరావతిపై అసభ్య వ్యాఖ్యల కేసులో పోలీసుల అదుపులోకి

విశాఖపట్నం/గుంటూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జగన్ చానల్ డిబేట్‌లో అమరావతి ప్రాంత మహిళలను తీవ్రంగా కించపరుస్తూ దారుణ వ్యాఖ్యలు చేసిన కేసులో ఏ1, సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో కృష్ణంరాజు పార్చునర్ వాహనంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వస్తున్నట్టు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారులు విజయనగరం పోలీసులతో పాటు విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీని అప్రమత్తం చేశారు. కృష్ణంరాజు ప్రయాణిస్తున్న కారు విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి దాటి విశాఖపట్నం జిల్లా భీమిలి మండల పరిధిలోని అమనాం జంక్షన్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడ మాటువేసిన భీమిలి పోలీసులు ఆ వాహనాన్ని ఆపి, అందులో ఉన్న కృష్ణంరాజుతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తుళ్లూరు పోలీసులకు అప్పగించారు. దీంతో కృష్ణంరాజును రోడ్డుమార్గంలో బుధవారం రాత్రికి నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాక్షి టీవీ చానల్‌లో ఈ నెల 6న నిర్వహించిన డిబేట్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డ మహిళలు.. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తున్నారు. ఈ క్రమంలోనే తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో దళిత మహిళ కంభంపాటి శిరీష ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇది తెలుసుకున్న కృష్ణంరాజు అజ్ఞాతంలోకి వెళ్లడంతో ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ఈ కేసులో ఏ2గా ఉన్న యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు రిమాండ్‌లో ఉన్నారు.



అమరావతి పనుల పునఃప్రారంభం సందర్భంగా మోదీ ఆవిష్కరించిన పైలాన్

పల్లెలకు పండగ

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీల్లో అభివృద్ధి పనులకు రూ.990 కోట్ల నిధులను కేటాయించారు. రూ.4500 కోట్లతో గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి వెలుగులు పూయించారు.
- పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం 884 కిలోమీటర్ల సిమెంట్లు రోడ్లు వేసింది. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 4వేల కిలోమీటర్ల దారులు వేసి.. 'పల్లె పండుగ' చేసింది.
- 13,218 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించి ప్రపంచ రికార్డు నమోదు చేశారు.
- ఉపాధి హామీ పథకంలో భాగంగా 20వేలకుపైగా గ్రామీణ పేదలకు 'మినీ గోకులాలు' నిర్మించి ఇచ్చారు. పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో 20వేల నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు.
- పంచాయతీరాజ్‌లో 'రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ అభియాన్' అమలులో ఐదేళ్లు 26వ స్థానంలో ఉన్న రాష్ట్రం... కూటమి పాలనలో పదేళ్లలోనే రెండో స్థానంలోకి వచ్చింది.



అభివృద్ధి... పారిశ్రామిక ప్రగతి

ఐదేళ్ల విధ్వంస పాలనతో శిథిలమైన రాజధాని అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంటోంది. రాజధానిలో పనులు పునఃప్రారంభమయ్యాయి. జగన్ 'రివర్స్' ప్రయోగాలతో దెబ్బతిన్న పోలవరం ప్రాజెక్టుకు నేడు పనుల కళ వచ్చింది.

పల్లెల్లో ప్రగతి వికసిస్తోంది. రాష్ట్రానికి పెట్టుబడులు రాక మొదలైంది. 78 ప్రాజెక్టుల ద్వారా రూ.9.20 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. వీటితో 5.70 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుంది. అనకాపల్లి జిల్లాలో రూ.1.85 లక్షల కోట్లతో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు, శ్రీసిటీలో రూ.5వేల కోట్లతో ఎల్‌జీ



ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు, రూ.65 వేల కోట్లతో రిలయన్స్ కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లకు శంకుస్థాపన జరిగింది. అనకాపల్లిలో రూ.1.35 లక్షల కోట్లతో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రానుండగా, రామాయపట్నంలో రూ.96,862 కోట్లతో బీసీపీఎల్ రిఫైనరీ ఏర్పాటు కానుంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే 42 చోట్ల పనులు ప్రారంభం అయ్యాయి.

ఏడాది సంబరం!

కూటమి కొలువు తీరి నేటికి సంవత్సరం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల విధ్వంసానికి తెరపడి... బంగారు భవిష్యత్తు దిశగా అడుగులు పడి... నేటికి ఏడాది! జగన్ విధ్వంస పాలనకు జనం చరమ గీతం పలికి... కొత్త ఆశలు రేకెత్తిస్తూ కూటమి సర్కారు కొలువుదీరి నేటికి సరిగ్గా ఏడాది! మూడు ముక్కలాటలో... ముడుపుల యావలో... అరాచకాల అజెండాతో విసిగి వేసారిన 'ఆంధ్రప్రదేశ్' భవిష్యత్తుపై ఆశలు చిగురించిన రోజిది! ఎన్నికల్లో 'సూపర్ హిట్' కొట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2024 జూన్ 12న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జగన్ పాలన జరిగిన ఐదేళ్లలో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కి పోయింది. ఆ విధ్వంసాన్ని సరిదిద్ది... రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు సర్కారు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ అజెండాతో అడుగులు వేస్తోంది. ఈ ఏడాదిలో కూటమి సర్కారు సాధించిందేమిటి? ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రయాణం ఎలా సాగుతోంది?

'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న సమగ్ర విశ్లేషణాత్మక కథనం...

తొలగిన భయాలు

గత వైసీపీ పాలకులు అహేతుక విధానాలు, అరాచక చట్టాలతో ప్రజలను బెంబేలెత్తించారు. అందులో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రధానమైనది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేశారు. ప్రజలకు భారంగా మారిన చెత్తపన్ను రద్దు చేశారు. జె-బ్రాండ్లకు చెల్లుచీటి రాసి నాణ్యమైన మద్యం అందుబాటులోకి తెచ్చారు. జీతాలు ఎప్పుడు పడతాయో అనే టెన్షన్ పోయింది. 1న ఠంచనుగా జీతాలు వేస్తున్నారు.

కేంద్ర పథకాలకు 'ప్రయోజనం'

వైసీపీ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించక పోవడంతో ఆగిన కేంద్ర ప్రాయోజిత పథకాలన్నీ మళ్లీ మొదలయ్యాయి. రూ.14,497 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసి... 82 కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం పోతూ పోతూ 1.37 లక్షల కోట్లబిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఇందులో కూటమి సర్కారు రూ.20వేల కోట్లు చెల్లించి చిన్న కాంట్రాక్టర్లు, సప్లయర్లను ఆదుకుంది.

బూతులకు చెక్...

వైసీపీ ఐదేళ్లూ... బూతులు రాజ్యమేలాయి. నాడు మంత్రులు మొదలు ఎమ్మెల్యేల వరకు బూతులు మాట్లాడటంలో పోటీలు పడేవారు.బూతులు మాట్లాడిన వాళ్లకే ప్రాధాన్యం. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. సొంత పార్టీ వారైనా సరే... నోటికి వచ్చినట్టు మాట్లాడిన వాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారు. చేబ్రోలు కిరణ్‌కుమార్ అరెస్టే దీనికి నిదర్శనం.



నరక దారులకు నగిషీలు

వైసీపీ హయాంలో రోడ్లు నరకానికి దారులుగా మారాయి. తట్టెడు మట్టి కూడా పోయకపోవడంతో రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. కూటమి అధికారంలోకి రాగానే....రోడ్లపై గుంతలు పూడ్చే పనులు చేపట్టింది. ఏడాది కాలంలో రూ.1800 కోట్లు ఖర్చు చేసి 26వేల కిలోమీటర్ల రోడ్లు బాగు చేశారు. 1700ల కిలోమీటర్ల స్టేట్ హైవేలను పీపీపీ విధానంలో అభివృద్ధి, విస్తరణకు ఆమోదం తెలిపారు.

మరకలూ ఉన్నాయి...



వైసీపీ హయాంలో సెంటు స్థలం పేరుతో పేదలను మభ్యపెట్టారు. నివాసయోగ్యం కాని స్థలాలను అంటగట్టి నాటి పాలకులు చేతులు దులిపేసుకున్నారు. టీడీపీ హయాంలో పూర్తి చేసిన ఇళ్లనూ లబ్ధిదారులకు ఇవ్వకుండా పెండింగ్ పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఇళ్లు ఇస్తారని చాలామంది పేదలు ఎదురుచూస్తున్నారు. ఆ దిశగా చర్యలు లేకపోవడంతో వారిలో అసంతృప్తి నెలకొంది. టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

- ఉద్యోగాల కల్పన, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం వంటి కీలక అంశాల్లో గణనీయమైన పురోగతిని ప్రజలు ఆశిస్తున్నారు.
- పలు హామీల అమలులో జాప్యంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.
- కూటమి సర్కార్‌లోని కొందరు మంత్రులు చేస్తున్న అవినీతి పనులు.. ప్రభుత్వంపై వ్యతిరేకతకు కారణమవుతున్నాయి. చాలా మంది ఎమ్మెల్యేల తీరు కూడా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ఉంది.

రాష్ట్ర సంకల్పం.. కేంద్ర సహకారం

ఎన్డీయేలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉండటంతో... రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తోంది. ఈ పరిస్థితులను చంద్రబాబు పూర్తిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారు.

- రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,400 కోట్లు సాధించారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలకు కేంద్రం రూ.5వేల కోట్లు కేటాయించింది.
- విశాఖకు రైల్వే జోన్ మంజూరు చేయడంతోపాటు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూసింది.
- రూ.72వేల కోట్ల హైవే ప్రాజెక్టులు.. రూ.70 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టు పనుల్లో పురోగతికి కేంద్రం పచ్చజెండా ఊపింది.
- రూ.2245 కోట్లతో అమరావతికి 57 కిలోమీటర్ల రైల్వే లైను మంజూరు చేసింది.
- చెప్పిన మాట...ఇచ్చిన హామీ!
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి సర్కారు ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది.
- వృద్ధాప్య, వికలాంగ పింఛన్ల పెంపు హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసింది. ప్రతి నెలా 64లక్షల మందికి రూ.2720 కోట్లు పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తోంది.
- 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రస్తుతం ఆ నియామక పరీక్షలు జరుగుతున్నాయి.
- దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తోంది. ఇప్పటికి కోటి సిలిండర్లు డెలివరీ చేయగా, తొలి ఏడాది రూ.2684 కోట్లు ఖర్చు చేశారు.
- మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేశారు. 'మత్స్యకారుల సేవ'లో పథకం ద్వారా రూ.20వేల ఆర్థిక సాయం కింద రూ.259 కోట్లు ఇప్పటికే అందజేశారు.



- రాష్ట్రవ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. మరో 61 అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.
- దీంతోపాటు 21 ప్రధాన దేవాలయాల్లో నిత్య అన్నదాన పథకాన్ని తీసుకొచ్చారు.
- ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చారు.
- ఈ నెలలోనే 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని కూడా అమలు చేయనున్నారు.
- 'ఏడాది పండగ' సందర్భంగా గురువారం 'తల్లికి వందనం' నిధులు అమ్మల ఖాతాల్లో జమ చేస్తున్నారు.
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలులోకి రానుంది.



ఏడాదిలో మెరుపులు ఇవీ..

- వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా 350 రకాల పౌర సేవలకు శ్రీకారం చుట్టారు. తద్వారా సామాన్యులు కార్యాలయాల చుట్టూ తిరిగే బాధను తగ్గించి, పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేశారు.
- గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర పథకాలను పక్కదారి పట్టించారు. కూటమి అధికారంలోకి రాగానే 94 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 73 పథకాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.
- కూటమి అధికారం చేపట్టిన తర్వాత ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లో బీసీల కోసం రూ.47456 కోట్లు కేటాయించి బీసీల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకున్నారు. దీంతోపాటు దేవాలయాల్లో నాయి బ్రాహ్మణుల వేతనాలను రూ.25వేలుకు పెంచారు.
- చేనేతలకు జీఎస్టీ ఎత్తివేశారు. పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్‌ల్యూమ్స్ 200 యూనిట్లకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నారు. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయించడంతోపాటు స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు.
- టీచర్లకు మేలు చేసేలా 117 జీవో రద్దు చేయడంతో పాటు యాప్‌ల భారం తొలగించారు.
- ఉద్యోగులకు ఏడాది కాలంలో రూ.7500 కోట్లు వివిధ మొత్తాల కింద విడుదల చేశారు. పోలీసులకు రూ.213 కోట్ల సరెండర్ లీవుల సొమ్ము విడుదల చేశారు. అంగన్వాడీలు, ఆశాలకు రూ.1.5 లక్షల మేర లబ్ధి చేకూరేలా గ్రాట్యుటీ అమలు చేస్తున్నారు.
- యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్రంలో 5 చోట్ల రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. విశాఖలో టీసీఎస్‌తో ఒప్పందం చేసుకుని భూమి కేటాయించారు. అమరావతిలో ప్రతిష్టాత్మక క్వాంటం వ్యాలీకి భూములు కేటాయించారు.
- రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. రైతులకు మళ్లీ 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాల పంపిణీ పథకం ప్రారంభించారు. పాడి రైతుల కోసం రూ.2 లక్షల సబ్సిడీతో షెడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు.



ఏరువాకలో నాగలి పట్టిన మంత్రి

ఏరువాక పౌర్ణమి వేడుకలను ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా రైతులు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సారి వేడుకల్లో మంత్రి నిమ్మల కూడా పాలుపంచుకున్నారు. రైతులతో ముచ్చటించి వారి కష్టాలు తెలుసుకున్నారు. ఆయన స్వతహాగా రైతు కావడంతో తడకనపల్లెలో కాసేపు నాగలి పట్టి కాడెద్దులతో పొలం దున్నారు.

బనకచర్లతో సీమ సస్యశ్యామలం

- ఆ సంకల్పంతోనే చంద్రబాబు తలపెట్టారు
- గోరుకల్లు రాతిపరుపు కుంగిపోయిన పాపం జగన్‌దే: నిమ్మల
- అరక పట్టి.. పొలం దున్ని ఏరువాక సాగిన మంత్రి

కర్నూలు/పాణ్యం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుతో కరువు నేల రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆ సంకల్పంతోనే ఈ పథకాన్ని తలపెట్టారని తెలిపారు. ఇది పూర్తయితే కరువును శాశ్వతంగా నివారించవచ్చని చెప్పారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం పాణ్యం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గౌరు చరితతో కలసి వివిధ అభివృద్ధి పనులు, రహదారులను ప్రారంభించారు. గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద కుంగిపోతున్న రాతిపరుపు (స్టోన్ రివిట్‌మెంట్)ను పరిశీలించారు. కల్లూరు మండలం తడకనపల్లెలో జరిగిన సభలో పాల్గొన్నారు. 'గోరుకల్లు రిజర్వాయర్ రాతి పరుపు కుంగిపోవడానికి జగన్ పాపమే కారణం. ఆయన హయాంలో నిర్వహణ, మరమ్మతులు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. మరమ్మతుల కోసం రూ.58 కోట్లతో ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. వైసీపీ పాలనలో పింఛాడ్యాం, అన్నమయ్య డ్యాం, పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయాయి. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 41 మంది ప్రాణాలు కోల్పోయినా జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి కాలు బయటకు పెట్టలేదు. ప్రతిపక్షంలో ఉన్నా చంద్రబాబు వెళ్లి బాధితులను పరామర్శించారు. రాయలసీమకు శ్రీశైలం ప్రాజెక్టు వరప్రదాయిని. ప్లంజ్‌పూల్ మరమ్మతులకు రూ.30 కోట్లు కేటాయించాం. హంద్రీ-నీవా ప్రాజెక్టులో మోటార్లను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చేపట్టే పనులకు సీఎం రూ.3,800 కోట్లు కేటాయించారు. జగన్ ప్రభుత్వం మోటారు విద్యుత్ బిల్లులు చెల్లించలేదు. రాష్ట్ర విభజన కంటే ఆయన పాలనతోనే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ తప్పిదాలు సరిచేయడానికే సరిపోతోంది. ఏడాది పాలనలో కర్నూలు జిల్లాలో రూ.2,014 కోట్లతో 2,294 ప్రగతి పనులు చేపట్టాం' అని వివరించారు.

జల సంఘానికి బనకచర్ల నివేదిక

- సాధ్యాసాధ్యాల రిపోర్టుపై 6 రాష్ట్రాల అభిప్రాయం కోరిన సీడబ్ల్యూసీ
- పీపీఏ, కృష్ణా, గోదావరి బోర్డులను కూడా..

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూ.81,900 కోట్లతో నిర్మించతలపెట్టిన పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం సాధ్యాసాధ్యాల నివేదిక కేంద్ర జలసంఘాని (సీడబ్ల్యూసీ)కి అందింది. వాప్కోస్ రూపొందించిన ఈ ఫీజిబిలిటీ రిపోర్టును పరిశీలించి అభిప్రాయాలను వెల్లడించాలని కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులను, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)ని.. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిసా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు, రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు బుధవారం లేఖ రాసింది. గోదావరికి వరద సమయంలో రోజుకు రెండు టీఎంసీల చొప్పున 90 నుంచి 120 రోజుల పాటు 200 టీఎంసీల వరద జలాలను ఎత్తిపోయాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశమని.. 80 లక్షల మందికి తాగునీరు, మూడు లక్షల హెక్టార్లకు కొత్తగా సాగునీరు, 9.14 లక్షల హెక్టార్ల ఆయకట్టును స్థిరీకరించేందుకు తలపెట్టిన ఈ పథకం ప్రాథమిక అంచనా నివేదికను పరిశీలించి సమాధానం చెప్పాలని వాటికి విజ్ఞప్తి చేసింది. ఈ పథకం ద్వారా పారిశ్రామికావసరాలకు నీటి సరఫరాతో పాటు జలవిద్యుదుత్పత్తి కూడా చేపడతారని వాప్కోస్ తన నివేదికలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌కు గేట్‌వేగా మారనున్న ఈ అనుసంధాన పథకంతో శ్రీశైలం కుడి ప్రధాన కాలువ, గాలేరు-నగరి సుజల స్రవంతి, కర్నూలు-కుప్పం కెనాల్, సోమశిల ప్రాజెక్టు, తెలుగుగంగ ప్రాజెక్టుల ద్వారా రాయలసీమకు నీరు అందించవచ్చని వెల్లడించింది. అలాగే రాజధాని అమరావతి నగరానికి, విజయవాడ నగరానికి మంచినీటి సరఫరా చేసేందుకు సైతం ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని తెలిపింది. జలసంఘానికి గత నెల 25వ తేదీన ఫీజిబిలిటీ నివేదిక అందింది. నిశితంగా పరిశీలించాక దానిపై ఆయా రాష్ట్రాల అభిప్రాయం కోరింది.

విశాఖలో ఏవియేషన్ వర్సిటీ

- పౌర విమానయాన శాఖకు సీఎం చంద్రబాబు ప్రతిపాదన
- విజయవాడ విమానాశ్రయం పనులపై సమీక్ష

అమరావతి/న్యూఢిల్లీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖకు సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. దానికితగ్గ పరిశీలన చేయాలని కోరారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ భవనాల పనుల పురోగతిపై వెలగపూడి సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. దీనికి కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఆ శాఖ ఉన్నతాధికారులు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. విజయవాడ విమానాశ్రయం టెర్మినల్ భవనం డిజైన్‌లు అత్యంత ఆకర్షణీయంగానూ, విభిన్నంగానూ ఉండాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా ర్యాంప్ నిర్మాణం ఉండాలని సూచించారు. టెర్మినల్ భవనం ఎలివేషన్, డిపార్చర్, అరైవల్ బ్లాక్‌లు, ప్రయాణికుల లాంజ్‌లు ఇలా అన్ని నిర్మాణాల్లోనూ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా చూడాలన్నారు. కూచిపూడి నృత్యభంగిమ చిత్రాలు, కొండపల్లి బొమ్మలు, అమరావతి చిహ్నాలు, లేపాక్షి కళాకృతులతో డిజైన్‌లు రూపొందించాలని చెప్పారు. నిర్దేశిత గడువులోగా వీటిని పూర్తి చేయాలన్నారు.




సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు

అమరావతి ఎయిర్‌పోర్టుకు భూ పరిశీలన: రామ్మోహన్ నాయుడు

కడప, రాజమండ్రి టెర్మినల్ భవన నిర్మాణాలకు సంబంధించిన పురోగతిని చంద్రబాబుకు రామ్మోహన్‌నాయుడు వివరించారు. దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం జిల్లా పలాస విమానాశ్రయాల టెక్నికల్ ఫీజిబిలిటీ రిపోర్టుపై పనిచేస్తున్నామని చెప్పారు. అమరావతి విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి భూపరిశీలన జరుగుతోందని, దీనికి సంబంధించి రైట్స్ బృందం త్వరలోనే నివేదిక ఇస్తుందన్నారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ పూర్తయితే తదుపరి పనులు చేపడతామని చెప్పారు. విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు విమానాశ్రయాల నుంచి దేశంలో వివిధ నగరాలకు కనెక్టివిటీని పెంచేందుకు ఆపరేటర్లు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు అక్టోబరు నుంచి సర్వీసులను నడిపేందుకు ట్రూజెట్ సంస్థ ముందుకు వస్తోందన్నారు. మరోవైపు విజయవాడ-సింగపూర్, తిరుపతి-మస్కట్ మధ్య కూడా త్వరలోనే విమాన సర్వీసులు కూడా మొదలు కానున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం వద్ద పెట్టుబడులకు ఖతార్ ఏవియేషన్ ఎండీ సిద్ధంగా ఉన్నారని వివరించారు.

నేడే తల్లికి వందనం

- 67.27 లక్షల మంది విద్యార్థులకు 8,745 కోట్లు
- వారి తల్లుల ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం



అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో మరో కీలక పథకం అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున నిధులు విడుదల చేయనుంది. మొత్తం 67,27,164 మంది విద్యార్థుల తల్లులకు రూ.8,745 కోట్లు ఈ నెల 12న జమ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కాగా, మరుగుదొడ్ల నిర్వహణ నిధికి రూ.1,000, పాఠశాల నిర్వహణ నిధి కోసం మరో రూ.1,000 చొప్పున మినహాయించి మిగిలిన రూ.13వేలు ఖాతాలో జమ చేయాలని నిర్ణయించారు. ఈ పథకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సమీక్షించారు. అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేయాలన్నారు. పథకానికి నిధుల ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సీఎం ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన విద్యార్థులతో పాటు ఒకటో తరగతిలో, ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు కూడా పథకం అమలు చేయాలని స్పష్టం చేశారు. పథకం అమలులో ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక కారణాలతో ఎవరైనా విద్యార్థుల పేర్లు లేకపోతే దరఖాస్తుకు అవకాశం కల్పించి, నిధులు విడుదల చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వం చివరిసారిగా 2023లో 'అమ్మ ఒడి' పథకం అమలు చేసింది. అప్పట్లో 83,15,341 మంది విద్యార్థులకు సంబంధించి 42,61,965 మంది తల్లులకు రూ.6,392.94 కోట్లు విడుదల చేసింది.

తల్లులకు లోకేశ్ అభినందనలు

విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థుల తల్లులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. 'విద్యార్థులకు శుభాకాంక్షలు. అందరికీ గుడ్ న్యూస్. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న శుభవేళ తల్లికి వందనం పథకం అమలుకు శ్రీకారం చుడుతున్నాం. చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అందరికీ ఈ పథకం వర్తిస్తుంది" అని 'ఎక్స్'లో చేసిన పోస్టులో లోకేశ్ పేర్కొన్నారు.

పరామర్శకని వెళ్లి.. అరాచకమేంటి?

అనుమతులిస్తే.. అలుసుగా తీసుకుంటారా!

- మహిళలు, పోలీసులపైనే రాళ్ల దాడి చేస్తారా?
- జగన్ ఉద్దేశం రైతు సమస్యలు కాదు
- అలజడి సృష్టించి ఉనికి చాటుకునే యత్నం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం
- పొదిలి ఘటనపై చంద్రబాబు సీరియస్
- చట్టపరంగా చర్యలకు డీజీపీకి ఆదేశం


చంద్రబాబుతో సమావేశమైన డీజీపీ, పోలీసు అధికారులు

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతులకు పరామర్శ పేరుతో ప్రకాశం జిల్లా పొదిలిలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ శాంతిభద్రతల సమస్య సృష్టించారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పేరుతో పర్యటనలకు వెళ్లి ఈ అరాచకాలేమిటని నిలదీశారు. మహిళలు, పోలీసులపై రాళ్లు వేస్తారా? అని మండిపడ్డారు. దాడులకు పాల్పడిన వాళ్లపై ఆధారాలు సేకరించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను సీఎం ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర విషయంలో పరామర్శ పేరుతో బుధవారం జగన్ చేసిన రాజకీయ యాత్రలో వైసీపీ శ్రేణులు రాళ్లతో మహిళలపై దాడులకు దిగడంపై సీఎం సీరియస్ అయ్యారు. రైతుల పరామర్శకు వెళ్తే జిల్లావ్యాప్తంగా జన సమీకరణ ఎందుకు? వెళ్లింది రైతుల కోసమా? లేక దాడుల కోసమా? నా ప్రభుత్వంలో ఇలాంటి అరాచకాలకు తావు లేదు. ప్రజా సమస్యల పేరుతో జనంలోకి వెళ్లి, లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టిస్తున్నారు. ఆంక్షలు లేకుండా అనుమతులు ఇస్తుంటే.. దాన్ని అలుసుగా భావిస్తారా! అనుమతులను దుర్వినియోగం చేస్తారా? జగన్ పర్యటనలు చూస్తుంటే.. తన ఉద్దేశం రైతు సమస్యలు కాదు. అలజడి సృష్టించి ఉనికి చాటుకునే ప్రయత్నమేనని అర్థమవుతోంది. రాజకీయ ఎజెండాతో చేసే ఇలాంటి పోకడలను అంగీకరించేది లేదు' అని సీఎం స్పష్టం చేశారు. సమస్య ఉంటే నిరసన తెలపడానికి, పరామర్శకు వెళ్లడానికి అభ్యంతరం లేదని, ప్రభుత్వం ఎక్కడా అనుమతులు నిరాకరించడం లేదని తెలిపారు. కానీ, ప్రతి పర్యటనలో వాళ్లు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వాళ్లు ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి అనుమతి ఇస్తున్నాం. అలా అని రాజకీయ ముసుగులో నేరాలు చేస్తానంటే మాత్రం సహించేది లేదు. ఇలాంటి విషయాల్లో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలి. శాంతిభద్రతల సమస్య సృష్టించి, రాళ్ల దాడి చేసి, పోలీసులతోపాటు పలువురు గాయపడటానికి కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి' అని డీజీపీని సీఎం ఆదేశించారు. 'జగన్ సొంత టీవీ చానెల్‌లో మహిళల ఆత్మగౌరవం దెబ్బతినేలా నీచమైన వ్యాఖ్యలు చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా మహిళలు భగ్గుమన్నారు. ఆ వికృత వ్యాఖ్యలను, ప్రచారాన్ని అన్ని వర్గాలు ఖండించాయి. అయితే జగన్ మాత్రం ఇప్పటికీ వాటికి క్షమాపణ చెప్పకపోగా ఎదురుదాడి చేస్తున్నారు. ఇలాంటి వాళ్లు నాయకులుగా చలామణి అవుతానంటే ఎలా? ప్రజలు ఎలా అంగీకరిస్తారు? ఆడబిడ్డలు నిరసన వ్యక్తం చేస్తే.. వారిపై దాడులు చేస్తారా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యువతలో వ్యాపార నైపుణ్యాభివృద్ధి

సైయెంట్, ఏఐసీటీఈల సహకారం
లోకేశ్ సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందం


మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలతో సైయెంట్, ఏఐసీటీఈ ప్రతినిధులు

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యువతలో వ్యాపార నైపుణ్యం, స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధిలో సహకారం కోసం ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ సైయెంట్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ)తో రాష్ట్ర ప్రభుత్వం త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ సమక్షంలో బుధవారం ఉండవల్లిలోని నివాసంలో ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. నగర ఆధారిత ఇన్నోవేషన్లు, క్లస్టర్లు ప్రారంభించేందుకు సైయెంట్, ఏఐసీటీఈ సహకారం అందిస్తాయి. విశాఖపట్నం నుంచి సహకారాన్ని ప్రారంభిస్తారు. ఈ ఒప్పందంతో విద్యా సంస్థలు, పరిశ్రమలు, పెట్టుబడిదారుల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించేలా చేస్తారు. సృజనాత్మకత, పరిశోధన అంశాలపై ఐ-శేఆర్, ఐ-కేఫ్ అనే కేంద్రాలను ప్రారంభిస్తారు. క్లస్టర్ స్థాయి సదస్సులు, మార్గనిర్దేశ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఒప్పందం అమలు కోసం నోడల్ విభాగంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ పనిచేయనుంది. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు గణేశ్ కుమార్, భరత్ గుప్తా, సైయెంట్ ఫౌండర్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఏఐసీటీఈ వైస్ చైర్మన్ అభయ్ జేరే, ఇతర ప్రతినిధులు పీఎస్ఎన్వీ నరసింహం, దీపన్ సాహు పాల్గొన్నారు.



మహిళలపై రాళ్లు, చెప్పులు

జగన్ పొదిలి పర్యటనలో వైసీపీ మూక అరాచకం




వేలాన్ని పరిశీలిస్తున్న జగన్
వేలం కేంద్రంలో జగన్ పరిశీలిస్తున్న సమయంలో బేళ్లపైకి ఎక్కి తొక్కుతున్న వైసీపీ శ్రేణులు


రాళ్ల దాడిలో గాయపడిన నిరసనకారుడు ఖయ్యూం

పొదిలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): శాంతియుత నిరసన చేపట్టిన మహిళలపై వైసీపీ కార్యకర్తలు అరాచక వాదులుగా విరుచుకుపడ్డారు. రాళ్ల వర్షం కురిపించారు. మహిళలనే కనీస జ్ఞానం లేకుండా చెప్పులు విసిరారు. బూతులు, దుర్భాషలతో రెచ్చిపోయారు. ఈ దాడుల్లో పలువురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. కానిస్టేబుల్ తలకు బలమైన గాయమైంది. వైసీపీ అల్లరి మూక విసిరిన చెప్పులు డీఎస్పీపైనా పడ్డాయి. దీంతో ప్రకాశం జిల్లా పొదిలిలో బుధవారం జరిగిన జగన్ పర్యటన వైసీపీ అరాచక శక్తుల దాడితో రణరంగమైంది. జగన్‌కు చెందిన సాక్షి మీడియాలో అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణించడాన్ని వ్యతిరేకిస్తూ.. ఈ వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడమే మహిళలకు శాపంగా మారింది.

అసలు ఏం జరిగింది?

మాజీ సీఎం జగన్ ప్రకాశం జిల్లా పొదిలిలో బుధవారం పర్యటించారు. అయితే.. సాక్షి టీవీ డిబేట్‌లో అమరావతి ప్రాంత మహిళలను దారుణంగా కించపరచడం పట్ల జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ స్థానిక రథం రోడ్డులో మహిళలు శాంతియుత నిరసనకు దిగారు. "జగన్ గో బ్యాక్", "మహిళలకు క్షమాపణ చెప్పని జగన్ షేమ్.. షేమ్!." అంటూ నినాదాలు చేశారు. 'సాక్షి చానల్ మాకొద్దు' అని రాసున్న ప్లకార్డులతో నిరసన తెలిపారు. అయి తే.. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ రౌడీ మూక లు రెచ్చిపోయాయి. నిరసన తెలుపుతున్న మహిళలపై రాళ్లు, చెప్పులతో విరుచుకుపడ్డారు. దీంతో భయ భ్రాంతులకు గురైన మహిళలు ప్లకార్డులు, బెలూన్లు అక్కడే వదిలేసి తలోదిక్కుకు పరుగులు తీశారు. మహిళలు పారిపోతున్నా వదిలి పెట్టకుంటా.. వైసీపీ అల్లరి మూక వెంటబడి మరీ వారిని తరుముతూ రాళ్లు రువ్వింది. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయం కాగా.. పలువురు మహిళలు కూడా గాయపడ్డారు. అయితే, ఇవేవీ పట్టనట్టుగా జగన్ తన పర్యటనను కొనసాగించారు.

అలజడి కోసమే పోరుబాట!

పొదిలి పొగాకు రైతుల సమస్యలపై 'పోరుబాట' పేరుతో జగన్ ఈ కార్యక్రమం చేపట్టినా.. వైసీపీ కార్యకర్తలు మాత్రం అలజడి సృష్టించడమే లక్ష్యంగా రెచ్చిపోయారు. తొలుత దర్శి రోడ్డులోని హెలిప్యాడ్ నుంచి పట్టణంలోని పొగాకు వేలంకేంద్రం వరకు జగన్ కారులో ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీగా వచ్చారు. ఆ సమయంలో వైసీపీ కార్యకర్తలు 'సీఎం, సీఎం' అంటూ అరుపులు కేకలతో రెచ్చిపోయారు. అదేసమయంలో రథం రోడ్డు పక్కనే కొంతమంది మహిళలు శాంతియుతంగా నిరసన తెలిజేస్తున్నారు. ప్లకారులు చూపుతూ నల్లబెలూన్లను పట్టుకొని నిరసన తెలిపారు. దానిని చూసిన వైసీపీ శ్రేణులు 'సీఎం, సీఎం' అని నినాదాలు చేస్తూ ఆవేశంతో ఒక్క ఉదుటున అక్కడకు చేరుకుని మహిళలపై విచక్షణారహితంగా దాడి చేశారు. దాడిని అడ్డుకున్న పోలీసులపైనా రాళ్లు, చెప్పులు పడ్డాయి. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జీవీ రత్నం తలకు తీవ్రగాయమైంది. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణపై అల్లరి మూకలు విసిరిన చెప్పులు పడ్డాయి. విధుల్లో ఉన్న పొదిలి సీఐ వెంకటేశ్వరరావు కూడా స్పృహతప్పి పడిపోయారు. గాయపడిన కానిస్టేబుల్‌ను వెంటనే పోలీసులు సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ దాడిలో పొదిలికి చెందిన రాజ్యలక్ష్మి, కంబాలపాడు గ్రామానికి చెందిన అలేఖ్య, పొదిలికి చెందిన అమూల్య, ఖయ్యూం అనే వారికి గాయాలయ్యాయి. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మహిళలపై అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ వైసీపీ అల్లరిమూకలు దాడి చేయటంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక పొదిలి పొగాకు వేలం కేంద్రం లోపలికి జగన్ వెళ్లిన సమయంలో కూడా ఆయన వెంట వచ్చిన వైసీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. కేంద్రం ప్రధాన గేటును తోసుకుని, పోలీసులను కూడా లెక్కచేయకుండా లోపలికి చొచ్చుకుపోయారు. వేలంలో ఉంచిన పొగాకు బేళ్లను తొక్కేశారు. 'సీఎం, సీఎం' అని కేకలు పెడుతూ అల్లరిచేయటం తప్ప రైతులను పట్టించుకోలేదని కొందరు ఆరోపించారు.

జగన్ వెంట రౌడీ మూకలు: ఎస్పీ

ఒంగోలు క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పొదిలిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై వైసీపీ మూకల రాళ్ల దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. బుధవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. మహిళలపై చెప్పులు, రాళ్లు వేయడంతోపాటు పోలీసుల విధులకు కూడా ఆటంకం కలిగించారని చెప్పారు. మాజీ సీఎం జగన్ పాల్గొన్న కార్యక్రమంలో రౌడీమూకలు ఉన్నట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. వైసీపీ నిర్వహించిన ర్యాలీలో అరాచకశక్తులు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీడియో ఫుటేజీని నిశితంగా పరిశీలిస్తున్నామని, నిందితులందరినీ గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. దాడి నేపథ్యంలో విధి నిర్వహణలో ఉన్న ఇరువురు మహిళా కానిస్టేబుళ్లు, మరో కానిస్టేబులు గాయపడ్డారని తెలిపారు. అలాగే మరో ముగ్గురు నిరసనకారులకు గాయాలయ్యాయని చెప్పారు.

రైతులను ఆదుకోవడంలో బాబు విఫలం

మా పాలన స్వర్ణయుగం.. జగన్ సెల్ఫ్‌గోల్

పొగాకు రైతులను ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. పొదిలి పొగాకు వేలం కేంద్రం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ పాలన రైతులకు స్వర్ణయుగంలా ఉందని, అదే కూటమి ప్రభుత్వంలో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని సెల్ఫ్‌గోల్ చేసుకున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇటీవల పర్చూరు, కొండపి నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. వైసీపీ పాలనలో పొగాకు క్వింటాకు రూ.36,600 అత్యధిక ధర లభించగా, ఈ ఏడాది కేవలం రూ.26 వేలు మాత్రమే లభించడం ఈ ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. మార్కెట్ సానుకూలంగా ఉంటుందని రైతులను పొగాకు బోర్డు అధికారులు మభ్యపెట్టారన్నారు. "ఈ రోజు నేను పర్యటనకు వస్తున్నందున రూ.28 వేల అత్యధిక ధర ఇచ్చారు. అదే విధంగా ప్రతిరోజు ధరలు కల్పించాలి." అని డిమాండ్ చేశారు. మిర్చి రైతులను ఆదుకోవడంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. రూ.11,700లకు మిర్చిని కొనుగోలు చేస్తామని చెప్పిన చంద్రబాబు మాటతప్పారన్నారు.

క్వింటాళ్లకు, కిలోలకు తేడా తెలీదా!

గణాంకాలు వివరించడంలో జగన్ గజిబిజి అయ్యారు. పొగాకు క్వింటాకు రూ.36,600 తన ప్రభుత్వంలో దక్కిందని చెప్పే సందర్భంలో తడబడి కేజీ రూ.36,600లు పలికిందన్నారు. ఈ ఏడాది పొగాకు బోర్డు అధికారికంగా 11 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించగా 220 మిలియన్ క్వింటాళ్లు పండించారంటూ మాట్లాడటం ఆయన అవగాహన లేమిని వెల్లడించింది. తమ ప్రభుత్వంలో రూ.3 వేల కోట్లతో స్థిరీకరణ నిధి ఏర్పాటుచేసి కేంద్రం ప్రకటించిన పంట ఉత్పత్తులనే కాకుండా టమోటా, పసుపు, మిర్చికి మద్దతు ధర ఇచ్చానని చెప్పడం రైతులను అసహనానికి గురిచేసింది. కింటాళ్లకు, కిలోలకు తేడా తెలియకుండా జగన్ మాట్లాడారని రైతన్నలు పెదవి విరిచారు.

పొగాకు మొత్తం కొంటాం: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధరకు కంపెనీలతో కొనుగోలు చేయించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. జగన్ విష ప్రచారం చేస్తూ, పొగాకు రైతుల మధ్య పొగ పెట్టాలని చూస్తున్నాడని మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటన చేశారు. 'చివరి ఆకు వరకు పొగాకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. పొగాకు పంటకు బీమా పథకాన్ని పునరుద్ధరించాం. ప్రమాద బీమాను రూ.7 లక్షలకు పెంచాం. ప్రత్యేక నిధితో తక్షణ పరిహారం అందే ఏర్పాట్లు చేశాం. గ్రేడ్-ఏ రకం క్వింటా రూ.12 వేలు, గ్రేడ్-బీ రకం రూ.5,400 ధర నిర్ణయించారు. ఐటీసీ, జీపీఐ సంస్థలతో 20 వేల మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుకు ఒప్పందం చేశాం. మార్క్‌ఫెడ్ ద్వారా 75 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేపట్టాం' అని అచ్చెన్న తెలిపారు.

జగన్‌కు మహిళలపై విద్వేషం ఎందుకు?: సుజాత

వైసీపీకి ఓట్లు వేయలేదనే అక్కసుతోనే మహిళలపై జగన్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి పీతల సుజాత ఆరోపించారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'మహిళలపై జగన్‌కు విద్వేషం ఎందుకు? మహిళల్ని అవమానించిన జగన్, భారతి, వైసీపీ పేటీఎం బ్యాచ్ క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

జగన్ వికృత మనస్కుడు: లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి

కొమ్మినేని, కృష్ణంరాజు, సజ్జల లాంటి వారికి ప్రజలు బుద్ధి చెప్తారని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు హెచ్చరించారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "జగన్.. వికృత మనస్కుడు. రాష్ట్రంలో అశాంతిని రేకెత్తిస్తున్నారు" అని ఆరోపించారు.

జగన్.. ఏ మొహం పెట్టుకొని వచ్చావ్!

- నాడు పొగాకు రైతులను దగా చేశావ్
- రాజకీయాల కోసం రైతులను రెచ్చగొడతావా?
- అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు పట్టవా?
- మంత్రులు డోలా, గొట్టిపాటి ఫైర్


ఒంగోలు శివారులో ఏరువాక సందర్భంగా అరక దున్నుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఒంగోలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పొగాకు రైతులను దగా చేసి.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని వారి వద్దకు వచ్చావని రాష్ట్ర మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్‌లు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని నిలదీశారు. ఏదోరకంగా రైతులను రెచ్చగొట్టి రాజకీయం చేసేందుకే జగన్ పొగాకు వేలం కేంద్రానికి వచ్చాడని విమర్శించారు. బుధవారం ఒంగోలు శివారులోని ఒంగోలు-2 పొగాకు వేలం కేంద్రంలో.. రైతుల ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమం జరిగింది. దీనికి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్‌లతో కలిసి మంత్రులు పాల్గొన్నారు. తొలుత ఎద్దులతో అరక దున్ని ఏరువాక సాగించిన మంత్రులు, అనంతరం వేలం కేంద్రంలో కొనుగోళ్ల తీరును పరిశీలించారు. అనంతరం, పొగాకు రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ సీఎం జగన్ పొదిలిలో పొగాకు వేలం పరిశీలనకు రావడంపై మండిపడ్డారు. 'మీ ఐదేళ్ల పాలనలో ఏనాడైనా రైతుల గురించి పట్టించుకున్నారా? పొగాకు రెతులకు మేలు జరిగింది టీడీపీ ప్రభుత్వ హయాంలోనే. ప్రస్తుతం కూడా నల్ల బర్లీ రెతులు ధరలు లేక, కొనుగోళ్లు లేక ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి మంత్రుల కమిటీ ఏర్పాటు చేశారు' అని తెలిపారు. నల్లబర్లీ పొగాకు క్వింటా రూ.12వేల వంతున ప్రభుత్వం కొనుగోలుకు నిర్ణయించిందని, ఈనెల 16 నుంచి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నామని చెప్పారు. రైతులకు ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇప్పుడు రైతులను రెచ్చగొట్టి రాజకీయం చేసేందుకే జగన్ పొగాకు వేలం కేంద్రానికి వచ్చాడని మండిపడ్డారు. అమరావతి మహిళల గురించి జర్నలిస్టులు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ఖండించకుండా, ఇక్కడ రైతుల కోసం అంటూ జగన్ ఎలా వస్తాడని ప్రశ్నించారు. సమావేశంలో పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, డీసీసీబీ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

'గాలి' జైలుశిక్ష రద్దు

ఓబుళాపురం కేసులో కర్ణాటక ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డికి ఊరట

- ఆయనతోపాటు మరో ముగ్గురు నిందితులకు జైలు శిక్ష రద్దుతోపాటు బెయిల్ మంజూరు
- సీబీఐ కోర్టు తీర్పును కొట్టేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- శ్రీలక్ష్మి కేసులో కౌంటర్‌కు సీబీఐకి ఆదేశాలు
- తీర్పుతో గాలి శాసనసభ సభ్యత్వం పునరుద్ధరణ!



హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో దోషిగా తేలిన కర్ణాటక మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డికి సీబీఐ కోర్టు విధించిన జైలుశిక్షను తెలంగాణ హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. గాలితోపాటు మిగతా ముగ్గురు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు ఇచ్చిన ఈ మధ్యంతర తీర్పుతో కర్ణాటక శాసనసభ సభ్యుడిగా గాలి జనార్దన్‌రెడ్డి సభ్యత్వం పునరుద్ధరణ జరగనుంది. ఓఎంసీ కేసులో బెయిల్ ఇవ్వడంతోపాటు జైలుశిక్షను రద్దు చేయాలంటూ గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, వీడీ రాజగోపాల్, మెహూజ్ అలీఖాన్, ఓఎంసీ కంపెనీ వేర్వేరు క్రిమినల్ అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టి బుధవారం తీర్పు వెలువరించింది. నిందితులందరికీ బెయిల్ మంజూరు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అలీఖాన్ రూ.పది లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, సీబీఐ కోర్టు నిర్దేశించిన మొత్తానికి ఇద్దరి పూచీకత్తులు సమర్పించాలని పేర్కొంది. రాజగోపాల్ రూ.ఒక లక్ష వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని తెలిపింది. నిందితులెవరూ హైకోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, ఎలాంటి క్రిమినల్ చర్యల్లో భాగస్వాములు కారాదని షరతులు విధించింది. ఇక ఈ కేసులో ప్రధాన పిటిషన్లు ఆగస్టులో విచారణకు రానున్నాయి. ఓబుళాపురం కేసులో సీబీఐ కోర్టు గత నెల 6న తీర్పునిచ్చింది. గాలి జనార్దన్‌రెడ్డితోపాటు మరో ముగ్గురిని దోషులుగా నిర్ధారిస్తూ ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. కాగా, ఇదే కేసులో నిందితురాలిగా ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ (డిశ్చార్జి) పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిప్పి పంపి నెలరోజులు అవుతున్నా.. ఎందుకు ఆలస్యమైందని సీబీఐని ప్రశ్నించింది. ఈ పిటిషన్‌ను మూడునెలల్లో పరిష్కరించాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు స్పష్టమైన గడువు నిర్దేశించినా కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'సీబీఐ వాదన వినలేదు' అనే కారణంతోనే శ్రీలక్ష్మికి అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసిందని ధర్మాసనం గుర్తుచేసింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

25న పోలవరంపై ప్రధాని సమావేశం

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపు అంశంతో పాటు పలు సమస్యలపై ప్రధాని మోదీ నేతృత్వంలో 25న ప్రత్యేకంగా ప్రగతి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణతో పాటు సంబంధిత రాష్ట్రాలకు కేంద్రం సమాచారం అందించింది. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు, భూ సేకరణ, పునరావాసం-పునర్నిర్మాణం, ప్రజాభిప్రాయ సేకరణ ఇతరత్రా సాంకేతిక అంశాలపై తెలంగాణ సహా ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 25న సమావేశం నిర్వహించేందుకు కేంద్రం సిద్ధమైంది. ఆ రాష్ట్రాల సమస్యలను ప్రధాని తెలుసుకోనున్నారు.

మద్యం స్కాంలో మిథున్‌రెడ్డిదే కీలక పాత్ర

- ప్రధాన వ్యూహకర్త ఆయనే
- హైకోర్టులో సిట్ కౌంటర్
- ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు
- సిట్ అభ్యర్థన-నేడు విచారణ



అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం ప్రణాళికను రచించి, అమలు చేయడంలో వైసీపీ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిది కీలక పాత్ర అని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పేర్కొంది. ప్రధాన వ్యూహకర్త ఆయనేనని తెలిపింది. మిథున్‌రెడ్డితోపాటు ఈ కేసులోని ఇతర నిందితులు ముడుపుల రూపంలో రూ.3,600 కోట్ల అనుచిత లబ్ధి పొందారని, ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం కలుగజేశారని వెల్లడించింది. ఈ మేరకు సిట్ అదనపు ఎస్పీ, దర్యాప్తు అధికారి హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. '2019-24 మధ్య భారీ స్థాయిలో లిక్కర్ స్కాం జరిగింది. అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన లిక్కర్ పాలసీ ద్వారా ముడుపులు చెల్లించిన కంపెనీలకే మద్యం ఆర్డర్లు ఇచ్చారు. మిథున్‌రెడ్డి గతంలో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించిన అనంతరం దర్యాప్తులో కీలక పురోగతి ఉంది. కేసులో మొదటి నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేశాం. గతంలో సేకరించిన ఆధారాలతో తాజా ఆధారాలను సరిపోల్చి చూస్తే మద్యం కుంభకోణం ప్రణాళిక రచించి దానిని అమలు చేయడంలో మిథున్‌రెడ్డిదే కీలక పాత్ర అని వెల్లడైంది. ఒక మద్యం తయారీ కంపెనీ నుంచి ఆయన కుటుంబ సభ్యులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌కు సొమ్ము బదిలీ అయినట్లు గుర్తించాం. ఆయన తన ఎంపీ పదవిని దుర్వినియోగం చేసి తనతోపాటు ఇతర నిందితులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చారు. నచ్చిన కంపెనీలకు ఆర్డర్లు ఇచ్చేందుకు వీలుగా గతంలో ఉన్న ఆటోమేషన్ విధానం స్థానంలో మాన్యువల్ విధానం తీసుకొచ్చారు. మెజారిటీ ముడుపులను బంగారం, నగదు రూపంలో స్వీకరించారు. ముడుపులు తనతోపాటు కుటుంబ సభ్యులు, సహచరులకు వచ్చేలా ప్రణాళిక రచించారు. ఆయనకు సంబంధం ఉన్న కంపెనీకి వివిధ మార్గాల ద్వారా రూ.5 కోట్లు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు మిథున్‌రెడ్డిని కస్టడీలో విచారించాలి. మద్యం అమ్మకాల విషయంలో తమతో కలిసి పనిచేస్తే ఐఏఎస్ అధికారిగా పదోన్నతి కల్పిస్తామని అప్ప టి ఏపీఎస్‌బీసీఎల్ అసిస్టెంట్ సెక్రటరీ సత్యప్రసాద్‌కు మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారు. మద్యం కంపెనీల నుంచి ముడుపుల రూపేణా నెలకు రూ.50 నుంచి 60 కోట్లు ఆర్జించవచ్చని మిథున్‌రెడ్డి, అప్పటి ఎంపీ విజయ్‌సాయిరెడ్డి అంచనాకు వచ్చారు. మద్యం పాలసీ అమలులోకి వచ్చాక ఆ సొమ్మును కసిరెడ్డి ప్రతి నెలా మిథున్‌రెడ్డి, ఇతర నిందితులకు చేరవేశారు. మద్యం ముడుపుల కుట్రను పక్కాగా అమలు చేసేందుకు మిథున్‌రెడ్డి ఇతర నిందితులతో తరచూ సమావేశాలు నిర్వహించేవారు. 2019-24 మధ్య ప్రతి లిక్కర్ కేస్ మూల ధరలో 20శాతం సొమ్మును ముడుపుల రూపంలో వసూలు చేశారు. 2019 నుంచి 24 వరకు ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసిన కంపెనీల లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయి. మిథున్‌రెడ్డి దర్యాప్తునకు సహకరించడం లేదు. ముందస్తు బెయిల్ ఇస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి' అని అఫిడవిట్‌లో కోరారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వ్యవహారంలో గతేడాది సెప్టెంబరు 23న సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటర్ వేయాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. సిట్ కౌంటర్‌పై గురువారం కోర్టు విచారణ జరుపనుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.